www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గ్రీన్ హైడ్రోజన్‌లో ఏపీ టాప్

మెరుగైన విధానాల రూపకల్పనతో ముందంజ

కర్బన ఉద్గారాల తగ్గింపులో కర్ణాటక బెస్ట్ 11

ఓవరాల్ ప్రదర్శనలో మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్

పునరుత్పాదకంలో వెనకబడ్డ తెలంగాణ, బెంగాల్

స్వచ్ఛ ఇంధన పరివర్తనపై ఎస్ఈటీ నివేదిక



మంగళవారం | 24-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 349 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి ఉ.7.02, అష్టమి తె.4.51 వరకు, నక్షత్రం: కృత్తిక మ.3.07 తదుపరి రోహిణి, వర్జ్యం: తె.6.08 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8.59-9.46, రా.10.20-11.08, అమృతఘడియలు: మ.12.51-2.21, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.40, సూర్యాస్తమయం: 6.16 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సుబ్రహ్మణ్య స్వామికి ఎదురుదెబ్బ



ఏకసభ్య కమిటీపై పిటిషన్ కొట్టివేసిన సుప్రీం

నేర విచారణ, బాధ్యుల నిర్ధారణ వేర్వేరు అంశాలు

సిట్ దర్యాప్తు, ప్రభుత్వ విచారణ మధ్య వైరుధ్యం లేదు

పాలనా లోపాలపై విచారణకు రాష్ట్రం ఆదేశించవచ్చు

సిట్, ఏకసభ్య కమిటీ రెండూ విచారణ జరపొచ్చు

పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలకు ఆధారం లేదు

కమిటీపై స్టే ఇచ్చేందుకు సీజేఐ బెంచ్ నిరాకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల కల్తీ నెయ్యి కేసులో సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన సీబీఐ సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా పాలనాపరమైన చర్యలు తీసుకునేందుకుగాను చంద్రబాబు ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీకి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏకసభ్య కమిటీ విచారణపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. దీనిపై బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. సిట్ దర్యాప్తు, ప్రభుత్వ విచారణల మధ్య వైరుధ్యం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. సిట్ దర్యాప్తు పూర్తయిన నేపథ్యంలో, ఏపీ ప్రభుత్వం చేపట్టిన పరిపాలనా పరమైన విచారణపై ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపింది. కల్తీ నెయ్యి వ్యవహారంలో పాలనాపరమైన చర్యలు తీసుకోవాలన్న సిట్ ప్రతిపాదన మేరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ నేతృత్వంలో చంద్రబాబు ప్రభుత్వం ఏకసభ్య కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఆ వ్యవహారం జరిగినపుడు టీటీడీలో, పాలకమండలిలో పనిచేసినవారిపై

మిగతా 14వ పేజీలో...

'కల్తీ' బాధ్యులను కాపాడేందుకే పిటిషన్!

దురుద్దేశంతోనే వేశారు.. కల్తీ నెయ్యి వ్యవహారంలో గతంలోనూ పిల్

బాధ్యులను కాపాడేందుకే పాలనా చర్యలను నీరుగార్చాలని చూస్తున్నారు.. లూథ్రా వాదన



సిట్ బృందం విచారణ పూర్తిచేసి చార్జిషీట్‌తోపాటు సప్లిమెంటరీ చార్జిషీటు కూడా దాఖలు చేసింది. క్రిమినల్ విచారణ దాని పరిధిలోని అంశం. అయితే, పరిపాలనాపరమైన లోపాలు, నిర్లక్ష్యం లేదా క్రిమినల్ నిర్లక్ష్యానికి కూడా అవకాశం ఉండొచ్చు కదా? దానిని మనం ఎలా తోసిపుచ్చగలం? అయితే, ఇవన్నీ ప్రభుత్వ యంత్రాంగం పరిధిలోకి వచ్చే అంశాలు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిటీని నియమించింది. పరిపాలనా పరమైన లోపాలు ఎక్కడ జరిగాయి? బాధ్యులు ఎవరు? పర్యవసానాలు ఏమిటి? వంటి అనేక అంశాలను తేల్చడానికే కమిటీని నియమించినట్లు కనిపిస్తోంది. అందువల్ల పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలకు ఆధారం కనిపించడం లేదు.

- సుప్రీంకోర్టు సీజేఐ ధర్మాసనం

కల్తీపై నేడు అసెంబ్లీలో చర్చ

ఉ.10.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు

10 మంది కూటమి ఎమ్మెల్యేలకు మాట్లాడే చాన్స్

మధ్యాహ్నం 12.30కు సీఎం ప్రసంగం

తిరుమలలోనూ స్వర్ణ దేవాలయ తరహా నిబంధనలు

అన్యమతస్థుల డిక్లరేషన్ మరింత కఠినంగా అమలు

చంద్రబాబు సమక్షంలో మంత్రుల సూచనలు 13

సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ స్వామిది కాదు.. వైసీపీదే: సీఎం



కల్తీపై శాసనమండలిలో 26న చర్చ



అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

'రెవెన్యూ'కు ఫ్రెష్ లుక్!

ఆ శాఖను దారిలోకి తీసుకురావాలి

భూముల రీసర్వేతో అన్ని సమస్యలూ పోవాలే తప్ప.. కొత్త వివాదాలు రాకూడదు

ఏసీబీ దాడులు చేసే పరిస్థితి ఉండొద్దు

పనిచేయని తహసీల్దార్లను పక్కనపెట్టండి

ప్రభుత్వ సేవలపై ప్రజల్లో మరింత అవగాహనకు ప్రత్యేక కార్యాచరణ

ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత కనిపించకూడదు

ఆలయాల్లో సదుపాయాలు మెరుగుపడాలి

పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజీ

వివిధ శాఖలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రెవెన్యూను దారిలోకి తీసుకొచ్చి.. ఆ శాఖకు ఫ్రెష్ లుక్ తీసుకురావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు రెవెన్యూ శాఖ అవినీతి రహితంగా

మిగతా 12వ పేజీలో...

సంక్షేమానికి బడ్జెట్ పెంచాం

ఆర్థిక అసమానతలు తగ్గిస్తాం

అన్ని వర్గాలకూ న్యాయం చేస్తాం

సామాజిక సమానత్వం తెస్తాం

బీసీల రిజర్వేషన్ల పెంపునకు కసరత్తు.. అసెంబ్లీలో సీఎం

ఉగాదికి మెగా 'జాబ్ క్యాలెండర్'

గత రెండేళ్లలో కేజీబీవీల ఫలితాలు మెరుగు 13

ఇప్పుడు అడ్మిషన్లకు పోటీ

ఉత్తరాంధ్రలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నాం

అసెంబ్లీలో లోకేశ్ వెల్లడి

ఉగ్రవాదంపై 'ప్రహారం'

7 కీలక అంశాలతో తొలి 'కౌంటర్ టెర్రరిజం పాలసీ'ని ఆవిష్కరించిన కేంద్రం

దాడుల నివారణ, సత్వర ప్రతిస్పందన, అంతర్గత సామర్థ్యాల పెంపు, అంతర్జాతీయ సహకారంపై దృష్టి 2

పేదరికం, నిరుద్యోగం తగ్గింపునకు చర్యలతో ఉగ్రవాదానికి అడ్డుకట్ట యత్నం

లవ్ మ్యారేజా..? తల్లిదండ్రులకు చెప్పాల్సిందే!

వివాహ రిజిస్ట్రేషన్ చట్టానికి గుజరాత్ సర్కార్ సవరణలు 2

లవ్ జిహాద్, మోసగాళ్లను అడ్డుకోవడమే లక్ష్యమని వెల్లడి

పాలకూట విషం!

కాసుల కక్కుర్తితో వ్యాపారుల కల్తీ పా'పాలు'

యూరియా, కెమికల్స్, ఇతర పదార్థాల వినియోగం

అప్పుడే తీసిన పాలలా తెల్లని నురుగు

అత్యాశతో ప్రజల ప్రాణాలతో చెలగాటం

నాలుగో వంతు పాల విక్రయాలు ఇళ్ల ముందే

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో విరివిగా..

నాణ్యతను పరీక్షించే యంత్రాంగం ఏదీ?

విడి పాల విక్రయాలపై అజమాయిషీ కరువు

ఇదే అదునుగా కొందరి కల్తీ దందా

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలూ పేరుకే

డెయిరీలు, కలెక్షన్ సెంటర్లకే మిల్క్ యాక్ట్

రోజూ నిద్ర లేవగానే చిన్నారులు, మహిళలు, ఇంటిల్లిపాదికీ పాలు లేకపోతే ఉదయం గడవదు. సైకిళ్లు, మోటార్ సైకిళ్లపై పాల క్యాన్లతో వ్యాపారులు ఇళ్ల ముందు వాలిపోతుంటారు. చిరువ్యాపారులు తీసుకొచ్చే గేదె, ఆవు పాలు స్వచ్ఛంగా ఉంటాయని భావించి చాలామంది వారి వద్ద కొనుగోలు చేస్తుంటారు. అయితే వినియోగదారుల నమ్మకాన్ని కొంతమంది వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కాసుల కక్కుర్తితో స్వచ్ఛమైన పాలలో నీళ్లతో పాటు పంటలకు ఎరువుగా వేసే యూరియా కలిపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇళ్ల ముందు విడిగా అమ్ముకునే పాలల్లో నాణ్యతను పరీక్షించే యంత్రాంగం ఎక్కడా లేదు. ఇదే అదునుగా కొందరు కల్తీపా'పాలు' చేస్తున్నారు.

100 లీటర్ల పాలల్లో 100 లీటర్ల నీళ్లు, 10 కిలోల యూరియా కలిపి కల్తీ పాలు తయారీ చేస్తున్నట్లు సమాచారం. పాలు చిక్కగా, నురుగుతో కనిపించడానికి యూరియా.. వెన్న శాతం తగ్గకుండా ఉండటానికి కొన్ని ఫ్లేవర్లతో కూడిన పదార్థాలు వాడుతున్నట్లు తెలిసింది. 45 కిలోల యూరియా బస్తా కేవలం రూ.298. 10 కిలోల యూరియా ధర రూ.70 లోపు ఉంటుంది. విడిగా లీటరు పాల ధర రూ.80. అనేక రెట్లు సొమ్ము వస్తుందనే దురాశతో కొందరు వ్యాపారులు కల్తీ పాపానికి ఒడిగడుతున్నట్లు పాల నిపుణులు చెప్తున్నారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తల్లి పాల వలే.. పాడి పశువుల నుంచి వచ్చే పాలు కూడా స్వచ్ఛమైనవని, కల్తీ ఉండదని అంతా భావిస్తారు. కానీ చూడగానే తెల్లటి నురుగు పొంగుతో చిక్కగా కనిపించే పాలల్లో కల్తీ..! గేదెలు, ఆవుల నుంచి తీసే పాలు కొందరు వ్యాపారుల వద్దకు రాగానే కేవలం కల్తీనే కాదు.. విషంగా మారుతున్నాయి..! కాసుల కక్కుర్తితో పాలల్లో చేస్తున్న కల్తీ.. అమాయక ప్రజల ప్రాణాలు తీస్తోంది. తాజాగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో

మిగతా 14వ పేజీలో...



కల్తీ పాలే కాటేశాయి!

రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో.. ఐదుకు చేరిన మృతులు.. నలుగురి పరిస్థితి విషమం

మృతుల కుటుంబాలకు 10 లక్షల పరిహారం

బాధితుల వైద్య ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుంది

సీఎం చంద్రబాబు ప్రకటన.. అధికారులపై సీరియస్

పూర్తిస్థాయి విచారణకు ఆదేశం.. పాల వ్యాపారి అరెస్టు

శివరాత్రికి తాగిన పాలతోనే సమస్య అనే అనుమానం

డాలర్‌తో డ్రాగన్ ఢీ

అమెరికా కరెన్సీ ఆధిపత్యానికి అడ్డుకట్ట కట్టే దిశగా..

పలు దేశాలను కూడగట్టుకుని పోరు ప్రారంభించిన చైనా

ఈ-యువాన్లు, ఎంబ్రిడ్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా చెక్ పెట్టే ఎత్తుగడ

అదే బాటలో పయనించేందుకు ప్రయత్నిస్తున్న భారత్

రష్యా, శ్రీలంక తదితర దేశాలతో ఇప్పటికే రూపీ ట్రేడింగ్

పలు దేశాల చెల్లింపుల వ్యవస్థలతో యూపీఐ లింకు

డాలర్‌కు ప్రత్యామ్నాయం ఆలోచిస్తే 100% సుంకాలు వేస్తా!

బ్రిక్స్ దేశాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక



(సెంట్రల్ డెస్క్)

పెట్రోల్ కొనాలంటే.. డాలర్లు కావాలి! ఎలక్ట్రానిక్స్ చిప్స్, సెమీ కండక్టర్స్ కొనాలన్నా.. డాలర్లు కావాలి!! వజ్రాలు, ఔషధాల తయారీకి కావాల్సిన ముడిపదార్థాలు, ఎరువులు, విదేశాల నుంచి కొనే యుద్ధవిమానాలు, ఇతర రక్షణ పరికరాలు, వంటనూనెలు.. ఏది కొనాలన్నా డాలర్లే కావాలి! దాదాపు ఏడెనిమిది దశాబ్దాలుగా ప్రపంచ విపణిలో ఇలా సర్వం సహాధిపత్యాన్ని

మిగతా 11వ పేజీలో...

కేసు : రఘురామకృష్ణరాజు టార్చర్ వ్యవహారం

అరెస్టు జరిగింది : పట్నాలో.. చేసింది : ఏపీ పోలీసులు

సీన్ : సీనియర్ ఐపీఎస్, బిహార్ పోలీసుల హల్‌చల్



సునీల్ నాయక్ అరెస్టులో

హైడ్రామా

రఘురామ టార్చర్ కేసులో పట్నాలో అదుపులోకి తీసుకున్న ఏపీ పోలీసులు

కోర్టు ట్రాన్సిట్ వారెంటు ఇవ్వకపోవడంతో కొద్ది గంటల్లోనే విడుదల

ఎస్పీ దామోదర్ నేతృత్వంలో ఉదయాన్నే ఆయన ఇంటికి పోలీసు బృందం

అరెస్టు చేస్తున్నట్లు తల్లికి నోటీసులు.. తీసుకెళ్లకుండా అడ్డుకున్న హోంగార్డులు

దామోదర్ బృందంపై ఓ సీనియర్ ఐపీఎస్ దుర్భాషలు

స్థానిక పోలీసుల సాయంతో నాయక్‌కు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు

ట్రాన్సిట్ వారెంటు కోసం అక్కడి కోర్టుకు.. జారీకి న్యాయాధికారి నిరాకరణ

30 రోజుల వరకు చర్యలొద్దని ఆదేశం.. నాయక్‌ను తమతో తీసుకెళ్లిపోయిన బిహార్ పోలీసులు.. పట్నా హైకోర్టును ఆశ్రయించే యోచనలో ఏపీ పోలీసులు!

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో మరో సంచలనం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడైన (ఏ-6) నాటి సీఐడీ డీఐజీ, ప్రస్తుతం

మిగతా 12వ పేజీలో...

ఏఐ.. నాగరికతలో పెద్ద మార్పు!

కృత్రిమ మేధ కేవలం సాంకేతిక సాధనం కాదు

అది మన జీవన విధానాన్ని మార్చేసే టెక్నాలజీ

దానివల్ల ఇక ప్రవేశ స్థాయి ఉద్యోగాలుండవు

నేరుగా మధ్య స్థాయి కొలువులే ఉంటాయి

నైపుణ్యాలు ఉన్న వారికి అద్భుత అవకాశాలు

ఏఐలో ప్రపంచానికి నేతృత్వం వహించే సత్తా మనది: టీసీఎస్ అధ్యక్షుడు రాజన్న



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ) ఇప్పుడు ఒక సాంకేతిక సాధనం మాత్రమే కాదని.. అది సమాజం, వ్యాపారం, జీవన విధానాలను ప్రభావితం చేసే నాగరికత మార్పుగా రూపాంతరం చెందుతోందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్, సర్వీసెస్ అధ్యక్షుడు వి.రాజన్న పేర్కొన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు..

ఏఐతో.. ముఖ్యంగా ఆంత్రోపిక్ ఏఐ ప్లగిన్స్ వంటివాటితో ఐటీపై పడే ప్రభావం?

వ్యక్తుల నుంచి సంస్థల వరకు.. సమూల

మిగతా 11వ పేజీలో...

64 దేశాలకు మిత్ర బృందాలు

- ఉభయ సభల ఎంపీలతో ఏర్పాటుచేసిన స్పీకర్ బిర్లా
- పలు బృందాలకు పురందేశ్వరి, లావు, మాగుంట, మిథున్ నేతృత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: పార్లమెంటు సభ్యులతో విదేశీ స్నేహపూర్వక బృందాలను స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా ఏర్పాటు చేశారు. 64 దేశాలకు చెందిన చట్టసభలతో, ఎంపీలతో అనుబంధం, అనుసంధానం కోసం ఏర్పాటుచేసిన ఈ బృందాల్లో ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలకు కూడా చోటు కల్పించారు. "ఖండాంతర దేశాలకు చెందిన ఎంపీలను బృందాల సభ్యులు కలిసి, పరస్పరం అనుభవాలను పంచుకుంటారు. అక్కడి చట్ట సభల గురించి తెలుసుకుంటారు. మన శాసన వ్యవస్థల గురించి వారికి పరిచయం చేస్తారు. పార్లమెంటరీ సంప్రదాయ దౌత్య సంబంధాలను నెలకొల్పడం లక్ష్యంగా మన బృందాలు పనిచేస్తాయి" అని స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా తెలిపారు. కాగా, ఈ బృందాల్లో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శ్రీలంక బృందానికి నేతృత్వం వహిస్తారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి నేతృత్వంలో క్యూబా బృందం, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు నాయకత్వంలో మాల్దీవులు బృందం పనిచేస్తుంది. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి 'బాల్టిక్స్' బృందానికి నాయకత్వం వహిస్తారు. వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీకి జపాన్ బృందంలో చోటు దక్కగా, ఆ బృందానికి మరో కాంగ్రెస్ ఎంపీ (చండీగఢ్) మనీశ్ తివారీ నేతృత్వం వహించనున్నారు.

ఇరాన్‌లో ఉన్న భారతీయులంతా వచ్చేయాలి

- తాజా నిరసనలతో కేంద్రం సూచన
- 10వేల మందికిపైగా ఉన్నట్లు అంచనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఇరాన్‌లో విద్యార్థులు మళ్లీ ఆందోళనలను ఉధృతం చేసిన నేపథ్యంలో అక్కడ ఉన్న భారతీయులంతా వెంటనే తిరిగి ఇండియాకు వచ్చేయాలని భారత ప్రభుత్వం సూచించింది. ఇరాన్‌పై అమెరికా ఎప్పుడైనా దాడి చేయవచ్చన్న అంచనాలను ప్రస్తావించింది. ఈ మేరకు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. నిరసనలు జరిగే ప్రాంతాలకు వెళ్లవద్దని కోరింది. భారతప్రభుత్వ లెక్కల ప్రకారంఇరాన్‌లో 10వేల మందికి పైగా భారతీయులు ఉన్నారు. ఇందులో విద్యార్థులు, టూరిస్టులు, ఉపాధి కోసం వెళ్లినవారు ఉన్నారు. ఇరాన్‌లో ఇటీవల జరిగిన దేశవ్యాప్త ఆందోళనలను ఆ దేశ ప్రభుత్వం అత్యంత పాశవికంగా అణచివేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, వారం రోజుల్లో అణుబాంబును తయారు చేయడానికి పనికివచ్చేలా యురేనియాన్ని ఇరాన్ ఇప్పటికే శుద్ధి చేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ అన్నారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యురేయాన్ని ఆయుధాలు చేయడానికి అనుగుణంగా శుద్ధి చేసి సిద్ధంగా పెట్టుకున్నందునే ఇరాన్ అణు చర్చల్లో మొండిగా వ్యవహరిస్తోందని విట్కాఫ్ పేర్కొన్నారు.

ఈపీఎఫ్‌వో అన్‌క్లెయిమ్డ్ ఖాతాల నుంచి నేరుగా బ్యాంకు అకౌంట్లో సొమ్ము జమ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) చందాదారులకు కేంద్ర ప్రభుత్వం మరో ప్రయోజనాన్ని కలిగించనుంది. ఎవరూ క్లెయిమ్ చేయని మొత్తాలను సంబంధిత ఖాతాదారుల బ్యాంకు అకౌంట్లలో ఆటోమేటిక్‌గా జమ చేయాలని నిర్ణయించింది. తొలుత రూ.1000లోపు నిల్వ ఉన్న చిన్న ఖాతాలకే ఇది వర్తిస్తుంది. వరుసగా మూడేళ్లపాటు సొమ్ము జమ చేయడంగానీ, విత్‌డ్రా చేయడంగానీ జరగని ఖాతాలను మురిగిపోయిన ఖాతాలుగా పరిగణించనుంది. వాటిల్లో నిల్వ ఉన్న సొమ్మును నేరుగా ఖాతాదారుల అకౌంట్లలో జమ కానుంది. మొత్తం 31.85 లక్షల ఖాతాలు నిర్వహణలో లేవని ఈపీఎఫ్ఓ గుర్తించింది. వీటిలో రూ.10,903 కోట్లు ఉన్నట్టు అంచనా. బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసి ఉంటే, ఈపీఎఫ్ఓ వద్ద ఉన్న వివరాలు ఆధారంగా ఎలాంటి క్లెయిమ్ సెటిల్‌మెంట్ పత్రాలు అవసరం లేకుండా నేరుగా సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

తేజస్ యుద్ధ విమానంలో బ్రేక్ ఫెయిల్?

బెంగళూరు, ఫిబ్రవరి 23: స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన తేలిక పాటి యుద్ధ విమానం(ఎల్‌సీఏ) తేజస్ వరుస ప్రమాదాలు వాయుసేనను ఆందోళనకు గురిచేస్తోంది. ఈనెల 7న ఓ ఫ్రంట్‌లైన్ ఎయిర్‌బేస్‌లో తేజస్ విమానం అదుపుతప్పి రన్‌వేను దాటి ముందుకు వెళ్లిపోయింది. దీనికి ఆ విమానం బ్రేక్ ఫెయిల్యూర్ కారణమని అనుమానిస్తున్నారు. శిక్షణ ముగించుకుని ఈ బేస్‌కు ఆ విమానం వచ్చిన సమయంలో ప్రమాదం సంభవించింది. ప్రమాదాన్ని ముందే గ్రహించిన పైలట్ ఎజెక్ట్‌తో క్షేమంగా బయటపడ్డారు.

ఏఐ సదస్సులో 'కాంగ్రెస్' నిరసన విచారకరం

- 160 మంది విద్యావేత్తల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: గత వారం ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సు వద్ద యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్న నిరసన ప్రదర్శన నిర్వహించడాన్ని పలువురు విద్యావేత్తలు తప్పుబట్టారు. ఇది తీవ్ర విచారకరమని, తప్పుడు ఆలోచన అని దాదాపు 160మంది విద్యావేత్తలు సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఇది చట్టబద్ధమైన ప్రజాస్వామ్య అసమ్మతికి, ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను కాపాడుకునే ఆవశ్యకత మధ్య తేడాను గుర్తించడంలో ప్రతిపక్ష పార్టీ అసమర్థతను ప్రతిబింబిస్తుందని విమర్శించారు. ప్రతిష్ఠాత్మక ఏఐ సదస్సు దేశీయ రాజకీయ ప్రచారానికి వేదిక కాదన్నారు. ఈ ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో జేఎన్‌యూ వీసీ శాంతిశ్రీ, ఐఐటీ రూర్కీ డైరెక్టర్ కమల్ కిషోర్, ఐఐటీ ధార్వాడ్ డైరెక్టర్ వెంకప్పయ్య, ఐఐటీ జోధ్‌పూర్ డైరెక్టర్ అవినాశ్‌తో పాటు పలు యూనివర్సిటీల వీసీలు, ప్రొఫెసర్లు ఉన్నారు. కాగా, ఈ కేసులో ఇప్పటికి ఏడుగురిని అరెస్టు చేశారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టులు, నిర్బంధాన్ని కాంగ్రెస్ ఖండించింది. తమ కార్యకర్తలపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేసింది.

ప్రధాని పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కనిపించడం కన్నా సిగ్గుచేటు ఏముంది?: రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 : ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన కేబినెట్ సహచరుడి పేర్లు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కనిపించడం కన్నా, భారత్-అమెరికా ట్రేడ్ డీల్ ద్వారా భారత హక్కులను తాకట్టు పెట్టడంకన్నా సిగ్గు లేనిది ఏముంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం ప్రధానిపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ సిగ్గు లేని రాజకీయాలు చేస్తోందని ప్రధాని మోదీ ఆదివారం చేసిన విమర్శలను రాహుల్‌గాంధీ తిప్పికొడుతూ ఈమేరకు 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు.

వేలూరు సభలో విజయ్ కంటతడి

చెన్నై, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రవేశం చేసినప్పటి నుంచి తమిళ ప్రజలంతా తనపై విపరీతమైన ఆదరాభిమానాలను ప్రదర్శిస్తున్నారని, తాను, తమిళ ప్రజలు వేర్వేరు కాదనే భావనతోనే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యానని తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ నాయకుడు, నటుడు విజయ్ అన్నారు. వేలూరులో సోమవారం పార్టీ నిర్వాహకుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ తమిళ ప్రజలను తనను విడదీసేందుకు కుట్ర జరుగుతోందంటూ కంటతడిపెట్టారు. కరూర్ తొక్కిసలాట ఘటనకు తానే కారణమని సీఎం స్టాలిన్ ఆరోపించడాన్ని ప్రస్తావించారు. ఈ అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడు ప్రజలకు, డీఎంకేకు మధ్య జరుగనున్న యుద్ధమని, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే విజయ్, స్టాలిన్ మధ్య జరగబోయే భీకర సంగ్రామమని అన్నారు.

కేంద్ర మాజీ మంత్రి ముకుల్ రాయ్ కన్నుమూత



కోల్‌కతా, ఫిబ్రవరి 23: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చాణక్యుడిగా పేరొందిన కేంద్ర మాజీ మంత్రి ముకుల్ రాయ్(71) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. రెండేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. సాల్ట్‌లేక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ముకుల్ రాయ్ తన 4దశాబ్దాల రాజకీయ ప్రయాణంలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ), బీజేపీల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. యూపీఏ-2 ప్రభుత్వంలో మొదట నౌకాయానశాఖ సహాయ మంత్రిగా, తర్వాత రైల్వే మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

ఉగ్రవాదంపై 'ప్రహారం'

- 7 కీలక అంశాలతో తొలి 'కౌంటర్ టెర్రరిజం పాలసీ'ని ఆవిష్కరించిన కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడమే లక్ష్యంగా.. 'ప్రహార్' పేరుతో భారత ప్రభుత్వం దేశపు మొట్టమొదటి ఉగ్రవాద వ్యతిరేక విధానాన్ని రూపొందించింది. కేంద్ర హోం శాఖ సోమవారం దీన్ని ఆవిష్కరించింది. పొరుగున్న ఉన్న కొన్ని దేశాలు కొన్నిసార్లు ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధాన సాధనంగా ఉపయోగించాయంటూ.. పేరు ప్రస్తావించకుండా పాకిస్థాన్‌ను విమర్శించింది. "భారతదేశం చాలాకాలంగా సరిహద్దుల్లో ప్రాయోజిత ఉగ్రవాదంతో (స్పాన్సర్డ్ టెర్రరిజం) ప్రభావితమై ఉంది. అల్‌ఖాయిదా, ఇస్లామిక్ స్టేట్ వంటి ఉగ్రవాద గ్రూపుల లక్ష్యంగా భారత్ ఉంది. ఇవి స్లీపర్ సెల్స్ ద్వారా దేశంలో హింసను ప్రేరేపించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఉగ్రవాదులు విదేశాల నుంచి పనిచేస్తూ భారత్‌లో హింసను ప్రోత్సహించడానికి కుట్రలు పన్నారు. ఉగ్రవాద హ్యాండ్లర్లు పంజాబ్, జమ్మూకశ్మీర్‌లలో ఉగ్రదాడులు సులభతరం చేయడానికి డ్రోన్లు సహా పలు తాజా సాంకేతికతలను ఉపయోగిస్తున్నారు" అని గుర్తుచేసింది. అయితే.. భారతదేశం ఉగ్రవాదాన్ని ఏ ఒక్క నిర్దిష్ట మతానికో, జాతికో, జాతీయతకో, నాగరికతకో ముడిపెట్టదని స్పష్టం చేసింది. ఉగ్రవాద గ్రూపులు భారతదేశంలో సులభంగా దాడులు చేయడానికి వ్యవస్థీకృత నేర నెట్‌వర్క్‌లను ఉపయోగిస్తున్నాయని.. ఉగ్ర ప్రచారానికి, సమాచార సరఫరాకు, నిధుల చేరవేతకు, దాడులకు మార్గనిర్దేశం చేయడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను, మెసేజింగ్ యాప్స్‌ను ఉపయోగిస్తున్నాయని.. డార్క్‌వెబ్, ఎన్‌క్రిప్షన్, క్రిప్టో వాలెట్ల వంటివి ఉగ్రవాదులు అత్యంత రహస్యంగా పనిచేయడానికి వీలు కల్పిస్తున్నాయని.. ఈ పరిణామాలన్నీ ఉగ్రవాదుల నీచ పథకాలను ఛేదించడాన్ని, వారికి నిధులు అందే మార్గాలను కష్టతరం చేస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చింది. ఈ సమస్యలన్నింటినీ అధిగమించే బహుళ అంచెల వ్యూహంతో.. కొత్త కౌంటర్ టెర్రరిజం విధానాన్ని రూపొందించినట్టు తెలిపింది. ఉగ్రవాదులకు, వారికి మద్దతిచ్చేవారికి, ఆర్థికంగా అండగా నిలిచేవారికి నిధులు, ఆయుధాలు, దాక్కోవడానికి సురక్షిత ప్రాంతాలు అందకుండా చేయడం ద్వారా టెర్రరిజాన్ని నిర్వీర్యం చేయడమే ఈ విధానం ఉద్దేశం. దేశీయంగా, విదేశాల నుంచి ఎదురయ్యే ఉగ్ర ముప్పులను ఎదుర్కొనేందుకు కేంద్రం ఈ పాలసీని ఏడు మూలస్తంభాల ఆధారంగా రూపొందించింది. అవి..

నివారణ: నిఘా వర్గాల సమాచారంతో ఉగ్రదాడులను ముందే పసిగట్టి అడ్డుకోవడం

ప్రతిస్పందన: దాడి జరిగినప్పుడు వేగంగా స్పందించడం

మానవహక్కులు, చట్టబద్ధమైన పాలన: ఉగ్రవాద ఆరోపణలు ఎదుర్కొనేవారి పట్ల రాజ్యాంగబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించడం. ఎవరికో అన్యాయం జరిగిందన్న భావన రాకుండా.. ఉగ్రవాదులను చట్టప్రకారం శిక్షించడం.

ఉగ్రవాద అనుకూల పరిస్థితుల నిర్మూలన: ఉగ్రవాదులను పట్టుకోవడమే కాదు.. ఎవరైనా ఎందుకు ఉగ్రవాదం వైపు ఆకర్షితులవుతున్నారో గుర్తించి, అందుకు కారణమవుతున్న పరిస్థితులను.. అంటే మూలాలను తొలగించడం. ఉదాహరణకు.. పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలను ఉగ్రవాదులు తమకు అనుకూలంగా వాడుకుని యువతను ఆకర్షిస్తున్నారని.. ప్రభుత్వ పథకాల ద్వారా ఈ సమస్యలకు చెక్‌పెడుతున్నామని హోం శాఖ తెలిపింది.


అంతర్జాతీయ సహకారం: ఇతరదేశాల సహకారంతో ఉగ్రవాద నెట్‌వర్క్‌లను దెబ్బతీయడం.

పునరావాసం, తిరిగి దృఢంగా నిలబడడం: ఉగ్రదాడుల బాధితులకు అండగా నిలబడడం. ఎందుకంటే.. ప్రజలను భయకంపితులను చేయడమే ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యం. అలా భయపడకుండా ప్రజలు త్వరగా తిరిగి సాధారణ జీవనం గడిపేలా చేయగలిగితే ఉగ్రవాదుల లక్ష్యం విఫలమైనట్టే. ఇందుకోసం వైద్యులు, మనస్తత్వ శాస్త్రనిపుణులు, లాయర్లు, స్వచ్ఛంద సంస్థలు, మతపెద్దల సహకారాన్ని తీసుకుంటామని కేంద్రం పేర్కొంది.



అంతర్గత సామర్థ్యాల పెంపు

ఉగ్రవాదాన్ని సమర్థంగా నిరోధించేందుకు దేశంలోని వివిధ భద్రత, దర్యాప్తు సంస్థల బలాన్ని పెంచడం. కేంద్ర ఏజెన్సీలు, రాష్ట్రాల పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేసేలా చూడడం. (ఇంటెలిజెన్స్ బ్యూరోలోని మల్టీ ఏజెన్సీ సెంటర్, జాయింట్ టాస్క్ ఫోర్స్ ఆన్ ఇంటెలిజెన్స్ ద్వారా కేంద్ర సంస్థలు, రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సన్నిహిత భాగస్వామ్యం ఇప్పటికే ఏర్పడిందని హోం శాఖ తన ప్రకటనలో పేర్కొంది).



కిస్త్వాడ్ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు ఉగ్రవాదుల హతం

- ఫలించిన 326 రోజుల నిఘా


టైసన్ జాగిలం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: జమ్మూ-కశ్మీర్‌లోని కిస్త్వాడ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తం ఏడుగురు కరుడుగట్టిన ఉగ్రవాదులు హతమైనట్టు సోమవారం మిలటరీ వర్గాలు తెలిపాయి. మంచుతో నిండిన చత్రూ కొండల్లోని అడవుల్లో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో జైష్ ఎ మహమ్మద్ సీనియర్ కమాండర్ సైపుల్లా సహా ముగ్గురు మరణించినట్టు ఆదివారం ప్రకటించగా ఆ సంఖ్య పెరిగినట్టు తాజాగా వెల్లడించాయి. ఆర్మీకి చెందిన వైట్ నైట్ కార్ప్స్, పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఇతర దళాలు సమన్వయంతో వ్యవహరించి ఉగ్రవాదులను మట్టుబెట్టినట్టు పేర్కొన్నాయి. ఆపరేషన్ ట్రాషీ-ఐ పేరుతో 326 రోజుల పాటు నిఘా పెట్టి ఎట్టకేలకు ఉగ్రవాదుల ఉనికిని గుర్తించాయి. కొండ కింద ఓ మట్టి ఇంట్లో దాక్కొన్న ఉగ్రవాదులు తొలుత కాల్పులు జరపగా, భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులకు దిగాయి. కాల్పుల కారణంగా ఆ ఇంట్లో మంటలు వ్యాపించడంతో ఉగ్రవాదుల శవాలు గుర్తుపట్టలేని రీతిలో కాలిపోయాయి. ఈ పోరులో మిలటరీ జాగిలం జర్మన్ షెపర్డ్ జాతికి చెందిన 'టైసన్' ప్రముఖ పాత్ర పోషించినట్టు ఆపరేషన్‌ను పర్యవేక్షించిన మేజర్ జనరల్ ఎ.పి.ఎస్.బల్ చెప్పారు. తొలుత ఆ మట్టి ఇంట్లోకి దూరి ఉగ్రవాదులను గుర్తించినది టైసనేనని తెలిపారు. మొదటి బుల్లెట్ కూడా టైసన్‌కు తగిలిందని, తీవ్ర గాయం కావడంతో వాయు మార్గంలో ఉధంపూర్ ఆస్పత్రికి తరలించినట్టు వివరించారు.

లవ్ మ్యారేజా..? తల్లిదండ్రులకు చెప్పాల్సిందే!

- వివాహ రిజిస్ట్రేషన్ చట్టానికి గుజరాత్ సర్కార్ సవరణలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 : గుజరాత్‌లో వివాహ రిజిస్ట్రేషన్ చట్టం నిబంధనలకు పలు నూతన సవరణలు ప్రతిపాదించారు. అవి అమలులోకి వస్తే ఇకపై అక్కడ జరిగే ప్రతి వివాహానికి ఆయా జంటల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వివాహం చేసుకోబోయే ప్రతి జంట ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తప్పకుండా తెలియజేయాలి. వివాహ రిజిస్ట్రేషన్ అధికారులు కూడా తప్పనిసరిగా ఆయా జంటల తల్లిదండ్రులకు ఈ సమాచారం తెలియజేయాలి. గుజరాత్ అసెంబ్లీలో శుక్రవారం ప్రకటించిన ఈ సవరణలను లవ్ జిహాద్, తల్లిదండ్రులకు తెలియకుండా యువతీయువకులు వెళ్లిపోవడాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. గుజరాత్ హోం మంత్రి హర్ష్ సంఘ్వి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమాయక బాలికలు మోసగాళ్ల వలలో పడుతున్నారని, సమాజానికి వీరు చెద పురుగుల్లా మారారని పేర్కొన్నారు. ఈ సమస్యని ప్రభుత్వం ఇక ఉపేక్షించలేదన్నారు. కాగా ఈ సవరణలు న్యాయ సమీక్షను ఎదుర్కోవాల్సి ఉంది. వయోజనులు తమకు ఇష్టమైన వారిని వివాహం చేసుకోవడం అనేది రాజ్యాంగబద్ధమైన హక్కు అని సుప్రీంకోర్టు ఇప్పటికే అనేకసార్లు స్పష్టం చేయడం ఈ సందర్భంగా గమనార్హం. ఈ సవరణల ప్రకారం.. ప్రతి వివాహ రిజిస్ట్రేషన్ దరఖాస్తుతోపాటు యువతీయువకులు తమ తల్లిదండ్రులకు తెలియజేశారా.. లేదా అనే ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. దరఖాస్తులో యువ జంట తమ పేర్లు, చిరునామాలు, ఆధార్ వివరాలు, ఫోన్ నంబర్లు ఇవ్వాలి. ఆ వివరాలతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంతృప్తి చెందితే పది పని దినాల్లోపు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలి. 30 రోజుల అనంతరం వారి వివాహాన్ని నమోదు చేస్తారు.

నీట్‌కు సిద్ధం కావాలన్నందుకు తండ్రిని కాల్చి చంపిన కుమారుడు

- ఆ తర్వాత మృతదేహాన్ని ముక్కలు చేసి డ్రమ్ములో దాచిన అక్షత్..ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన

లఖ్‌నవూ, ఫిబ్రవరి 23: నీట్ పరీక్షకు సిద్ధం కావాలని పదేపదే ఒత్తిడి చేయడంతో ఆగ్రహానికి గురైన ఓ కుమారుడు, తన తండ్రిని తుపాకీతో కాల్చి చంపాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి డ్రమ్ములో దాచిపెట్టాడు. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో వెలుగుచూసింది. స్థానిక పాథాలజీ ల్యాబ్ యజమాని మానవేంద్ర ప్రతాప్ సింగ్ ఈనెల 20 నుంచి కనిపించకుండా పోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు అక్షత్(19)ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, అసలు నిజం బయటపడింది. తండ్రిని తానే చంపినట్లు విలపిస్తూ ఒప్పుకున్నాడు. అక్షత్ గతంలో ఇంటర్ (బైపీసీ) పూర్తి చేసి, ప్రస్తుతం బీకామ్ చదువుతున్నాడు. అయితే, డాక్టర్ కావాలని, నీట్ పరీక్షకు సిద్ధం కావాలని అతడిని తండ్రి నిరంతరం ఒత్తిడి చేస్తూ తిడుతుండేవాడని అక్షత్ చెప్పాడు.

బంగ్లాదేశ్ శరణార్థులకు పౌరసత్వం ఇస్తాం

- పశ్చిమబెంగాల్ ఓటర్లకు ప్రధాని మోదీ బహిరంగ లేఖ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముంగిట ప్రధాని మోదీ ఆ రాష్ట్ర ఓటర్లకు సోమవారం బహిరంగ లేఖ రాశారు. (బంగ్లాదేశ్‌లో) మతపరమైన అణచివేతకు గురై బెంగాల్‌కు వచ్చిన శరణార్థులకు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కింద పౌరసత్వం ఇస్తామని హామీ ఇచ్చారు. అక్రమ చొరబాటుదారుల సమస్య లేకుండా రాష్ట్రం సత్పరిపాలన మార్గంలో నడవాలని కోరుకుంటున్నానని తెలిపారు. తన సందేశాన్ని 'జై మహాకాళి' నినాదంతో ప్రారంభించారు. పారిశ్రామికాభివృద్ధిలో ఒకప్పుడు ముందున్న బెంగాల్.. ఇప్పుడు దుష్పరిపాలన, విభజన రాజకీయాలతో అల్లాడుతోందని.. జనం విసిగిపోయారని.. రాష్ట్రంలో మార్పు అనివార్యమని తెలిపారు. 'అతికొద్ది నెలల్లో రాష్ట్ర భవిష్యత్ నిర్ణయం కానుంది. వచ్చే తరం భవిష్యత్ ఎటువైపు సాగాలో మీ(ప్రజల) తీర్పుపైనే ఆధారపడి ఉంది. బెంగాల్లో నిరుద్యోగం ప్రబలుతోంది. మహిళల భద్రత ఆందోళన కలిగిస్తోంది. హింసాయుత సంస్కృతి వ్యాపించింది. మీరెంత కాలం మౌనంగా భరిస్తారు? రాష్ట్ర ప్రజలకు సేవ చేసేందుకు ఉత్సుకతతో ఉన్నాను. రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుందాం. 2026లో పురోగామి బెంగాల్ సృష్టికి సమష్టిగా సంకల్పం తీసుకుందాం' అని ప్రధాని పిలుపిచ్చారు.

తమిళనాడులో 97.37 లక్షల ఓటర్ల తొలగింపు

చెన్నై, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్ల తుది జాబితాను సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి అర్చనా పట్నాయక్ విడుదల చేశారు. జాబితాలోని వివరాల ప్రకారం.. సర్(ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) తర్వాత చేర్పులు, మార్పులు పోగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలతో 97.37 లక్షలమంది ఓటర్లను తొలగించినట్లు ఆమె తెలిపారు. సర్ ప్రక్రియకు ముందు రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 6.41 కోట్లుగా ఉండేదని చెప్పారు. డిసెంబరు 19నాటికి ఆ సంఖ్య 5,43,76,756కు తగ్గిందని, ఆ తర్వాత 27.53 లక్షల మంది అర్హులైన ఓటర్ల పేర్లను చేర్చామని వివరించారు.

సుప్రీంకోర్టు తీర్పు ఆసరాగా ఆటలాడాలని చూస్తే

భారీగా సుంకాలు వేస్తా!

ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, ఫిబ్రవరి 23: అదనపు సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీం కోర్టు తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా తమతో ఆటలాడాలని చూస్తే భారీగా సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. తీర్పు విషయంలో సుప్రీం కోర్టును మరోసారి లక్ష్యంగా చేసుకొని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానం తెలియకుండానే తన ప్రభుత్వానికి మరిన్ని అధికారాలు కట్టబెట్టిందన్నారు. టారిఫ్‌లపై కోర్టు తీర్పు 'అసమర్థంగా, హాస్యాస్పదం'గా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో ట్రంప్ వరుస పోస్టులు పెట్టారు. "సుప్రీంకోర్టు తెలిసో తెలియకో ఇచ్చిన అసమర్థ, హాస్యాస్పద, మూర్ఖపు, అంతర్జాతీయంగా విభేదాలు తెచ్చేలా తీర్పు ఇచ్చింది. ఆ తీర్పుతో అమెరికా అధ్యక్షుడిగా నాకు గతంలో లేనన్ని అధికారాలు ఇచ్చింది. మరింత శక్తిమంతం చేసింది" అని ట్రంప్ పేర్కొన్నారు. "సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకొని ఆటలాడాలని చూసే దేశాలపై ఎన్నడూలేని రీతిలో సుంకాలు విధిస్తా. అమెరికాను దశాబ్దాలుగా కొల్లగొట్టిన దేశాలు.. ఇటీవల అంగీకరించిన దానికంటే భారీ సుంకాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. సుంకాల ఆమోదం పొందడానికి అధ్యక్షుడిగా నేను కాంగ్రెస్‌కు తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదు" అంటూ ట్రంప్ హెచ్చరించారు. "అనేక ఏళ్లుగా అమెరికాను కొల్లగొట్టిన దేశాలపై ఇప్పుడు లైసెన్స్‌ల రూపంలో కఠిన చర్యలు తీసుకోవచ్చు. ఈ లైసెన్స్‌లకు ఫీజు వసూలు చేయడం కుదరదని తీర్పు చెబుతోంది. వాస్తవానికి ప్రతి లైసెన్స్‌కు ఒక ఫీజు ఉంటుంది. మరి మేం ఎందుకు వసూలు చేయకూడదు? అదేవిధంగా కోర్టు ఇతర సుంకాలను ఆమోదించింది. ఇప్పుడు వాటిని చట్టబద్ధంగా, కఠినంగా ఉపయోగించగలను. ఏదేమైనా కోర్టు తప్పుడు వ్యక్తులకు సాయం చేసింది. మున్ముందు 'జన్మతః పౌరసత్వం' విషయంలోనూ వ్యతిరేక తీర్పు ఇవ్వొచ్చేమో? ఇలాంటి తీర్పులు చైనా, ఇతర దేశాలకే ప్రయోజనాలు చేకూరుస్తాయి" అని మండిపడ్డారు. అలాగే తీర్పును వ్యతిరేకించిన ముగ్గురు జడ్జిలను గొప్పవారిగా ట్రంప్ అభివర్ణించారు.

నేటి నుంచి ఆ సుంకాలు బంద్!

ట్రంప్ వేసిన దిగుమతి సుంకాల వసూలును మంగళవారం (ఈ నెల 24) నుంచి నిలిపివేయనున్నారు. ఆ సుంకాలు రాజ్యాంగ విరుద్ధమంటూ అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ట్రంప్ భారీగా వేసిన అదనపు సుంకాల వసూలును నిలిపివేయనున్నట్లు ఆ దేశ కస్టమ్స్ విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. ఐఈఈపీఏ కింద విధించిన అదనపు సుంకాల వసూళ్లను నిలిపివేయనున్నట్లు వెల్లడించింది. అమెరికా దిగుమతి చేసుకునే భారతీయ ఉత్పత్తులపై ప్రస్తుతం 25% సుంకాలు ఉండగా.. మంగళవారం నుంచి అవి 10 శాతానికి తగ్గనున్నాయి. భారత దిగుమతులపై 150రోజుల పాటు 10% సుంకాలను వసూలు చేస్తారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్ని దేశాలపై 15 శాతం సుంకాలు వసూలు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, దానిపై అధికారిక ప్రకటన రాలేదు. "ప్రస్తుతం ఉన్న ఆదేశాల ప్రకారం భారత ఉత్పత్తులపై అమెరికా ఈ నెల 24 నుంచి 10 శాతం సుంకాలు వసూలు చేస్తుంది. 15 శాతంపై ఇప్పటివరకూ అధికారిక ప్రకటనేదీ లేదు" అని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య తెలిపింది.

మెక్సికోలో మాఫియా డాన్ ఎన్‌కౌంటర్

ఎల్ మెంచోను హతమార్చిన సైన్యం.. సమాచారం అందించి సాయపడిన అమెరికా

- దేశంలో ఎల్ మెంచో అనుచరుల విధ్వంసం
- హింసలో 25 మంది నేషనల్ గార్డ్స్ మృతి
- 30 మంది మాఫియా సభ్యుల హతం

మెక్సికో సిటీ, ఫిబ్రవరి 23: మెక్సికోలో కరడు గట్టిన మాఫియా అధిపతి, 'జలిస్కో న్యూ జెనరేషన్ కార్టెల్' ముఠా నాయకుడు ఎల్ మెంచోను ఆ దేశ సైన్యం హతమార్చింది. నేర ప్రపంచంపై మెక్సికో ఇటీవలి కాలంలో సాధించిన అతిపెద్ద విజయంగా విశ్లేషకులు దీనిని అభివర్ణిస్తున్నారు. జలిస్కో రాష్ట్రంలోని తపల్పా అనే ప్రాంతంలో ఉన్న ఎల్ మెంచోను అరెస్టు చేయటానికి ఆదివారం చేపట్టిన ఆపరేషన్‌లో అతనికి తీవ్ర గాయాలయ్యాయని, చికిత్స కోసం రాజధాని మెక్సికో సిటీకి హెలికాప్టర్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడని మెక్సికో రక్షణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఆపరేషన్‌లో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఎల్ మెంచోతోపాటు మరో ఇద్దరు గాయాలపాలై మరణించారని, ఇద్దరు అరెస్టయ్యారని తెలిపింది. ఎల్ మెంచో ముఠాకు చెందిన సాయుధ వాహనాలను, రాకెట్ లాంచర్లను, భారీ ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. ముగ్గురు సైనికులు కూడా గాయపడి, ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నట్లు పేర్కొంది. కాగా, మెక్సికో స్పెషల్ ఫోర్సెస్ చేపట్టిన ఈ ఆపరేషన్‌కు తాము నిఘా సమాచారం అందించామని మెక్సికోలోని అమెరికా రాయబార కార్యాలయంతోపాటు, వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లెవిట్ తెలిపింది. 'అమెరికాలోకి ఫెంటనైల్‌ను భారీ ఎత్తున అక్రమ రవాణా చేస్తున్న ఎల్ మెంచో మెక్సికో, అమెరికా ప్రభుత్వాల టాప్ టార్గెట్‌గా ఉన్నాడు' అని కరోలిన్ పేర్కొన్నారు. మరోవైపు, ఎల్ మెంచో హతమయ్యాడని తెలిసి 'జలిస్కో న్యూ జెనరేషన్ కార్టెల్' ముఠా సభ్యులు మెక్సికోలోని పలు రాష్ట్రాల్లో భారీ ఎత్తున విధ్వంసం సృష్టించారు. అనేక చోట్ల ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను, దుకాణాలను, ప్రభుత్వ కార్యాలయాలను, పెట్రోల్‌బంకులను తగలబెట్టారు. 'జలిస్కో న్యూ జెనరేషన్ కార్టెల్' సభ్యుల హింసాకాండను అడ్డుకునే ప్రయత్నాల్లో సైన్యం చేతిలో దాదాపు 30 మంది హతమయ్యారని అధికారులు తెలిపారు. ఈ ఘటనల్లో దాదాపు 25 మంది నేషనల్ గార్డ్స్ కూడా మరణించినట్లు సమాచారం.


ఎల్ మెంచో

17 ఏళ్లుగా నేర సామ్రాజ్యం

ఎల్ మెంచో పూర్తి పేరు నెమెసియో ఒసెగురా కార్వంటిస్. 2009లో జలిస్కో రాష్ట్రం కేంద్రంగా 'జలిస్కో న్యూ జెనరేషన్ కార్టెల్' ముఠాను ఏర్పాటు చేశాడు. ఫెంటనైల్, మెతామెఫ్టమైన్, కొకైన్ వంటి పలు రకాల మాదక ద్రవ్యాలను అమెరికాకు భారీ ఎత్తున అక్రమంగా రవాణా చేసేవాడు. కిరాయి హంతకుల్ని పెద్ద సంఖ్యలో చేర్చుకొని ముఠాను దేశంలో వేగంగా విస్తరింపజేశాడు. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వ అధికారుల్ని హత్య చేయించేవాడు. చివరికి ఈ ముఠా.. మెక్సికో ప్రభుత్వానికే సవాల్‌గా మారి, సైన్యంపైనా దాడులు చేసే స్థాయికి చేరుకుంది. సైన్యానికి చెందిన హెలికాప్టర్లపైనా దాడి చేసి కూల్చివేసింది. గత ఏడాది ఫిబ్రవరిలో 'జలిస్కో న్యూ జెనరేషన్ కార్టెల్' ముఠాను అమెరికా ఉగ్రవాదసంస్థగా ప్రకటించింది.


మెక్సికోలో ఎల్ మెంచో అనుచరుల విధ్వంసం

ఎల్ మెంచోను పట్టుకోవటానికి అవసరమైన సమాచారం ఇచ్చిన వారికి 1.5 కోట్ల డాలర్ల (రూ.136 కోట్లు) బహుమానం ఇస్తామని పేర్కొంది. ఎల్ మెంచే హతంతో ఇతర మాఫియా ముఠాలు చెలరేగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. కాగా, మెక్సికోలో ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే తమను సంప్రదించాలని అక్కడి భారత ఎంబసీ ఒక ప్రకటన విడుదల చేసింది.

ప్రారంభోత్సవం కోసం టీసీఎస్ ఎదురుచూపు



టీసీఎస్ భవనం

- ఇప్పటికే విశాఖలో మొదలైన కార్యకలాపాలు
- రోజూ విధులకు 200 మంది ఉద్యోగుల హాజరు
- లాంఛనంగా ప్రారంభోత్సవమే తరువాయి

విశాఖపట్నం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కార్యాలయం ప్రభుత్వ పెద్దల చేతుల మీదుగా ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తోంది. ఇది లాంఛనం మాత్రమే. ఇప్పటికే 200 మంది వరకు ఉద్యోగులు వారి ప్రాజెక్టు పనులపై రోజూ ఆఫీసుకు హాజరవుతున్నారు. రుషికొండ ఐటీ పార్కులోని హిల్-3పై మిలీనియం టవర్ల (1, 2)లో సుమారుగా పది అంతస్థులు టీసీఎస్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి ఉద్యోగులను ఇక్కడకు పంపుతున్నారు. విశాఖలో ఉంటూ 'వర్క్ ఫ్రమ్ హోమ్' చేస్తున్న వారు సమావేశాల కోసం ఇక్కడికి వస్తున్నారు. విశాఖ క్యాంపస్ కోసం కొద్దిరోజుల క్రితం ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. టీసీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఇక్కడే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు సమయం ఇస్తే.. ముహూర్తం పెట్టుకొని ఆ రోజున లాంఛనంగా ప్రారంభోత్సవం చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. అదేవిధంగా హిల్-3పై శాశ్వత క్యాంపస్ నిర్మాణం కోసం 21.16 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అక్కడ శంకుస్థాపన కూడా చేయాల్సి ఉంది.

మృతదేహానికి డోలీ..



- గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి
- రెండు కిలోమీటర్లు నడిచి వనకాబడి గ్రామానికి తరలింపు

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి నుంచి దేరువాడ గ్రామానికి రోడ్డు సరిగాలేని కారణంగా మృతదేహాన్ని కర్రకు కట్టుకుని మోసుకెళ్లిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వనకాబడి గ్రామానికి చెందిన పువ్వల బంగారురాజు (28) అనే గిరిజన యువకుడు ఈ నెల 19న మోటార్ బైక్‌పై విశాఖపట్నం వెళ్తుండగా విజయనగరం జిల్లా బూర్జివలస సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బంగారురాజును తొలుత గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం బంగారురాజు చనిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తర్వాత దేరువాడ వరకు వాహనంలో తీసుకొచ్చారు. అక్కడ నుంచి వనకాబడికి రోడ్డు సరిగాలేని కారణంగా మృతదేహాన్ని కర్రకు కట్టుకుని రెండు కిలోమీటర్ల నడిచి గ్రామానికి తరలించారు. సోమవారం ఉదయం దహన సంస్కారాలు చేశారు. బూర్జివలస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ పులొచ్చింది!

- రంపచోడవరం అటవీ ప్రాంతంలో సంచారం
- ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు అధికారుల హెచ్చరిక

రంపచోడవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి 'తూర్పు'లో మళ్లీ పులి భయం మొదలైంది. పోలవరం జిల్లా రంపచోడవరం మండలంలోని పెదగెద్దాడ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్టు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దివాన్‌చెరువు, కేశవరం, రాయవరం తదితర ప్రాంతాల్లో పెద్ద పులి సంచరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. అటవీశాఖాధికారులు ఆ పులిని విశాఖపట్నంలోని జూకు తరలించారు. అక్కడ చికిత్స అందించి ఆ తర్వాత పాపికొండలు అభయారణ్యంలో వదిలిపెట్టారు. కాగా, ఆది, సోమవారాల్లో మళ్లీ ఇదే పులి సంచారం రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లోని అ టవీ ప్రాంతాల్లో కనిపించింది. ఈ నేపథ్యంలో రంపచో డవరం మండలం పెదగెద్దాడ సహా కాకవాడ, దారగూడెం, సీమగండి, అనెంపల్లి, మారేడుమిల్లి మండలంలోని రామన్నవలస, తుర్రూరు, దేవరపల్లి, సున్నంపాడు తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖాధికారులు సూచించారు.



నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఎర్రన్నాయుడుకు ఘన నివాళి

- స్వగ్రామంలో నివాళులర్పించిన రామ్మోహన్‌నాయుడు

టెక్కలి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి కింజారపు ఎర్రన్నాయుడు స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో సోమవారం ఆయన 69వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి సోమవారం ఆయన తనయుడు, కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు, స్థానికులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని, ఎర్రన్నాయుడు జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఢిల్లీలో: పార్లమెంటులోని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఎర్రన్నాయుడి జయంతి వేడుకలను టీడీపీ నేత నౌపడ సత్యనారాయణ అధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఎర్రన్నాయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎర్రన్న సేవలు మరువలేనివి: సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్ర మంత్రి కింజారపు ఎర్రన్నాయుడి జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనకు నివాళులర్పించారు. 'నాకు అత్యంత ఆప్తులు ఎర్రన్నాయుడి జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివి. చివరి క్షణం వరకూ ప్రజాసేవలోనే గడిపిన ఎర్రన్న స్ఫూర్తి అందరికీ ఆదర్శం' అని చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. మంత్రి లోకేశ్ కూడా ఎర్రన్నాయుడికి నివాళులర్పించారు.

టీటీడీ సిబ్బంది చేసేది సేవ కాదు మహాయజ్ఞం!

- సోషల్ మీడియాలో హీరోయిన్ మీనాక్షి చౌదరి



తిరుమలలో ఉచిత బస్సు కోసం వేచి చూస్తున్న మీనాక్షి చౌదరి

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 'టీటీడీ సిబ్బంది చేసేది సేవ కాదు, మహాయజ్ఞం' అని హీరోయిన్ మీనాక్షి చౌదరి కొనియాడారు. ఇటీవల శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఆమె టీటీడీ సేవలను ప్రశంసిస్తూ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉచిత బస్టాండ్‌లో నిలబడడం, బస్సు ఎక్కి ప్రయాణించడం వంటి విజువల్స్ నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి.

కోర్కె తిరస్కరించిందని పెట్రోలు పోసి నిప్పంటించాడు

- ఓ ప్రియుడి ఘాతుకం.. అదే సీసాలోని పెట్రోలుతో ప్రియుడిపై దాడి
- నెల్లూరు జీజీహెచ్‌లో ఇద్దరికీ చికిత్స.. ఘటనలో ఆటో దగ్ధం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 'రెండేళ్లుగా కలిసున్నాం.. రెండు నెలలుగా విడిపోయాం. ఈ ఒక్కసారి కలుసుకుని విడిపోదాం. ఇంకెప్పుడూ నీ జోలికిరాను!' అంటూ ఓ ప్రియుడు తన ప్రేయసిని కోరాడు. ఆమె తిరస్కరించడంతో కోపోద్రిక్తుడయ్యాడు. వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆమెపై చల్లి నిప్పంటించాడు. చివరకు అదే పెట్రోల్‌ను ఆమె అతనిపైనా చల్లడంతో ఇద్దరూ గాయపడ్డారు. నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాళెం పరిసరాల్లో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. రూరల్ సీఐ గుంజి వేణు కథనం మేరకు.. బుచ్చి మండలం మినగల్లుకు చెందిన ఓ మహిళ(38) భర్త చనిపోవడంతో తన ఇద్దరు పిల్లలతో ఉంటోంది. అదే మండలం పెద్దూరుకు చెందిన ఓ యువకుడితో(29) ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. రెండు నెలల క్రితం వారి మధ్య విభేదాలు రావడంతో ఇక వారు కలవకూడదని పంచాయితీలో పెద్దలు తీర్మానం చేశారు. ఈ క్రమంలో ఆమెతో మాట్లాడాలంటూ తన ఆటోలో ఎక్కించుకుని చింతారెడ్డిపాళెం పరిసరాల్లోకి తీసుకువెళ్లాడు. ఆటోలోనే కొంతసేపు మాట్లాడుకున్నాక ఇద్దరం శారీరకంగా కలుద్దామని కోరాడు. ఇందుకు అంగీకరించకపోవడంతో సీసాలో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆమెపై చల్లి, నిప్పంటించాడు. ఆమె తిరగబడి సీసాలో మిగిలిన పెట్రోల్‌ను అతనిపై చల్లింది. ఇద్దరికీ నిప్పంటుకోవడంతో పక్కనే కాలువలోకి దూకేశారు. ఆ తర్వాత నెల్లూరులోని జీజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో ఆటోకు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది.

కేసు పెట్టకుండా ఉండేందుకు రూ.7 లక్షలు డిమాండ్

- రూ.1.50 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన పులివెందుల సీఐ, సింహాద్రిపురం ఎస్ఐ

సింహాద్రిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల సీఐ ఎన్వీ రమణ, సింహాద్రిపురం ఎస్ఐ అనిల్‌కుమార్ ఏసీబీకి పట్టుబడ్డారు. సోమవారం సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో రూ.1.50 లక్షల నగదు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు ఎస్ఐ పట్టుబడ్డారు. కడప ఏసీబీ డీఎస్పీ సీతారామారావు తెలిపిన వివరాలు... అనంతపురానికి చెందిన బ్రహ్మం సత్యసాయి జిల్లా కదిరిలోని వెంకట బాలాజీ ఆటో కన్సల్టెన్సీలో గతేడాది డిసెంబరులో బైక్ కొనుగోలు చేశాడు. తర్వాత బిహార్‌కు చెందిన దిలీప్‌కు విక్రయించాడు. అయితే దిలీప్ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ ఈ బైకును ఉపయోగించేవాడు. దీంతో సింహాద్రిపురం ఎస్ఐ అనిల్‌కుమార్, పులివెందుల రూరల్ సీఐ ఎన్వీ రమణ బ్రహ్మంను పిలిపించి దిలీప్ చోరీల్లో నీకూ భాగం ఉందని బెదిరించారు. కేసు పెడతామంటూ బ్రహ్మాన్ని భయభ్రాంతులకు గురిచేశారు. రూ.7 లక్షలు ఇస్తే కేసు నమోదు చేయబోమని చెప్పగా.. అంత చెల్లించలేననడంతో చివరకు రూ.2 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. ఎస్ఐ మొదట రూ.50 వేలు తీసుకున్నాడు. మిగతా రూ.1.50 లక్షలు సోమవారం తీసుకుని రావాలని బ్రహ్మాన్ని ఆదేశించారు. దీనిపై బాధితుడు కడప ఏసీబీ డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాడు. సోమవారం సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అనిల్‌కుమార్ నగదు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అదే సమయంలో లింగాల పోలీస్ స్టేషన్ నుంచి సింహాద్రిపురం బయలుదేరిన సీఐ రమణను కూడా అదుపులోకి తీసుకున్నారు.



సింహాద్రిపురం ఎస్ఐ అనిల్‌కుమార్, పులివెందుల రూరల్ సీఐ ఎన్వీ రమణ

'ఎలక్టివ్'లో విద్యార్థుల తడబాటు!

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం



విజయనగరంలో దివ్యాంగురాలైన కూతుర్ని పరీక్షకు తీసుకొస్తున్న తండ్రి



తిరుపతిలో పరీక్షకు వెళ్తూ తల్లిదండ్రుల కాళ్లకు మొక్కుతున్న విద్యార్థిని

- గణితం, సైన్స్ తీసుకుని మళ్లీ భాషా సబ్జెక్టులే రాసిన కొందరు
- మొదటి రోజు 20,123 మంది గైర్హాజరు

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. 'ఎలక్టివ్' సబ్జెక్టుల విషయంలో కొందరు విద్యార్థుల తమ ఆలోచనను మార్చుకున్నారు. ముందుగా సీఈసీ విద్యార్థులు ఎలక్టివ్ సబ్జెక్టు కింద గణితం తీసుకున్నారు. కొందరు ఇతర ఆర్ట్స్ గ్రూపుల విద్యార్థులు అయితే సైన్స్ సబ్జెక్టులనూ ఎంపిక చేసుకున్నారు. తీరా పరీక్షలకు ముందు అవన్నీ మన వల్ల కాదులే అనుకుని.. తిరిగి భాషా సబ్జెక్టులకు వెళ్లిపోయారు. వారంతా సోమవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాషా సబ్జెక్టు పేపర్ల పరీక్షలు రాశారు. వంద మందికి పైగా విద్యార్థులు ఇలా సబ్జెక్టుల ఎంపికను మార్చుకున్నారు. కాగా, 20,123 మంది మొత్తంగా పరీక్షలకు గైర్హాజరయ్యారు. 5,24,771 మంది విద్యార్థులు భాషా సబ్జెక్టుల పరీక్షలు రాసినట్లు ఇంటర్ విద్యామండలి వెల్లడించింది. మంగళగిరిలోని పలు కేంద్రాలను ఇంటర్ విద్యామండలి కార్యదర్శి పి.రంజిత్ బాషా పరిశీలించారు. విద్యార్థులకు సౌకర్యాలపై ఆరా తీశారు. సీసీ కెమెరాలు, నిఘా వ్యవస్థ అమలు తీరును పరిశీలించారు.

ఎలక్టివ్ ఎంపికలో మార్పులు

ఇంటర్ విద్యాశాఖ ఈ విద్యా సంవత్సరం అనేక సంస్కరణలు చేపట్టింది. అందులో భాగంగా గణితం, సైన్స్ సబ్జెక్టులు విలీనం చేసింది. కొత్తగా ఎలక్టివ్ సబ్జెక్టు విధానం ప్రవేశపెట్టింది. అంటే విద్యార్థులు ఇంగ్లిష్, మిగిలిన మూడు సంబంధిత గ్రూపు సబ్జెక్టులు తప్పనిసరిగా చదవాలి. ఐదో సబ్జెక్టు ఎలక్టివ్‌గా ఉంటుంది. గ్రూపుతో సంబంధం లేకుండా ఏ సబ్జెక్టు అయినా ఎలక్టివ్ కింద తీసుకోవచ్చు. ఈ క్రమంలోనే కొందరు ఆర్ట్స్ గ్రూపుల విద్యార్థులు గణితం, బయాలజీలను ఎంపిక చేసుకున్నా.. పరీక్షలు సమీపించిన తర్వాత ఆ సబ్జెక్టులు కష్టంగా ఉన్నాయని.. వాటి స్థానంలో భాషా సబ్జెక్టులు తీసుకున్నారు. పరీక్షల్లో భాషా సబ్జెక్టులే రాశారు.

అయ్యో రాంసాయి..!

- ఓ పక్క తండ్రి మృతి.. మరో పక్క ఇంటర్ పరీక్ష
- పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని పరీక్షకు హాజరు



రాంసాయిని (మధ్యలో) బైక్‌పై పరీక్ష కేంద్రానికి తీసుకువస్తున్న ప్రిన్సిపాల్ మదార్‌బాషా

సంగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అటు ఇంటర్ పరీక్ష.. ఇటు తండ్రికి అంత్యక్రియలు చేయాల్సి రావడంతో ఆ విద్యార్థి కఠిన పరీక్షను ఎదుర్కొన్నాడు. అయినా ప్రిన్సిపాల్ ప్రోద్బలంతో పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని పరీక్ష రాసి, ఆ తర్వాత తండ్రికి అంత్యక్రియలు జరిపాడు. నెల్లూరు జిల్లా సంగంకు చెందిన కందల రాంసాయి జూనియర్ ఇంటర్ చదుతున్నాడు. అతని తండ్రి కందల శివ అలియాస్ శివకృష్ణ ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం జూనియర్ ఇంటర్ పరీక్ష రాయాల్సి ఉండగా తండ్రి అంత్యక్రియలకు రాంసాయి సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మదార్‌బాషా వెంటనే రాంసాయి కుటుంబసభ్యులతో మాట్లాడి అతన్ని తన బైక్‌పై పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు.

ఆగని 'అక్షరం'!

- ఆ 'చిన్నారి' ఇంటరూ రాస్తోంది..
- నాడు 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన విద్యా మంత్రి
- పదో తరగతి పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్న లోకేశ్



విద్యార్థిని చిన్నారి

కోసిగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): 'అక్షరం' ఆగిపోకూడదన్న తపన.. అండగా నిలిచిన 'ఆంధ్రజ్యోతి' కథనం.. ఒక విద్యార్థిని జీవితాన్నే మార్చేశాయి. గతేడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో కర్నూలు జిల్లా కోసిగి మండలం చింతకుంట గ్రామానికి చెందిన చిన్నారి అనే విద్యార్థిని తల్లిదండ్రులతో గుంటూరు జిల్లాకు వలస వెళ్లి మిర్చి పొలంలో కూలీగా మారాల్సి వచ్చింది. ఆమె స్థితిపై 'ఆంధ్రజ్యోతి' నాడు 'పరీక్ష హాలులో కాదు.. మిర్చి పొలంలో' అన్న శీర్షికతో ఓ కథనం ప్రచురించింది. దీనికి మంత్రి లోకేశ్ స్పందించి చిన్నారిని తిరిగి సొంత గ్రామానికి తీసుకువచ్చి పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నారు. పదో తరగతి పాసైన అనంతరం చిన్నారి కోసిగి మోడల్ స్కూల్‌లో ఇంటర్ బైపీసీలో చేరింది. సోమవారం జరిగిన మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష రాసింది. ఈ సందర్భంగా చిన్నారి ఆనందం వ్యక్తం చేస్తూ.. తాను తిరిగి చదువుకుంటానని అనుకోలేదని, 'ఆంధ్రజ్యోతి'కి రుణపడి ఉంటానని భావోద్వేగానికి గురైంది. నాడు సహకరించిన మంత్రి లోకేశ్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది.

ఆ ప్రొఫెసర్లను కొనసాగించండి

వ్యవసాయ శాఖ వర్సిటీల్లోని ప్రొఫెసర్ల రిటైర్మెంట్‌పై హైకోర్టు ఆదేశం

- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన ధర్మాసనం
- విద్యాశాఖలోని వారికి రిటైర్మెంట్ వయస్సు పెంచి వ్యవసాయ శాఖ వారికి నిరాకరించడం వివక్షేనని వ్యాఖ్య
- కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ పరిధిలోని యూనివర్సిటీలలో పనిచేస్తూ యూజీసీ స్కేల్ తీసుకుంటున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65కి పెంచిన రాష్ట్ర ప్రభుత్వం... వ్యవసాయ శాఖ పరిధిలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్నవారికి పదవీ విరమణ వయస్సు పెంచకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఇది ఉన్నత విద్యాశాఖ, వ్యవసాయ శాఖ పరిధిలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ, డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ, శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ల మధ్య వివక్ష చూపించడమేనని వ్యాఖ్యానించింది. పదవీ విరమణ వయస్సు పెంపు పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం అయినప్పటికీ... ప్రభుత్వ చర్య వివక్షపూరితంగా ఉండకూడదని స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగంలోని అధికరణ 14కి విరుద్ధంగా ఉందని పేర్కొంది. పదవీ విరమణ వయస్సు పెంపు సిఫారసులను తిరస్కరిస్తూ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాసిన లేఖను సస్పెండ్ చేసింది. పిటిషనర్లలో కొందరు పదవీ విరమణ వయస్సుకు దగ్గరగా ఉన్నారని, ఈ నేపథ్యంలో తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కోర్టును ఆశ్రయించిన ప్రొఫెసర్లను విధుల్లో కొనసాగించాలని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సుభేందు శమంతతో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఉన్నత విద్యాశాఖ పరిధిలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న బోధన సిబ్బంది పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65కి పెంచిన రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ పరిధిలోని ఉద్యాన, వెటర్నరీ, ఫిషరీస్, ఎన్జీ రంగా యూనివర్సిటీల్లో పనిచేస్తున్న బోధన సిబ్బందికి పదవీ విరమణ వయస్సు పెంచకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు ప్రొఫెసర్లు, డీన్లు, శాఖాధిపతులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి... పదవీ విరమణ వయస్సు పెంపు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని స్పష్టం చేశారు. 2023 జూలై 29న జారీ చేసిన జీవో 39కి అనుగుణంగా వ్యవసాయ శాఖ పరిధిలోని యూనివర్సిటీలకు పదవీ విరమణ వయస్సు పెంపు విస్తరించే విషయంలో సమగ్ర నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గత ఏడాది నవంబరు 5న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పుపై వ్యవసాయ శాఖ పరిధిలోని వర్సిటీల్లో పని చేస్తున్న పలువురు ప్రొఫెసర్లు హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీళ్లు వేశారు. ఈ అప్పీళ్లు ఇటీవల విచారణకు రాగా వ్యవసాయ శాఖ పరిధిలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సు పెంచకపోవడంపై స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్‌ను హైకోర్టు ఆదేశించింది. దీంతో సోమవారం ధర్మాసనం ముందు హాజరైన బుడితి రాజశేఖర్ కాంపిటెంట్ అథారిటీ నిర్ణయం మేరకు పదవీ విరమణ వయస్సు పెంపు విషయంలో యూనివర్సిటీల ప్రతిపాదనలను తిరస్కరించినట్టు తెలిపారు. అయితే అందుకుగల కారణాలను పేర్కొనకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. రాజకీయ ఉన్నత పదవుల్లో ఉన్నవారి ఆలోచనలు తెలుసుకోకుండా... అధికారులు ఎలా నిర్ణయం తీసుకుంటారని వ్యాఖ్యానించింది. 2023లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సు పెంపు అభ్యర్థనను అప్పటి ప్రభుత్వం తిరస్కరించిందని, ప్రస్తుత ప్రభుత్వం సైతం ఆ నిర్ణయాన్ని సమర్థిస్తోందని గుర్తు చేసింది. అలాంటప్పుడు మార్పు ఎక్కడ ఉందని? ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమయం కోరుతున్న నేపథ్యంలో తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు పిటిషనర్లను సర్వీసులో కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

తిరుమలలో 'పాము కాటు' ప్రచారం

- క్యూలైన్‌లో పాము కాటేసిందంటూ ప్రచారం
- ఆ ప్రచారం అవాస్తవమని పేర్కొన్న టీటీడీ

తిరుమల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో క్యూలైన్‌లో ఓ భక్తురాలిని పాము కాటేసిందని జరిగిన ప్రచారం సోమవారం కలకలం సృష్టించింది. వివరాలు.. తెలంగాణా రాష్ట్రం వరంగల్ జిల్లాకు చెందిన శరత్‌బాబు, మౌనిక దంపతులు బంధువులతో కలిసి శ్రీవారి దర్శనార్థం ఆదివారం రాత్రి తిరుమలకు వచ్చారు. దర్శనం కోసం వైకుంఠం క్యూకాంప్లెక్స్-2కు సమీపంలోని ఆర్బీ సెంటర్ వద్దనున్న కార్ పార్కింగ్ వద్దకు చేరుకున్నారు. మౌనిక పాదాలకు పసుపు రాసుకునేందుకు చీకటిగా ఉన్న ప్రదేశంలోకి వెళ్లిన క్రమంలో కాలుపై ఏదో పాకినట్టు అన్పించడంతో భయపడింది. భర్తతో కలిసి పరిశీలించగా చిన్నపాము కనిపించింది. భద్రతా సిబ్బందికి సమాచారమివ్వడంతో తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. కాగా.. దర్శన క్యూలైన్‌లో ఓ భక్తురాలికి పాము కాటు అని జరిగిన ప్రచారం పూర్తిగా అవాస్తవమని టీటీడీ ఓ ప్రకటనలో పేర్కొంది. అశ్విని ఆస్పత్రిలో మౌనికను పరీక్షించిన వైద్యులు ఎలాంటి పాము కాటు లేదని నిర్ధారించారని, అయినా స్విమ్స్ ఆస్పత్రికి పంపామని తెలిపింది. సోమవారం ఉదయం వారు శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారని పేర్కొంది.

ఉషా ముళ్లపూడి కార్డియాక్ సెంటర్ వ్యవస్థాపకుడు డాక్టర్ ముళ్లపూడి వెంకటరత్నం కన్నుమూత

- అయిదు దశాబ్దాల వైద్య వృత్తిలో 35 వేలకుపైగా గుండె శస్త్రచికిత్సలు
- నిమ్స్‌లో కొన్నాళ్లు ఉచితంగా సేవలు.. చిన్నకుమార్తె స్మారకంగా ఉషా
- ముళ్లపూడి కార్డియాక్ సెంటర్ ఏర్పాటు



డాక్టర్ ముళ్లపూడి వెంకటరత్నం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణుడు, ఉషా ముళ్లపూడి కార్డియాక్ సెంటర్ వ్యవస్థాపకుడు డాక్టర్ ముళ్లపూడి వెంకటరత్నం (89) ఇకలేరు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తమ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 8.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. వెంకటరత్నం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నంలో 1937 జూలై 1న జన్మించారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆయన.. స్వగ్రామంలో టైఫాయిడ్ జ్వరాలతో ఎక్కువ మంది చనిపోవడం చూసి చలించి వైద్యుడు అవ్వాలనుకున్నారు. కష్టపడి చదివి మెడికల్ సీటు సాధించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. అనంతరం అమెరికాకు వెళ్లిన ఆయన డాక్టర్ ఆఫ్ మెడిసిన్ ఇన్ కార్డియాలజీతో పాటు ఎఫ్ఏసీఎస్, ఎఫ్ఆర్‌సీఎస్ (సీ) పట్టాలు అందుకున్నారు. అమెరికాలో గుండె శస్త్రచికిత్స నిపుణుడిగా గుర్తింపు పొందిన ఆయన ఎన్టీఆర్ ఆహ్వానంతో స్వదేశానికి వచ్చారు. పంజాగుట్ట నిమ్స్‌లో కార్డియాక్ సర్జన్‌గా 1995 నుంచి 97 వరకు ఉచితంగా పనిచేశారు. తర్వాత తిరిగి అమెరికా వెళ్లారు.

చిన్నకుమార్తె స్మారకంగా...

ముళ్లపూడి వెంకటరత్నం భార్య నళిని ఎనస్తీషియనిస్ట్. వీరికి ఇద్దరమ్మాయిలు. పెద్ద కుమార్తె జ్యోతి అమెరికాలో స్థిరపడ్డారు. చిన్నకుమార్తె ఉష తన 19వ ఏట అమెరికాలో రైలు ప్రమాదంలో చనిపోయారు. సమాజానికి తన వంతు సేవ చేయాలన్న ఆమె ఆశయం మేరకు స్వదేశానికి వచ్చిన వెంకటరత్నం ఆమె స్మారకంగా హైదరాబాద్‌లో 2000 జనవరిలో ఉషా ముళ్లపూడి కార్డియాక్ సెంటర్ నెలకొల్పారు. ఆయన యాభై ఏళ్ల వృత్తి జీవితంలో 35 వేలకుపైగా గుండె శస్త్రచికిత్సలు చేశారని వారి ఆస్పత్రి ప్రతినిధులు చెప్పారు.

వైద్య వృత్తికే అంకితం...

ఏటా రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉచిత వైద్య సేవలకు కేటాయిస్తామని గతంలో 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే'లో డాక్టర్ వెంకటరత్నం వెల్లడించారు. రోగులకు 24 గంటలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ఆస్పత్రినే నివాసంగానూ మలచుకున్నారు. తెలుగునాట గుండె శస్త్రచికిత్సలకు ప్రముఖ వైద్యాలయంగా ఉషా ముళ్లపూడి కార్డియాక్ సెంటర్‌కు ప్రత్యేకమైన గుర్తింపు సాధించారు. వెంకటరత్నం భౌతికకాయాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, డాక్టర్ గూడపాటి రమేష్‌తో పాటు పలువురు వైద్యులు సందర్శించి నివాళులు అర్పించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో వెంకటరత్నం అంత్యక్రియలు నిర్వహించినట్లు ఉషా ముళ్లపూడి ట్రస్టీల్లో ఒకరైన అర్జున్ కోడూరి తెలిపారు.

యూడీఏ నిధుల్లో పంచాయతీలకు వాటా

- ఉపముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయిస్తాం: మంత్రి నారాయణ

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధి అథారిటీల ద్వారా వసూలు చేస్తున్న ఫీజుల ఆదాయంలో గ్రామ పంచాయతీలకు వాటా ఇవ్వాలని, దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. సోమవారం మున్సిపల్, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పట్టణాభివృద్ధి అథారిటీల పరిధిలో ఉన్న పంచాయతీల్లో వివిధ రకాల అనుమతుల కోసం మున్సిపల్ శాఖ వసూలు చేసే నిధులను గ్రామ పంచాయతీలకు ఏ రకంగా ఖర్చు పెట్టాలనే దానిపై నిర్ధిష్ట నిబంధనలు లేవన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి గ్రామాల నిధులను ఆయా గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'కృత్రిమ' సదస్సు

కృత్రిమ మేధ (ఏఐ)రంగంలో భారత్ సాధించిన విజయాలు చూసి ప్రపంచదేశాల అధినేతలు ఆశ్చర్యపోయారంటూ, ఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026ని ఒక గొప్ప మేలిమలుపుగా తన ఆదివారం నాటి మన్‌కీబాత్‌లో అభివర్ణించారు ప్రధాని నరేంద్రమోదీ. రాబోయేరోజుల్లో ఏఐ శక్తిని ఎంత సమర్థంగా, సవ్యంగా ఉపయోగించుకోవచ్చునో ఈ సదస్సు తెలియచెప్పిందన్నారు ఆయన. సదస్సుకు ప్రపంచదేశాల అధినేతలు, గ్లోబల్‌స్థాయి కంపెనీల సీఈవోలు హాజరైన విషయాన్ని గుర్తుచేశారు. అమూల్ రైతులు తమ పాడిపశువులను ఏఐ సాయంతో సాకడం నుంచి, ప్రాచీన విజ్ఞానాన్ని ఏఐ టెక్నాలజీతో పరిరక్షిస్తూ కొత్తతరానికి అందించడం వరకూ భారత్ సాధిస్తున్న పలు విజయాలు చూసి వారంతా ఆశ్చర్యపోయారని మోదీ చెప్పారు. ఇక, ఆ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసనలు తెలపడం మీద ఆదివారం నాటి తన మీరట్ పర్యటనలో మోదీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఒక గ్లోబల్ సదస్సును కాంగ్రెస్ తన మురికిరాజకీయాలకు వేదికగా మార్చి భారత్‌కు తలవంపులు తెచ్చిందన్నారు. ఊళ్ళోపెళ్ళి జరిగితే ఊరంతా కలిసి వైభవంగా దానిని జరిపిస్తుందని, కానీ, ఒక ప్రభుత్వ కార్యక్రమాన్ని కూడా అప్రదిష్ఠపరచేందుకు కాంగ్రెస్ ప్రయత్నించి, స్వదేశాన్నే అవమానించిందన్నారు. కాంగ్రెస్ తన సమాధిని తవ్వాలనుకుంటోందని, తన తల్లిని సైతం దూషించిందని, కానీ, దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూడడం మాత్రం సహించరానిదని ఆయన తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

మూడు స్వదేశీ ఏఐ మోడల్స్ ఆవిష్కరించడం సహా, వర్ధమాన ప్రపంచంలో తొలిసారిగా జరిగిన ఈ సదస్సు భారత్ కచ్చితంగా గర్వించదగ్గది. అతివేగవంతమైన మార్పులతో కృత్రిమమేధ అన్ని రంగాలమీదా ప్రభావం చూపుతున్న తరుణంలో, దానిని చర్చించి, భవిష్యత్ పరిణామాలను, ఉపద్రవాలను గుర్తించి మార్గాంతరాన్ని అన్వేషించడం అత్యావశ్యకం. మిగతా ప్రపంచం, అందునా అమెరికా, చైనా వంటివి ఏఐలో ఎక్కడున్నాయో తెలిసిందే కనుక, భారత్ ఇప్పటివరకూ చేసిందేమిటో, చేయాల్సింది ఎంతో కూడా ఈ సదస్సు గుర్తుచేసింది. మానవ వనరులకు, నైపుణ్యానికీ భారత్‌లో కొదువలేదని మన నాయకులు ఇటువంటి అంతర్జాతీయ వేదికలమీద చెబుతూంటారు. ఇప్పటికీ విదేశీ నమూనాలు, ఉత్పత్తులమీదే అధికంగా ఆధారపడవలసివస్తున్న నేపథ్యంలో, ప్రపంచాన్ని ప్రభావితం చేసే స్థాయికి ఎదగడానికి పెట్టుబడులనుంచి, పరిశోధనల వరకూ మనం పెంచుకోవాల్సినవి ఏమిటో, అందుకు ఎంత కాలం పడుతుందో ఈ సదస్సు పరోక్షంగా గుర్తుచేసింది. అతిపెద్ద ఏఐ వినియోగదారుగా, సాంకేతిక దిగ్గజ సంస్థలకు విస్తారమైన మార్కెట్‌గా, పరిశోధనలూ పరీక్షలకు కేంద్రంగా ఉపకరిస్తున్న మనం వినూత్న విధానాల రూపకల్పనతో అత్యంత దూకుడుగా వ్యవహరించాల్సి ఉంది.

సదస్సు ఆరంభమైన రోజునే ఏర్పాట్లలో లోటుపాట్ల వల్ల చోటుచేసుకున్న తీవ్ర గందరగోళం, తొక్కిసలాట, చిన్నాచితకా దొంగతనాలు ఇత్యాదివి ప్రపంచవ్యాప్తంగా ప్రచారమై, కేంద్ర ఐటీమంత్రి క్షమాపణలు కూడా చెప్పుకోవాల్సి వచ్చింది. ఇంతటి ఘనమైన సదస్సును నిర్వహిస్తున్నప్పుడు ఇంకాస్తంత జాగ్రత్తలు తీసుకొనివుంటే సరిపోయేది. ఇక సదస్సు తీర్మానాలు, సంకల్పాలమీద లోతైన చర్చ జరగాల్సి ఉంది. సర్వజన హితానికి కృత్రిమమేధ ఉపకరించాలన్న మాటలు వినసొంపుగా ఉంటాయి కానీ, అది కోట్లాదిమంది పొట్టకొడుతుందన్న అంచనాలను, భయాలను ఈ సదస్సు దూరం చేయలేకపోయింది. ఉప్పెనలాగా వచ్చిపడుతున్న ఏఐ అన్ని రంగాలనూ కుదిపేసి, తమ జీవితాలను చిదిమేస్తుందన్న భయం యువతలో అధికంగా ఉండటం సహజం. జీ8, జీ20, డావోస్ ఇత్యాది అనేకానేక సదస్సుల్లో నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు జరుగుతూండటం చూస్తూనే ఉన్నాం. ఉపాధి గురించి ప్రశ్నిస్తున్న యూత్ కాంగ్రెస్ హద్దులు దాటిన నిరసన ప్రదర్శనకంటే, గల్గోటియా యూనివర్సిటీ మన దేశానికి తెచ్చిపెట్టిన తలవంపులు ఎక్కువన్నది పాలకులు గుర్తించాలి. చైనా మార్కెట్‌లో కొనుక్కొచ్చిన ఒక రోబో కుక్కను ఈ అంతర్జాతీయ ఏఐ సదస్సులో తమ సృష్టిగా నిర్భయంగా ప్రకటించి, భారత్ ఏఐ ప్రతిభకు నిదర్శనంగా అభివర్ణించడానికి అది అస్మదీయ విద్యాసంస్థ కావడమే కారణమని ప్రచారం జరుగుతోంది. నీతిబాహ్యంగా నడిచి, ఇంతటి ఘోరపాపానికి పాల్పడ్డా కూడా దాని మీద ఉన్నతస్థాయి చర్యలకు ఉపక్రమించకపోవడం మరీ ఆశ్చర్యం. ఒక విదేశీ కృత్రిమ కుక్కతో తన వ్యాపారం పెంచుకోవడానికి ఈ సంస్థ చేసిన ప్రయత్నం స్వదేశీ మోడల్ 'సర్వం ఏఐ' ప్రపంచ మీడియాలో వెలిగిపోవాల్సిన రోజును చీకటిమయం చేసింది.

> హక్కులు, బాధ్యతలు వాహనానికి రెండు చక్రాల వంటివి. ఒక చక్రం లేకపోతే వాహనం ముందుకు కదలనట్లే, బాధ్యతలను విస్మరిస్తే జీవనం సజావుగా సాగదు. మనం హక్కులను మాత్రమే డిమాండ్ చేసి, బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తే ప్రజాస్వామ్యం తన బలాన్ని కోల్పోతుంది.

బాధ్యతలు నెరవేరిస్తేనే హక్కులు దక్కుతాయి

భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ప్రతి పౌరుడికీ సమాన హక్కులు ఉన్నాయి. అదే సమయంలో, దేశం అభివృద్ధి చెందడానికి, సామాజిక సమగ్రత కాపాడడానికి పౌరులందరిపై కొన్ని బాధ్యతలు కూడా ఉంటాయి. హక్కులు, బాధ్యతలు ఆధునిక ప్రజాస్వామ్యంలో పరస్పరం విడదీయలేనివి. హక్కులు మనకు స్వేచ్ఛ, గౌరవం, సమానత ఇస్తే... బాధ్యతలు ఆ స్వేచ్ఛను సరిగా ఉపయోగించడానికి మార్గనిర్దేశం చేస్తాయి. ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించడం ఎంత ముఖ్యమో, తన బాధ్యతలను నిర్వర్తించడం కూడా అంతే ముఖ్యం.

భారత రాజ్యాంగం 1950లో అమలులోకి వచ్చినప్పుడు ప్రజలకు స్వేచ్ఛ, రక్షణ, న్యాయం వంటి విలువలను అందించే మౌలిక హక్కులను దాంట్లో చేర్చారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న అసమానతలు, వివక్ష, అణచివేతకు ముగింపు పలుకుతూ, ప్రతి వ్యక్తికి గౌరవం, భద్రతను ఇచ్చే విధంగా ఈ హక్కులను రూపొందించారు. అయితే మౌలిక కర్తవ్యాలను అప్పట్లో రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చలేదు. 1970వ దశకంలో దేశంలో ఏర్పడిన రాజకీయ అస్థిరత, విలువల క్షీణత, ప్రజా క్రమశిక్షణ తగ్గిపోవడం వంటి సమస్యల నేపథ్యంలో కర్తవ్యాలను కూడా స్పష్టంగా చేర్చాల్సిన అవసరం వచ్చింది. స్వరణ్‌సింగ్ కమిటీ సిఫార్సుల ఆధారంగా 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పౌరులు పాటించాల్సిన పదకొండు మౌలిక కర్తవ్యాలను రాజ్యాంగంలో చేర్చారు. దేశభక్తి, క్రమశిక్షణ, సామరస్యం, పర్యావరణ రక్షణ, సంస్కృతి పరిరక్షణల వంటి విలువలను మనలో పెంపొందించే విధంగా వీటిని రూపొందించారు.

హక్కులు ఉన్నాయని ఇతరుల హక్కుల్ని కించపరచడం, వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో సమాజంలో అశాంతిని కలిగించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం– ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయి. పౌరులు బాధ్యతలను పాటించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. ఉదాహరణకు, మనకు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. మన అభిప్రాయాన్ని చెప్పడానికి ఎవ్వరూ అడ్డంకి కల్పించరు. కానీ మన మాట వల్ల ఇతరుల గౌరవానికి భంగం కలగకుండా చూడటం ఒక బాధ్యత. తనకు నచ్చని విషయాన్ని ఎవరైనా మాట్లాడితే, కోపంతో హింసను ప్రేరేపించడం, దుర్భాషలాడడం స్వేచ్ఛా హక్కును తప్పుగా వినియోగించడమే.

అలాగే, సమానత్వ హక్కు ప్రతి ఒక్కరికి ఉన్నప్పటికీ, మన సమాజంలోని విభిన్నతను గౌరవించడం, ఇతరుల పట్ల వివక్ష చూపకుండా ఉండడం మన బాధ్యత. జాతి, కులం, మతం, భాష, లింగం ఆధారంగా ఎవరికీ అవమానం కలిగించకపోవడం అనేది మనలో ప్రతి ఒక్కరూ పాటించి తీరవలసిన పౌర ధర్మం. హక్కులు మనకు సమానతకు హామీ ఇస్తాయి, బాధ్యతలు ఆ సమానతను కాపాడే నైతిక బాధ్యతలను గుర్తుచేస్తాయి. దేశాన్ని గౌరవించడం, దాని చిహ్నాలను పరిరక్షించడం కూడా మన బాధ్యతే. జాతీయ పతాకం, జాతీయ గీతం పట్ల గౌరవం చూపడం కేవలం ఒక ఆచారం కాదు; అది మనలో దేశభక్తిని పెంపొందించే ఒక విలువ. ఈ విలువలు ఉన్నప్పుడే మన హక్కులు సురక్షితంగా ఉంటాయి. దేశం మనకు ఇచ్చే విద్యా హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా సమాజంలో మంచి పౌరుడిగా మారడం, ఇతరులకు సహాయం చేయడం, నిజాయితీగా ఉద్యోగం చేయడం, అవినీతి వంటి చెడు పనులకు దూరంగా ఉండడం అనేవి బాధ్యతల్లో భాగం.



పర్యావరణాన్ని కాపాడటం కూడా ప్రతి పౌరుడి ప్రధాన బాధ్యత. శుభ్రమైన గాలి పీల్చడం, స్వచ్ఛమైన నీరు త్రాగడం మనకు ఒక హక్కు. అలాగే చెట్లు నాటడం, వన్యప్రాణులను కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు తీసుకోవడం మన బాధ్యత. మనం ఈ బాధ్యతను పట్టించుకోకపోతే, రేపటి తరాలకు ఈ హక్కులు అందుబాటులో ఉండవు. ప్రభుత్వ బస్సులు, పాఠశాలలు, ఆసుపత్రులు, రోడ్లు ఇవన్నీ ప్రజల డబ్బుతోనే నిర్మిస్తారు. వీటిని ధ్వంసం చేయడమంటే మన ఆస్తిని మనమే నాశనం చేసినట్టు. ప్రజల ఆస్తి మన హక్కులతో ముడిపడి ఉందని అర్థం చేసుకుంటే వాటిని కాపాడాలనే అవగాహన సహజంగానే మనకు వస్తుంది.

మన రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కు ఇచ్చింది. కాబట్టి మహిళలు కూడా సమాన గౌరవానికి అర్హులే. వారి భద్రత, విద్య, అవకాశాలు వారికి సమాజం ఇచ్చే హక్కులు. అయితే వారిని అవమానించడం, వేధించడం, హింసించడం అనేవి బాధ్యత మరచిన జీవనశైలి అవుతుంది. మనం మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించినప్పుడే వారు తమ హక్కులను నిజంగా అనుభవించగలరు. ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం కూడా ఒక బాధ్యత. మూఢ నమ్మకాలను, అజ్ఞానంతో కాలం చెల్లిన ఆచారాలను ప్రోత్సహించడం వల్ల సమాజం వెనకడుగు వేస్తుంది. విజ్ఞానాన్ని, తర్కాన్ని ఆధారంగా చేసుకొని నిర్ణయాలు తీసుకోవడం వల్ల సమాజం ముందుకు సాగుతుంది. శాస్త్రీయ దృక్పథం కలిగిన ప్రజలు ఉన్నప్పుడే దేశం నూతన ఆవిష్కరణలు చేసి, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతుంది.

మొత్తం మీద, హక్కులు, బాధ్యతలు వాహనానికి రెండు చక్రాలవంటివి. ఒక చక్రం లేకపోతే వాహనం ముందుకు కదలనట్లే, బాధ్యతలను విస్మరిస్తే జీవనం సజావుగా సాగదు. మనం హక్కులను మాత్రమే డిమాండ్ చేసి, బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తే ప్రజాస్వామ్యం తన బలాన్ని కోల్పోతుంది. పౌరులు తమ హక్కులను గౌరవిస్తూ, బాధ్యతలను నిజాయితీగా పాటించడంతోనే దేశం బలమైనదిగా, శాంతిమయమైనదిగా అభివృద్ధి చెందుతుంది. ఆదర్శవంతమైన ప్రజాస్వామ్యంగా నిలబడుతుంది.

○ పి.వేణుగోపాల్‌రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు

రాహుల్‌కు ఎందుకీ కంటగింపు?

సమర్థ నాయకత్వం, సరైన మార్గదర్శనంతో భారత్ గత పన్నెండేళ్లుగా.. వికసిత భారతదేశ నిర్మాణం కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుంది. ప్రజల భాగస్వామ్యంతో వాటిని సాధించే దిశగా అడుగులేస్తోంది. 'ఆత్మనిర్భర' నినాదంతో దేశీయంగా మన కాళ్ల మీద మనం నిలబడే విధంగా చర్యలు తీసుకుంటూ.. విదేశాలతో బలమైన సంబంధాలను ఏర్పర్చుకుంటూ.. దేశ 'బంగారు భవిష్యత్తుకు భరోసా'ను సుస్థిరం చేసుకుంటోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో.. పుష్కరకాలంగా ప్రపంచంలోని ముఖ్య దేశాలు, కీలక కూటములతో భారతదేశం వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకుంటోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, 27 దేశాల సమాహారమైన యూరోపియన్ యూనియన్, బ్రిటన్, ఒమన్, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాలతో కుదుర్చుకున్న మొత్తం 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో (FTA) భారత్.. ఉత్పత్తి, సేవల, వ్యవసాయ రంగాలకు మన దేశంలో పెద్దఎత్తున కొత్త మార్కెట్లకు ద్వారాలు తెరుచుకున్నాయి. గ్లోబల్ సప్లయ్ చైన్స్ పునర్వ్యవస్థీకృతమవుతున్న ఈ సమయంలో FTAల ద్వారా భారత్.. అంతర్జాతీయంగా అనేక దేశాలకు అత్యంత విశ్వసనీయమైన భాగస్వామిగా నిలుస్తోంది.



ఇలాంటి వ్యూహాత్మకమైన సమయంలో.. ప్రధాని మోదీ నాయకత్వంలో కుదిరిన భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం ఒక వాణిజ్య ఒప్పందంగా మాత్రమే కాకుండా.. 21వ శతాబ్దపు భారత్ అభివృద్ధి ప్రయాణంలో ఓ కీలక మైలురాయిగా నిలిచిపోనుంది. భారత్, అమెరికా ఒప్పందంపై సరైన అవగాహన లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పిస్తున్నారు. కానీ, దేశ ప్రయోజనాలను కాపాడే విషయంలో రాజీపడకుండా.. 140 కోట్ల భారతీయుల విశ్వాసాన్ని సంపాదించుకున్న ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను సహించలేక, చేస్తోన్న మంచి పనులను.. అబద్ధాలతో, అసందర్భంగా కాంగ్రెస్ పార్టీ గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుంది.

భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని మూడు ప్రధాన కోణాల్లో అర్థం చేసుకోవాలి. మొదటిది.. సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోవడం, రెండోది.. పెట్టుబడుల విస్తరణ, మూడోది.. గ్లోబల్ వ్యాల్యూ చెయిన్‌లో భారతదేశ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం, ఇవి ప్రధాన లక్ష్యాలుగా కార్యాచరణ ఏర్పాటు చేసుకున్నాం. ప్రపంచంలో అతిపెద్ద మార్కెట్‌గా, సేవల కేంద్రంగా భారత్ ఎదిగింది. ఇప్పుడు.. ఉత్తమ సాంకేతికత తయారీ, డిజైన్‌లకు కేంద్రంగా మారేందుకు ఈ ఒప్పందం కీలకంగా మారనుంది. సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ, డిఫెన్స్, స్పేస్, సైబర్ సెక్యూరిటీ లాంటి అనేక రంగాల్లో మనం మరింత పురోగతి సాధించేందుకు వీలుపడనుంది. ఈ సాంకేతికత ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా.. అత్యాధునిక పరిజ్ఞానం భారతదేశానికి అందుబాటులోకి వస్తుంది. మన ఇంజనీర్లు, మన స్టార్టప్‌లకు ప్రపంచస్థాయి ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం లభిస్తుంది. దీని కారణంగా.. టెక్నాలజీ దిగుమతిదారుగా ఉన్న భారతదేశం.. ఇకపై గ్లోబల్ స్టాండర్డ్ టెక్నాలజీని ఎగుమతి చేయనుంది.

దేశ రాజధాని నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ఓ స్పష్టమైన, సానుకూలమైన ప్రభావాన్ని చూపించే భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు.. రైతులు, ఎగుమతిదారుల్లో అనవసర అనుమానాలను కలిగించేందుకు చేసిన కుటిల ప్రయత్నమే. రోజురోజుకూ దేశ రాజకీయాల్లో అస్తిత్వాన్ని కోల్పోతున్న రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ.. నెగటివ్ రాజకీయాల ద్వారా ప్రజల్లో అశాంతిని, రేకెత్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పదేళ్ల యూపీఏ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజలు ఆగ్రహించి ఆ ప్రభుత్వాన్ని గద్దెదించితే.. ఈ పన్నెండేళ్లలో తమ కళ్లముందు జరుగుతున్న పురోగతికి అదే ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తుండటంతో రాహుల్ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే.. అవకాశం చిక్కినపుడల్లా అబద్ధాలతో ప్రజలను ప్రభుత్వంపై రెచ్చగొట్టేలా దుష్ప్రచారం చేస్తున్నారు.

ప్రస్తుతం భారత్ రూ.4 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను వివిధ దేశాలకు ఎగుమతి చేస్తోంది. 38 అభివృద్ధి చెందిన దేశాల పరిధిలోని 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (FTAs) ద్వారా.. ఈ ఎగుమతులు మరో పదిరెట్లకు పైగా పెరిగి.. రూ.45 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్‌కు అవకాశాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అమెరికా దాదాపు రూ.10 లక్షలకోట్ల వస్త్రాలను దిగుమతి చేసుకుంటోంది. ఇందులో భారతదేశం నుంచే దాదాపు 10శాతం వస్త్రాలు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. ఈ కొత్త FTA తర్వాత మన ఎగుమతులు మరింత పెరగనున్నాయి. ఈ పరిస్థితులకు తగ్గట్లుగా.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 7 మెగా టెక్స్‌టైల్ పార్కులను అభివృద్ధి చేస్తోంది. ఇందులో ఒకటి తెలంగాణలోని వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో డెవలప్ అవుతోంది.



ఇలాంటి ప్రాజెక్టులు అమెరికా మార్కెట్‌తో అనుసంధానమైతే వేలాది యువతకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. దీనివల్ల తెలంగాణలోని చేనేత కార్మికులకు కూడా పెద్దమొత్తంలో లబ్ధి చేకూరనుంది. ఇది ఒక్క వస్త్ర పరిశ్రమ గురించిన ప్రస్తావన మాత్రమే. వివిధ పరిశ్రమలతో తెలంగాణకు మరింత ప్రయోజనం చేకూరడం ఖాయం. వస్త్ర పరిశ్రమ పెరిగితే.. పత్తి ఉత్పత్తికి కూడా డిమాండ్ పెరుగుతుంది. దీని ద్వారా రైతుల ఆదాయం కూడా పెరుగుతుంది. ఇది ఒక చైన్ ప్రాసెస్.

కానీ, రాహుల్‌గాంధీ మాత్రం దీనికి భిన్నమైన, అర్థం లేని వాదనతో దేశ వస్త్ర పరిశ్రమ ఎగుమతిదారులను, పత్తి డిమాండ్ తగ్గుతుందని రైతులను భయపెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా అనేక అంశాల్లో రాజీపడిన సంగతి మనందరికీ తెలుసు. 2013లో బాలి దీవిలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) మంత్రివర్గ సమావేశంలో ధాన్యం, పత్తిపై కనీస మద్దతు ధర (MSP) వ్యవస్థను 2017 నాటికి రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించింది. అనంతరం నరేంద్రమోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే 'ఆహార భద్రత'ను దృష్టిలో ఉంచుకుని.. అభివృద్ధి చెందుతున్న దేశాల పబ్లిక్ స్టాక్‌హోల్డింగ్ కార్యక్రమాలను WTO సవాలు చేయకూడదని ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కారణంగానే.. ఇవాళ కేంద్ర ప్రభుత్వం, కరోనానంతర పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా 81 కోట్ల మందికి ఉచితంగా ఆహారధాన్యాలను అందిస్తున్నది. తెలంగాణలోనూ 1.92 కోట్ల మంది ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు.

> ఎన్నికల్లో వరుస పరాజయాల తర్వాత రాహుల్‌గాంధీ నిరాశ, నిస్పృహలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అందుకే, ప్రధానిపై ఉన్న వ్యతిరేకతను దేశంపై వ్యతిరేకతగా మలచుకున్నారు. మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతిని చూసి జీర్ణించుకోలేక, అధికారం దక్కదన్న అసహనంతో.. దేశంలో అన్నదాతలను, ఎగుమతిదారులను రెచ్చగొట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారు. మోదీ సర్కారు చేసుకుంటున్న ఒప్పందాలపై రాహుల్ చేసే అసంబద్ధ విమర్శలను ప్రజలు హర్షించరు.

అన్నదాతల విషయంలో అన్యాయంగా వ్యవహరించినందుకు.. కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాలి. డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జాతీయ రైతు కమిషన్ సిఫారసులను అమలు చేసే ప్రసక్తే లేదని.. 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50శాతం ఎక్కువగా కనీస మద్దతు ధర ఉండాలని స్వామినాథన్ కమిటీ సూచించింది. దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించలేదు. అనంతరం, నరేంద్రమోదీ ప్రభుత్వం ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని కనీస మద్దతు ధరను నిర్ణయించే విధానాన్ని అమలు చేసింది. 2014తో పోలిస్తే.. దాదాపు అన్ని పంటలకు 50శాతం కనీస మద్దతు ధర పెంచడం ద్వారా రైతుల ఆదాయం పెరిగింది.

మన దేశంలో హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో యాపిల్ పంట బాగానే ఉన్నప్పటికీ.. దేశీయ అవసరాలకు తగ్గట్లుగా ఉత్పత్తి లేదు. భారతదేశం.. ప్రస్తుతం 5.5లక్షల మెట్రిక్ టన్నుల యాపిల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. అమెరికాతో ఒప్పందం కారణంగా అక్కడి నుంచి యాపిల్స్‌ను మనం దిగుమతి చేసుకోవచ్చు. అయితే.. అమెరికా నుంచి వచ్చే యాపిల్స్ ధర.. హిమాచల్‌ప్రదేశ్‌లో ఉత్పత్తి అవుతున్న ధరకంటే దాదాపు 40శాతం ఎక్కువ. అందువల్ల మన యాపిల్ రైతులకు ఎలాంటి నష్టం ఉండదు. మన దేశంలో ఏటా 6 కోట్ల టన్నుల దాణా అవసరం అవుతున్నది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరుగుతుంది. కానీ ప్రస్తుతం అమెరికాతో కుదిరిన ఒప్పందం కారణంగా మనం అక్కడి నుంచి దిగుమతి చేసుకునేది 5 లక్షల టన్నులే. అంటే మన అవసరంలో 1శాతం మాత్రమే. పౌల్ట్రీ ఇండస్ట్రీ ఇంకా ఎక్కువ దాణా దిగుమతి చేయాలని అడిగినా సరే.. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అందుకే.. ఈ విషయంలో మన రైతులు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఇలాంటి చర్యలతో పాటుగా వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో.. దేశం, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే.. రాహుల్‌గాంధీకి మాత్రం కంటగింపుగా మారింది. దేశం, తెలంగాణ పురోగతి చెందడం, యువతకు ఉద్యోగాలు రావడం రాహుల్‌కు ఇష్టంలేదని అర్థమవుతోంది. ఇప్పటి వరకు వరుసగా 100 ఎన్నికల్లో వరుస పరాజయాల తర్వాత రాహుల్‌గాంధీ నిరాశ, నిస్పృహలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అందుకే ప్రధానిపై ఉన్న వ్యతిరేకతను దేశంపై వ్యతిరేకతగా మలచుకున్నారు. మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతిని చూసి జీర్ణించుకోలేక, అధికారం దక్కదన్న అసహనంతో.. దేశంలో అన్నదాతలను, ఎగుమతిదారులను రెచ్చగొట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారు. సందర్భోచితంగా మోదీ సర్కారు చేసుకుంటున్న ఒప్పందాలపై అసందర్భోచిత విమర్శలతో దేశ ప్రజలముందు మళ్లీ మళ్లీ తన పరువు తానే తీసుకుంటున్నారు. వీటిని కూడా దేశ ప్రజలు, తెలంగాణ ప్రజలు హర్షించరు. కచ్చితంగా ఈ కుట్రలను తిప్పికొడతారు.

▪ జి.కిషన్‌రెడ్డి
కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి


ఐటీ నుంచి క్వాంటమ్.. చంద్రబాబు విజన్‌కు నిదర్శనం

ప్రపంచ చరిత్రను తిరగేస్తే– కాలంతో పాటు అప్‌డేట్ కానివారు చరిత్రలో కలిసిపోతారని, మార్పును ముందే పసిగట్టేవారు ప్రపంచాన్ని శాసిస్తారని స్పష్టమవుతోంది. మానవ పరిణామ క్రమంలో వ్యవసాయ విప్లవం నుంచి పారిశ్రామిక విప్లవం వరకు, అక్కడి నుంచి నేటి సమాచార సాంకేతిక (ఐటీ) యుగం వరకు ప్రతి కీలక దశలోనూ మార్పును ముందే గుర్తించి, అందిపుచ్చుకున్న దేశాలే ప్రపంచ యవనికపై ఆధిపత్యాన్ని సాధించాయి. సరిగ్గా నేడు ప్రపంచం మరో చారిత్రక మలుపు వద్ద నిలిచింది. ఆ సరికొత్త విప్లవం పేరే క్వాంటమ్ కంప్యూటింగ్. ప్రస్తుతం ఈ సాంకేతికతలో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ, చైనాలోని హైనన్ ప్రావిన్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేంద్రంగా చేసుకొని 'క్వాంటమ్ వ్యాలీ'ని నిర్మించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం కేవలం ఒక అభివృద్ధి ప్రాజెక్టు కాదు. అది రాబోయే శతాబ్దపు సాంకేతిక యుద్ధంలో భారత్‌ను అగ్రగామిగా నిలిపే సాహసోపేతమైన ముందడుగు.

నాడు హైటెక్ సిటీతో ఐటీ విప్లవానికి పునాది వేసిన విజనరీ లీడర్ నేడు క్వాంటమ్ వ్యాలీతో భవిష్యత్తు ప్రపంచానికి దిశా నిర్దేశం చేయబోతున్నారు. క్వాంటమ్ అంటే రాష్ట్ర ఆధునిక సాంకేతిక ప్రగతికి ఒక డిజిటల్ సంతకం. అమరావతికి క్వాంటమ్ వ్యాలీ రావడం వెనుక ప్రధానమంత్రి మోదీ ప్రజా సంకల్పం, ముఖ్యమంత్రి చంద్రబాబు దశాబ్దాల అనుభవం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిబద్ధత, మంత్రి నారా లోకేశ్ ఆధునిక వ్యూహం దాగి ఉన్నాయి. 2025 జనవరిలో దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో.. ఐబీఎం, గూగుల్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలతో లోకేశ్ జరిపిన చర్చలే ఈ ప్రాజెక్టుకు బలమైన పునాది వేశాయి. అమరావతిని కేవలం ఐటీ హబ్‌గా కాకుండా, భవిష్యత్తు సాంకేతిక కేంద్రంగా లోకేశ్ ప్రజెంట్ చేయగా, చంద్రబాబు తన రాజకీయ చతురత, అనుభవంతో దీనికి జాతీయస్థాయి ప్రాధాన్యం కల్పించారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎంవో నిరంతర పర్యవేక్షణ, వివిధ శాఖలను సమన్వయం చేస్తూ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసింది. ఐబీఎం వంటి సంస్థలతో ఒప్పందాల ఖరారులోనూ కీలక పాత్ర పోషించింది.

ఫలితంగా ఫిబ్రవరి 7న అమరావతి చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయడం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ క్వాంటమ్ పటంలో నిలిపే చరిత్రాత్మక ముందడుగు పడింది. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి అంతర్జాతీయ దిగ్గజాల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ కేంద్రం, దేశంలోనే మొట్టమొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌కు వేదిక కానున్నది. ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తి చేసుకుని, డిసెంబర్‌లో కార్యరూపంలోకి రానున్న ఈ ప్రాజెక్ట్ రాష్ట్రానికే కాక దేశానికే గర్వకారణం.

> చంద్రబాబు హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి శ్రీకారం చుట్టినప్పుడు వ్యక్తమైన సందేహాలను పటాపంచలు చేస్తూ, ఆ నిర్ణయం ఒక తరాన్ని ఐటీ యుగంలోకి నడిపించింది. సరిగ్గా అదే దూరదృష్టిని నేడు అమరావతి క్వాంటమ్ వ్యాలీ రూపంలో చూస్తున్నాం. అప్పట్లో ఐటీ విప్లవానికి తలుపులు తెరిస్తే, ఇప్పుడు అంతకంటే వేగవంతమైన క్వాంటమ్ యుగానికి రాష్ట్రం ద్వారాలు తెరుస్తోంది.



ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి హై–ఎండ్ ఉపాధికి ద్వారాలు తెరుస్తోంది. సంప్రదాయ ఉద్యోగాల పరిధిని దాటి సరికొత్త అవకాశాలు ఇక్కడే లభించడంతో మేధో వలసలు తగ్గి, ప్రతిభ అంతా రాష్ట్రానికే సొంతమవుతుంది. ఇప్పటికే 54 వేల మంది విద్యార్థులు క్వాంటమ్ శిక్షణలో పాల్గొనడం ఈ రంగంపై వారికున్న ఆసక్తికి నిదర్శనం కాగా, తెలుగు విద్యార్థులు ప్రపంచ స్థాయిలో సత్తా చాటాలన్న ముఖ్యమంత్రి ఆశయం ఈ పునాదితో వాస్తవరూపం దాల్చుతోంది.

క్వాంటమ్ కంప్యూటింగ్ దిశగా రాష్ట్రం అడుగులు వేయడం మొదలుపెట్టిన కొద్ది కాలంలోనే, గన్నవరంలోని మేధా టవర్స్ అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు నిలయంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతపై ఉన్న అచంచల విశ్వాసంతో క్యూక్లారివోయెన్స్, క్యూబీట్స్, సైబ్రానెక్స్, క్వాంటమ్ ఏఐ గ్లోబల్, క్యూబిటెక్, క్వాన్ ఫ్యూయెన్స్ వంటి దాదాపు 30 అగ్రశ్రేణి కంపెనీలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. ఒక నూతన సాంకేతికత వైపు చంద్రబాబు అడుగు వేస్తే, ప్రపంచం మొత్తం అటువైపే నడుస్తుందన్న నమ్మకానికి ఈ 'క్యూ' కట్టిన కంపెనీలే నిదర్శనం. భవిష్యత్తు సాంకేతికతను ముందే పసిగట్టి అమరావతిని గ్లోబల్ హబ్‌గా మారుస్తున్న ఆయన ప్రతిభకు ఈ పరిణామాలు నిలువుటద్దం.


ప్రపంచం స్థాయి కంపెనీలతో పాటు యువతను ఇంతలా ఆకర్షిస్తున్న ఈ క్వాంటమ్ కంప్యూటింగ్ అనేది గణన ప్రక్రియలోనే ఒక అసాధారణ విప్లవం. ఒక చిక్కుముడి నుంచి బయటపడటానికి సాధారణ కంప్యూటర్ ప్రతి దారినీ ఒక్కొక్కటిగా తనిఖీ చేస్తే.. క్వాంటమ్ కంప్యూటర్ ఒకే సమయంలో అన్ని దారుల్లోనూ ప్రయాణించి, క్షణాల్లో సరైన మార్గాన్ని కనిపెడుతుంది. సాధారణ కంప్యూటర్లకు శతాబ్దాల కాలం పట్టే సంక్లిష్ట సమస్యలను క్వాంటమ్ కంప్యూటర్లు కేవలం నిమిషాల్లోనే పరిష్కరిస్తాయి. ఇది కేవలం వేగం పెరగడం మాత్రమే కాదు.. కొత్త మందుల తయారీ నుంచి ఇంటర్నెట్ భద్రత వరకు అసాధ్యాలను సుసాధ్యం చేసే సాంకేతిక విప్లవం. అందుకే, అమరావతిలో నిర్మించే క్వాంటమ్ వ్యాలీ రాష్ట్రాన్ని గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చనుంది. నాడు ఐటీతో మన తలరాత మారినట్లే, రేపు ఈ క్వాంటమ్ వ్యాలీ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికే ఒక దిక్సూచిగా నిలపబోతోంది. ఈ ప్రతిష్ఠాత్మక రంగంలో అడుగు పెట్టడం వల్ల అంతర్జాతీయ రీసెర్చ్ ల్యాబ్స్, గ్లోబల్ టెక్ కంపెనీలు రాష్ట్రాన్ని చూసే దృక్పథం పూర్తిగా మారుతుంది.

టెక్నాలజీ పరంగానే కాకుండా, ఈ మార్పు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది. అధిక విలువ కలిగిన పరిశ్రమలు, పరిశోధన ఆధారిత పెట్టుబడులు రావడం వల్ల ఆదాయ వనరులు గణనీయంగా పెరుగుతాయి. దీనివల్ల రాష్ట్రం కేవలం సేవా రంగాలకే పరిమితం కాకుండా, విజ్ఞానమే సంపదగా మారే ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు పడతాయి. ఇది కేవలం నేటి అవసరాల కోసం చేస్తున్న ప్రయత్నం కాదు. రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఒక వ్యూహాత్మక నిర్ణయం.

చంద్రబాబు హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి శ్రీకారం చుట్టినప్పుడు వ్యక్తమైన సందేహాలను పటాపంచలు చేస్తూ, ఆ నిర్ణయం ఒక తరాన్ని ఐటీ యుగంలోకి నడిపించింది. సరిగ్గా అదే దూరదృష్టిని నేడు అమరావతి క్వాంటమ్ వ్యాలీ రూపంలో చూస్తున్నాం. అప్పట్లో ఐటీ విప్లవానికి తలుపులు తెరిస్తే, ఇప్పుడు అంతకంటే వేగవంతమైన క్వాంటమ్ యుగానికి రాష్ట్రం ద్వారాలు తెరుస్తోంది. కాలం ఎవరి కోసమూ ఆగదు, మనం కాలంతో పాటు పరిగెత్తాలా? కాలం మనల్ని పక్కన పెట్టాలా? అనే ప్రశ్నకు రాష్ట్రం సగర్వంగా ఇస్తున్న సమాధానమే ఈ క్వాంటమ్ వ్యాలీ.



• పల్లా శ్రీనివాసరావు
టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు



సూర్యలంకకు గోవా సొబగులు

- గోవాకు సూర్యలంకకు చాలా అంశాల్లో సారూప్యత
- చారిత్రక అంశాలు గోవాకు అదనపు ఆకర్షణ
- ఇక్కడ పరిస్థితులకు తగ్గట్లు కొన్ని అమలు
- గోవా పర్యటన విశేషాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్న కలెక్టర్ వినోద్‌కుమార్



8

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కేంద్రాల వద్ద నెంబర్లు సరిచూసుకుంటున్న విద్యార్థులు

- 98 శాతానికి పైగా విద్యార్థుల హాజరు
- జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు

గుంటూరు (విద్య)ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమ య్యాయి. తొలి రోజు సిట్టింగ్, ఫ్లయింగ్, హైపర్ కమిటీతోపాటు అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు కానీ, కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని అధికారులు వెల్లడించారు. జిల్లాలోని 87 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 34,792 మంది విద్యార్థులకు 34,018 (98.3 శాతం) మంది హాజరయ్యారు. 774 మంది గైర్హాజ య్యారు. ఒకేషనల్ పరీక్షకు 1,226 మందికి గాను, 1993 మంది హాజరయ్యారని ఆర్ఐఓ జి.సునీత వెల్లడించారు.

మంగళగిరిలోని వీజే జూనియర్ కళాశాల కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా విద్యార్థులు గంటకు ముందే కేంద్రాలకు చేరుకున్నారు. తురకపాలెం, పలకలూరు, గోరంట్ల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొన్ని కేంద్రాల విద్యార్థులకు స్వల్ప ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. అయితే దాదాపు అన్ని కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకున్నట్లు అధికారులు వెల్లడించారు.



టీజేపీఎస్ కళాశాల వద్ద హాల్ టిక్కెట్లు తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

ఆదాయం అన్వేషించాలి

- ప్రత్యామ్నాయ మార్గాలపై నూతన పాలక వర్గం దృష్టి సారించాలి
- కోల్డ్‌స్టోరేజీలు, గొర్రెల మండి, జిన్నింగ్ మిల్లులని కోల్పోయిన గుంటూరు ఏఎంసీ
- గత ప్రభుత్వంలో నియోజక వర్గానికి ఒక ఏఎంసీ విధానమే కారణం



గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల చట్టంలో చేసిన మార్పుల వల్ల గుంటూరు మిర్చియార్డు రూ.కోట్లలో ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అప్పటి వరకు గుంటూరు రూరల్ మండలం కూడా ఏఎంసీ పరిధిలో ఉండగా నియోజక వర్గానికో మార్కెట్ కమిటీ అంటూ గుంటూరు మిర్చి యార్డుని విభజించింది. దాని వల్ల యార్డుకు ఏటా ఆదాయం తెచ్చిపెట్టే శీతల గిడ్డంగులు, గొర్రెల మండి, పత్తి జి న్నింగ్, కారం మిల్లుల రూపంలో ఆదాయం కోల్పోయింది. ఇవన్ని ప్రత్తిపాడు ఏఎంసీ పరిధిలోకి వెళ్లిపోయాయి. వీటికి ప్రత్యామ్నా యంగా ఆదాయ మార్గాలను అప్పటి నుంచి గుంటూరు మార్కెట్ యార్డు అన్వేషించుకోలేకపోయింది. ప్రస్తుతం నూతన పాలకవర్గం ఏర్పడిన దృష్ట్యా వీటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

గుంటూరు మార్కెట్‌యార్డు ప్రస్తుతం మిర్చి క్రయవిక్రయాలపైనే ఆదాయపరంగా ఎక్కువగా ఆధారపడుతోంది. ఏటా రూ.109 కోట్ల మార్కెట్ ఫీజు వసూళ్లను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ లక్ష్యంగా నిర్దేశిస్తోంది. అయితే గత (మిగతా 8వ పేజీలో)

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సాయంత్రం 6.17 (మంగళవారం)

సహరి : ఉదయం 5.10 (బుధవారం)

'కేంద్ర గ్రంథాలయ' నమూనాలు విడుదల



- అత్యాధునిక వసతులతో అమరావతి లైబ్రరీ నిర్మాణం
- చరిత్ర, సంస్కృతికి చిహ్నంగా సెంట్రల్ లైబ్రరీ
- 12 నెలల్లో నిర్మించేలా ప్రణాళికలు

26 నుంచి మిర్చియార్డులో మధ్యాహ్న భోజనం

- 27వ తేదీ నుంచి అల్పాహారం కూడా పంపిణీ
- ఎల్-1 బిడ్డర్‌కే కేటాయించాలని చైర్మన్ అప్పారావు ఆదేశం



8

అన్నదాతకు అండగా




ఎప్పటికప్పుడు పంటల సాగుపై సమాచారం

- చీడపీడల నివారణకు సూచనలు
- మొబైల్ ఫోన్లకి సంక్షిప్త సమాచారం

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ శాఖ అన్నదాతలకు అండగా నిలుస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని.. ఎప్పటికప్పుడు పంటల సాగుపై సమాచారం రైతులకు అందిస్తోంది. పంటల సాగులో చీడపీడల నివారణకు సలహాలు, సూచనలు తెలియజేస్తోంది. పంటను నిర్ధారించి ఏ సమయంలో ఎలాంటి తెగుళ్ల ఆశిస్తాయి, సంస్యరక్షణ చర్యలను వివరిస్తూ.. రైతుల మొబైల్ ఫోన్లకు కచ్చితమైన సమాచారాన్ని సకాలంలో పంపిస్తూ దిగుబడులు పెంపొందించేందుకు దన్నుగా నిలుస్తోంది. వ్యాపారులను ఆశ్రయించి రైతులు నష్టపోకుండా నివారిస్తూ.. యంత్రాల సమాచారం అందిస్తోంది. మొత్తం మీద వ్యవసాయానికి సాంకేతికతను జోడించి సాగులో మెళకువలను క్షణాల్లో చేరవేస్తుండడంపై అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.




తెగుళ్ల నివారణకు రైతుల మొబైల్స్ వచ్చే సంక్షిప్త సమాచారం

అన్నింటికీ.. యాప్

ఏపీ అగ్రి యాప్ ద్వారా పంటల సాగు, చీడ పీడల వివరాలు, వాతావరణం, మార్కెట్ సమాచారం, రాయితీ పథకాల వివరాలను రైతులకు ప్రభుత్వం తెలియజేస్తోంది. ఈ-క్రాప్ నమోదు ఆధారంగా.. ఏ రైతు ఏ పంట సాగు చేశా రన్న సమాచారం వ్యవసాయశాఖ వద్ద ఉంది. దాని ఆధారంగా పంటల సాగుపై సలహాలు అందిస్తుంది. ఉదాహరణకు వరిలో చలి కారణంగా ఇనుము, జింకు లోపాలు తలెత్తవచ్చు. దీని నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల అన్నబేధి, రెండు గ్రాముల ఉప్పు లేదా 2 గ్రాముల జింక్ సల్ఫేట్ వారం వ్యవధితో రెండు సార్లు పిచికారి చేయాలని మొబైళ్లకు సమాచారం చేరవేస్తుంది. అలాగే రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, కంబైన్ హార్వెస్టర్లు, బేలర్లు వంటి యంత్రాలను (మిగతా 8వ పేజీలో)

రైతులకు.. రుణ కష్టాలు





- రాజధాని రైతులకు చుక్కలు చూపిస్తున్న బ్యాంకర్లు
- సీసీ రుణాలకు ససేమిరా.. ● పంట రుణాలకూ కొర్రీలు..

మంగళగిరి,(గుంటూరు)ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల రుణ కష్టాలు ఎంతకీ తీరడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి రుణం దొరక్క అప్పులపాలైన రైతులు కూటమి పాలనలోనూ అదే పరిస్థితి ఎదురు కావడంతో ఆందోళన చెందుతున్నారు. రుణాలు ఇవ్వకపోగా రైతుల చేత పెద్ద మొత్తంలో ఖర్చు చేయించి, చివరకు ఏదో ఒక మెలిక పెట్టి రుణాలు ఇవ్వకుండా ఎగవేయడంతో లబోదిబోమంటారు.

'సహకారం' అందించని బ్యాంకు

రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలంలో రైతులు రుణ సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. రైతులకు సంపూర్ణ సహకారం అందించాల్సిన సహకార బ్యాంకే సమస్యను సృష్టించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సహకార బ్యాంకుల ద్వారా క్యాష్ క్రెడిట్(సీసీ), దీర్ఘకాలిక(ఎల్‌టీ), పంట రుణాలు ఇచ్చే అవకాశం ఉన్నా అధికారులు ససేమిరా అంటున్నారు. గతంలో ఉన్న మేనేజరు సీసీ రుణాలు ఇచ్చేందుకు ఆమోదించినా, కొత్తగా వచ్చిన మేనేజర్ వాటిని ఆపేయడంతో లబోదిబోమంటున్నారు. రుణాలు మంజూరుకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఈసీ, వాల్యూయేషన్ సర్టిఫికేట్, నో డ్యూ సర్టిఫికేట్‌తోపాటు, తన ఖా పత్రాల నఖలు సమర్పించాలని నిబంధనలు పెట్టడంతో.. రైతులు రూ.వేలకు వేలు ఖర్చు చేసి వాటిని సమర్పించారు. తీరా రుణాలకు ఆమోద ముద్ర పడుతుంది అనుకునే సమయానికి అప్పటి బ్రాంచ్ మేనేజర్ బదిలీ కావడంతో.. కొత్త బీఎం వచ్చారు. ఆయన వచ్చింది మొదలు రుణాలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొనుగోలు పత్రాలు ఉన్నా అవి పనికి రావని, లింక్ డాక్యుమెంట్లు తేవాల్సిందేనని చెప్పి రుణాలు ఆపేశారు. దీంతో తుళ్లూరు మండలంలోని చాలా మంది (మిగతా 8వ పేజీలో)

రిటర్నబుల్ ప్లాట్లపైనా రుణాలు కరువు

రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లపైనా రుణాలు దక్కక అల్లాడిపోతున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి బ్యాంకు అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదు. రైతుల ప్లాట్లపై రుణాలు ఇస్తామని చెబుతున్నా, ఆచరణలో రుణాలు అందుతున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో రాజధాని కోసం భూములిచ్చిన అనేకమంది రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులకు ఎరగా మారి బలైపోతున్నారు.

రూ.800 కోట్లతో మంగళగిరి - బాపట్ల రహదారి

- అభివృద్ధి దిశగా సీఎం చంద్రబాబు ముందడుగు ● మంత్రి మనోహర్



కుంచవరం రహదారి నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమంతో పాటు అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం కొల్లిపర మండల అత్తోట పరిధిలో కుంచవరం నుంచి దంతలూరు వరకు రూ.3.30 కోట్లతో నూతనంగా నిర్మించనున్న రోడ్డుకు స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. పేదప్రజల సంక్షేమం, అభి వృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహా య సహకారాలతో మంగళగిరి నుంచి వయా తెనాలి మీదుగా బాపట్ల వరకు, తెనాలి నుంచి నారాకోడూరు వరకు రూ.800 కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్ట బోతున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆర్అండ్‌బీ ఆధ్వ ర్యంలో మొత్తం 10 రహదారుల అభివృద్ధి పనులకు అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. 34.27 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి రూ.25.70 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. తెనాలి మండలానికి నాలుగు రహదారులకు గాను 11.20 కిలోమీటర్లకు రూ 7.70కోట్లు, అదే విధంగా కొల్లిపర మండలానికి ఆరు రహదారులు నిర్మాణానికి 23.07 కిలో మీటర్ల కు రూ.18కోట్లతో అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలియజేశారు. తెనాలి ఆటోనగర్ నుంచి నందివెలుగు, ఐతానగర్ నుంచి నేలపాడు, బుర్రిపాలెం నుంచి చివలూరు, పినపాడు నుంచి అంగలకుదురు. అంగలకుదురు నుంచి దండమూడి రహదారులతో పాటు అత్తోట, ఈమని, నేలపాడు, సిరిపురం, చివలూరు, గుదిబండివారిపాలెం ప్రాంతాల్లోని కీలక రహదారుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ నాగపుణ్యేశ్వరరావు, ఉపసర్పంచ్ దివ్వెల ఏడుకొండలు, తహసీల్దారు సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్రనాయుడు, నాయకులు అడపా నారాయణరెడ్డి, యర్రు వెంకయ్యానాయుడు, దాసరి నరసయ్య పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను, భక్తజనులను ఆహ్వానించేందుకు స్వామి వారి సేవకుడైన గరుత్మంతుని పంపిస్తూ గరుడ ధ్వజాన్ని ఆవిష్కరించడం సంప్రదాయంగా వస్తోంది. దీని ప్రకారం గరుత్మంతుని చిత్రం ముద్రించిన పతాకాన్ని ఆవిష్కరించి ధ్వజారోహణం గావించారు. ఋత్విగ్వరణ, అంకురారోపణాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అర్చకస్వాములు ఈ ఉత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టనాగాధిపతియైన గరుత్మం తునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దల పేరుతో భక్తులకు పంపిణీ చేశారు. సం తానం లేని మహిళలు ఈ ప్రసాదాన్ని స్వీకరిం చినట్లయితే వారికి శీఘ్రగతిన సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ కారణంగా గరుడ ముద్దలను స్వీకరించేందుకు పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఈ ఉత్సవానికి మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ వారు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం నియమ నిష్ఠలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.





గరుడ ధ్వజంతో ప్రదక్షిణ

నేటి నుంచి వాహన సేవలు

మంగళాద్రిలో మంగళవారం నుంచి లక్ష్మీ నృసింహస్వామి ప్రధాన వాహన సేవలు ఆరంభం కానున్నాయి. తొలిరోజు స్వామి వారు హనుమంత వాహనంపై విహరిస్తారు.

బ్రిటీష్ చట్టాల సంస్కరణ శుభపరిణామం

● శాసనసభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పాలకులు దేశాన్ని ఆక్రమించినప్పుడు చేసిన చట్టాలను సంస్కరించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శుభపరిణామమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ శాసనసభలో సోమవారం అన్నారు. బ్రిటీష్ పాలకుల చట్టాలను సంస్కరించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, చట్టాల సంస్కరణను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ఖైదీలను సత్ప్రవర్తన కలిగిన వ్యక్తులుగా మార్చేలా ఈ చట్టాలు ఉండాలని కోరారు. జైలు అంటే పనిష్మెట్ కాదని సంస్కరణ కోసమని ఆలోచన ఈ చట్టంలో పొందుపరచాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం వల్ల తాను కూడా జైలుకు వెళ్లాల్సిన అవసరం వచ్చిందన్నారు. అప్పుడు తన పరిశీలనలో జీవితకాలం శిక్ష పడినవారు ఎంతో మంది 60 ఏళ్ల పైబడిన వారు ఉన్నారని వారిలో పశ్చాత్తాపం ఉందన్నారు. ఇలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం రెమిషన్ ఇవ్వాలని కోరారు. పలు కీలక నిర్ణయాలను కూడా పరిగణనలోకి తీసుకుని సంస్కరణల చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ విన్నవించారు.

బీపీఈడీ మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన బీపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను పీజీ పరీక్షల నిర్వహణాధికారి (సీఈ) ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. ఈ పరీక్షలకు 302 మంది హాజరు కాగా 294 మంది ఉత్తీర్ణులయ్యారు.రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈ నెల 28 లోగా తమ దరఖాస్తులను పీజీ కోఆర్డినేటర్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. రివాల్యుయేషన్ ఫీజును ఒక్కో సబ్జెక్టుకు రూ. 1,860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ. 2,190 చెల్లించాలన్నారు. పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని సీఈ వెల్లడించారు.

పెరిగిన మిర్చి రాక

● క్వింటాల్‌కు రూ.17వేల నుంచి రూ. 21,500 ధర

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు ఎండు మిరపకాయల రాక పెరిగింది. రెండు రోజుల సెలవుల అనంతరం సోమవారం ఉదయం లక్షా 17 వేల 276 టిక్కీలను రైతులు తీసుకొచ్చారు. తేమ శాతం కొంచెం ఎక్కువగా ఉండటం, ఇతర రాష్ట్రాల్లోని దిగుమతిదారులు రేటు తగ్గించడంతో ఇక్కడి ఎగుమతిదారులు కూడా అదే వైఖరిని అవలంబించారు. దీంతో రకం, నాణ్యతను బట్టి క్వింటాల్ రూ.17 వేల నుంచి రూ. 21500లకు అమ్మకాలు జరిగాయి. పది రోజుల క్రితం ఉన్న ధరతో పోల్చితే క్వింటాల్‌కు రూ.2500 నుంచి రూ.3 వేల వరకు తగ్గింది. ఈ నేపథ్యంలో రైతులు తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకొని మిరపకాయలను యార్డుకు తీసుకురావాలని ట్రేడ్‌వర్గాలు కోరాయి.

అనధికార సిగరెట్ల నిల్వలపై విజిలెన్స్ దాడి

● రూ.3.31 లక్షల విలువైన సిగరెట్లు స్వాధీనం ● ఇద్దరిపై కేసు నమోదు



సత్తెనపల్లిలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న అనధికార, నాసిరకం సిగరెట్లు

గుంటూరు/సత్తెనపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డీ సూర్య శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులతో కలసి నోముల కోటేశ్వరరావు గృహంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని వడ్డవల్లి ఆంజనేయ స్వామి ఆలయం వెనుక బజారులో నివశిస్తున్న నోముల కోటేశ్వరరావు గృహంలో అనధికార, నాసిరకం సిగరెట్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అనధికారిక, నాసిరక సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. రూ.3,31,060 విలువైన ఆరు రకాల అనధికార సిగరెట్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో ఉయ్యూరు సుబ్బారావు గుప్తా నుంచి సిగరెట్లు కొనుగోలు చేసినట్టు నోముల కోటేశ్వరరావు విజిలెన్స్ అధికారులకు తెలిపారు. నోముల కోటేశ్వరరావు, ఉయ్యూరు సుబ్బారావు గుప్తాపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.అమీర్, అసిస్టెంట్ జియాలజిస్టు అనీల్ బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అసెంబ్లీ ప్రాంగణంలో విద్యార్థులతో మంత్రి అనగాని సత్యప్రసాద్



అసెంబ్లీ ప్రాంగణంలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

విద్యార్థులు సమాజంపై అవగాహన పెంచుకోవాలి

● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె/ భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజంపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం అమరావతి సచివాలయంలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలను భట్టిప్రోలు మండలం ఐలవరం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, రేపల్లె నియోజకవర్గానికి చెందిన నగరం మండలం ఉల్లిపాలెం జడ్పీ హైస్కూల్, చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి జడ్పీ హైస్కూల్, నిజాంపట్నం మండలం అడవులదీవి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వీక్షించారు. అనంతరం సచివాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంత్రి అనగాని, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కలిసి మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు జరిగిన ప్రశ్నోత్తరాలను విద్యార్థులు వీక్షించటం వారి మెదడుకు పదును పెట్టినట్టేనన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మాజీ మంత్రి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తమకు ఈ అవకాశం కల్పించినందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

యువత పోటీతత్వాన్ని ఎదుర్కొని నిలబడాలి

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీతత్వాన్ని ఎదుర్కొని యువత నిలబడాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కే గంగాధర రావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వన్ వీక్ ఎంట్రిప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ వారు రూసా 2.0 ఏఎన్‌యూ స్పాన్సర్‌షిప్‌తో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధర్‌రావు మాట్లాడుతూ, పోటీతత్వాన్ని ఎదుర్కోవాలంటే అకడమిక్ స్కిల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలని అన్నారు. వీటిని విద్యార్థులు పెంపొందించుకోవడానికి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని, టెక్నోక్రాట్స్‌గా తయారవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి కీనోట్ స్పీకర్‌గా పై డేటా సెంటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ క్లౌడ్ అండ్ ఆపరేషన్ వైస్ ప్రెసిడెంట్ కేవీఎస్ ప్రకాశరావు, విశిష్ట అతిథిగా యూఎస్ఏలోని జార్జ్ మాసన్ యూనివర్సిటీ రీసెర్చ్ ఫెలో డాక్టర్ ఎం.రామకృష్ణ, సీనియర్ ఆప్టిట్యూడ్ ట్రైనర్ సీఈవో ట్రీమ్ ప్యాంట్ ట్రైనింగ్ సొల్యూషన్స్ హైదరాబాద్, రిజిస్ట్రార్ ఆర్ ఆచార్య జి.సింహాచలం,



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ప్రోగ్రాం కన్వీనర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్, ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ మల్లారపు గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, ప్రోగ్రాం కో కన్వీనర్ డాక్టర్ పి.ధనలక్ష్మి, ప్రోగ్రాం ట్రెజరర్ డాక్టర్ సీహెచ్ పుణ్య శేఖర్ వివిధ విభాగాల సమన్వయకర్తలు డాక్టర్ కొండా చైతన్య, డాక్టర్ యూ.సతీష్ కుమార్, డాక్టర్ దావులూరి అఖిల జాన్, డాక్టర్ బోయపాటి పూర్ణ చంద్రశేఖర్, డాక్టర్ ఎంవీ ఉమామహేశ్వరి, డాక్టర్ ఎడ్ల సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

● తీవ్ర గాయాలతో రైలు పట్టాలపై గమనించిన స్థానికులు ● వైద్యశాలకు తీసుకెళ్లేలోగా మృతి
● అత్తింటివారే చంపేశారంటూ తల్లిదండ్రుల ఆవేదన



వైష్ణవి (ఫైల్‌ఫొటో)

గురజాలటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వివాహిత అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. ఆమె భర్త, అత్తమామలే ఆమెను హింసించి చంపారని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మామిళ్లపల్లికి చెందిన వీరశెట్టి వైష్ణవి (39)కి ప్రకాశం జిల్లా ఇంకొల్లుకు చెందిన అంచె కిషోర్ బాబుతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరు రెండేళ్ల క్రితం గురజాలకు వచ్చి స్థిరపడ్డారు. వైష్ణవి రెంటచింతలలోని బాలవికాస్ స్కూల్‌లో టీచరుగా పనిచేస్తుండగా.. భర్త కిషోర్‌బాబు పట్టణంలోని ఓ ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. కాగా సోమవారం ఉదయం వైష్ణవి రైలు పట్టాలపై తీవ్రగాయాలతో కొన ఊపిరితో కనిపించింది. స్థానికులు గమనించి వెంటనే అంబులెన్సులో ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీనిపై మృతురాలి తల్లిదండ్రులు వీరశెట్టి పద్మజ, చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ కుమార్తె మృతికి ఆమె భర్త కిషోర్, అత్తమామలు అంజమ్మ, సాంబయ్యలే కారణమన్నారు. పెళ్లయిన దగ్గర నుంచి తమ కుమార్తెపై అనుమానం పెంచుకొని ప్రతిరోజూ ఆమె భర్త కిషోర్ నరకం చూపించే వాడని ఆరోపించారు. గత ఆదివారం రాత్రి కూడా తమ కుమార్తెపై దాడి చేసి చిత్రహింసలు పెడితే తమకు ఫోన్ చేసి బాధపడిందన్నారు. తమను సోమవారం రావాలని కోరిందని, తాము వచ్చే సరికే తమ కుమార్తె విగతజీవిగా కనిపించిందని తల్లడిల్లిపోయారు. తమ కుమార్తె మరణంపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని వేడుకున్నారు. అనంతరం గురజాల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు, గురజాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతురాలి ఏడేళ్ల కుమారుడు ఇంటి వద్దనే ఉన్నాడు.



రోదిస్తున్న మృతురాలి తల్లిదండ్రులు పద్మజ, చంద్రశేఖర్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

మిర్చియార్డు సమాచారం

(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	1,17,276
అమ్మకాలు	1,10,365
నిల్వ	24,393

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	20000
నెంబరు. 5	13500	20000
273	----	----
341	14000	20500
4884	----	----
సూపర్ 10	13500	20000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	18000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	21000
దేవనూరు డీలక్స్	15500	21500
ఆర్మూరు	13000	16500
ఏసీ కామన్ వెరైటీ		
334	13000	19000
నెంబరు. 5	13000	19500
273	----	----
341	14000	20000
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	17000
బ్యాడిగి 355	14000	20500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	11000

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన ఆగిరిపల్లి పోలీసులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో 2009లో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సోమవారం ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. 2009 ఫిబ్రవరి 9న తోటపల్లిలో బాలరావమ్మ ఉత్సవాల సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన జూద క్రీడల నిర్వాహకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కృష్ణాజిల్లా కంకిపాడు ప్రాంతానికి చెందిన నరహరశెట్టి సత్యనారాయణపై గుంటూరు ప్రాంతానికి చెందిన అలవాల వెంకటేశ్వరరావు ఆలియాస్ బాబ్జి దాడి చేయడంతో ఆయన మృతి చెందాడు. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేసి నిందితుడు బాబ్జిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కొంత కాలం కోర్టుకు హాజరవుతూ వచ్చిన నిందితుడు బాబ్జి 2014 నుంచి విచారణకు గైర్హాజరవుతున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో కోర్టు అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఇటీవల అతను గుంటూరు ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందుకున్న ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ సిబ్బందితో ఆదివారం చేరుకొని నిందితుడిని అరెస్టు చేశారు. అతడిని సోమవారం నూజివీడు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రెయిన్‌లో ఇద్దరు యువకుల గల్లంతు

● మద్యం మత్తులో ఈతకు దిగి కొట్టుకుపోయిన వైనం



పీటా లీలా వంశీ కృష్ణ, ఏటగిరి చందు (ఫైల్‌ఫొటో)

బాపట్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో సోమవారం నల్లమడ డ్రెయిన్‌లో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. బాపట్ల మండలం కనకాద్రినగర్‌కు చెందిన ఏటగిరి చందు (25), పిట్టలవానిపాలెం మండలం పోతనకట్టవారిపాలెంకు చెందిన పీటా లీలా వంశీకృష్ణ (20) స్నేహితులు. చందు తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా, వంశీకృష్ణ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. వీరు సోమవారం అప్పికట్ల రోడ్డులోని నల్లమడ డ్రెయిన్ వంతెన కిందకు వెళ్ళి మద్యం సేవించారు. వీరితో చందుకు బావ వరుస అయిన చైతన్య కూడా వచ్చాడు. ముగ్గురు కలిసి మద్యం సేవించిన తర్వాత చందు ఈతకు దిగి నీటి ప్రవాహానికి తట్టుకోలేక కొట్టుకుపోయాడు. ఇది గమనించిన స్నేహితుడు వంశీ కాపాడే క్రమంలో కాల్వలోకి దూకి కొట్టుకుపోయాడు. చైతన్య బంధువులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసులకు విషయాన్ని చేరవేశారు. డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, తహసీల్దార్ షేక్.సలీమా, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు.

రేపు కాటూరి మెడికల్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే

● ముఖ్యఅతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్



మాట్లాడుతున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలో వున్న కాటూరి మెడికల్ కళాశాల 22వ గ్రాడ్యుయేషన్ డేను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్టు హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నట్టు తెలిపారు. వేడుకలతో పాటు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన గుండె వైద్య క్యాత్ ల్యాబ్, అడ్వాన్స్‌డ్ గుండె శస్త్రచికిత్స ఆపరేషన్ థియేటర్‌ను గవర్నర్ ప్రారంభిస్తారని చెప్పారు. దేశంలో తొలిసారిగా క్యాత్ ల్యాబ్ మిషన్ కాటూరి వైద్యశాలలో ఏర్పాటు చేయడం విశేషమన్నారు. ఈ వేడుకల్లో గవర్నర్‌తో పాటు ప్రముఖ వైద్యులు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, వైద్యశాల చైర్మన్ కాటూరి సుబ్బారావు పాల్గొంటారు.

రైల్వే ఉద్యోగులకు మార్చి 2 నుంచి శిక్షణ

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు పౌర రక్షణలో ప్రాథమిక శిక్షణ ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ అధికారులు ఆదేశించారు. మార్చి 2వ తేదీ నుంచి ఏడో తేదీ వరకు అరండల్‌పేట ఒకటో లైనులోని రైల్ మహల్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరగనుంది. భద్రత సంబంధిత, అత్యవసర స్పందన విధానాలపై శిక్షణ ఇస్తారు. గుంటూరు, విజయవాడకు సంబంధించి రైల్వే ఉద్యోగులు, వలంటీర్లు ఈ శిక్షణకు హాజరయ్యేలా చూడాలని రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు. వారికి డ్యూటీ పాస్‌లు, పాకెట్ అలవెన్స్, టీఏ, కన్వేయన్స్ ఇవ్వడంతో పాటు ఆన్‌డ్యూటీగా శిక్షణ కార్యక్రమాన్ని పరిగణించాలని ఆదేశించారు.

భార్యాభర్తల గొడవలో భర్త మృతి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కురగల్లు గ్రామంలో భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్త మృతిచెందాడు. మంగళగిరి రూరల్ పోలీసుల వివరాల ప్రకారం, రాజధాని పనుల నిమిత్తం వలస వచ్చిన వెంకటేశ్వర నాయక్ (30), ప్రియాంక బాయి దంపతులు ఓ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం వెంకటేశ్వర నాయక్ పూటుగా మద్యం సేవించి భార్యతో గొడవ పడ్డాడు. ఇద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో వెంకటేశ్వర నాయక్ తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని హుటాహుటిన గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బ్రహ్మం తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొన్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కమిషనర్ అశోక్ తదితరులు

పీజీఆర్ఎస్ అర్జీలను విభాగాధిపతులే పరిశీలించాలి

● మేయర్ రవీంద్ర, కమిషనర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్, కాల్ సెంటర్ అందే ఫిర్యాదులను కేటగిరీలుగా వేరు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఆయా అర్జీలను విభాగాధిపతులే నేరుగా పరిశీలించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ కె.మయూర్ అశోక్‌లు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కౌన్సిల్ హాల్లో జరిగిన పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలను తీసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీల పరిష్కారంకు సంబంధిత అధికారి బాధ్యత తీసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారంపై విభాగాధిపతులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 56 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 20, ఇంజనీరింగ్ విభాగం 18, రెవెన్యూ విభాగం 13, ప్రజారోగ్య విభాగం 4, ఉపాసెల్ విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, జి.సాంబశివరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

ఏబీసీ సెంటర్ నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలి

● కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వీధి కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్ కోసం సెంటర్ నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలని, ఇప్పటికే ఏజెన్సీకి వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చినందున జాప్యం జరగడానికి వీలు లేదని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం పొన్నూరు రోడ్డులో నిర్మాణంలోని ఏబీసీ సెంటర్, సుద్దపల్లి డొంకలోని ఎస్టీపీ సెంటర్లను పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఏబీసీ సెంటర్ పనులను నిర్దేశిత మార్గదర్శకాల మేరకు వేగంగా చేపట్టాలన్నారు. నగరంలో వీధి కుక్కల సమస్యపై ఫిర్యాదులు అందిన ప్రాంతాలను వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరిశీలించాలన్నారు. అనంతరం సుద్దపల్లి డొంకలోని సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ని పరిశీలించి, ప్లాంట్ పూర్తి స్థాయిలో ఫంక్షనింగ్‌లో ఉండాలన్నారు. పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఈఈలు సుందర్రామిరెడ్డి, విష్ణు, వీపీఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, డీఈఈలు శ్రీనివాస్, సతీష్ కుమార్, ఎస్ఎస్ ఆయాత్ ఖాన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



పొన్నూరు రోడ్డులో ఏబీసీ భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరంలో వీధి కుక్కలకు ఏబీసీ వ్యాక్సినేషన్ డ్రైవ్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వీధి కుక్కలకు యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్ (ఏఆర్వీ) డ్రైవ్ చేపట్టామని, ఏబీసి సెంటర్ అందుబాటులోకి వచ్చే లోపు వీలైనన్ని కుక్కలకు చేయడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం కమిషనర్ ఆదేశాల మేరకు జిఎంసి వెటర్నరీ సర్జన్ డాక్టర్ నాగేశ్వరరావు నేతృత్వంలో నల్లచెరువు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో 18 వీధి కుక్కలను పట్టుకొని ఏఆర్వీ చేయడం జరిగిందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వార్డుల వారీగా వీధి కుక్కల సమస్యలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, త్వరలో ఏబీసి సెంటర్ కూడా అందుబాటులోకి రానున్నందున, ప్రస్తుతం కుక్కలకు ఏఆర్వీ చేయిస్తున్నా మన్నారు. నగర ప్రజలు కూడా ఎక్కడైనా వీధి కుక్కలు అగ్రెసివ్‌గా ఉండడం గమనిస్తే జీఎంసీ కాల్ సెంటర్ 0863-2345103కి తెలియచేయాలని కోరారు.

ఛలో విజయవాడ ధర్నాను విజయవంతం చేయాలి

● ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పెదబాబు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని, పెండింగ్ డీఎల మంజూరు, వేలకోట్ల పెండింగ్ బకాయిలు చెల్లింపు, ఎన్నికల మేనిఫెస్టో హామీల కోసం ఈనెల 25న ఎస్టీయూ ఏపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎస్టీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి.పెదబాబు మాట్లాడుతూ జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎస్కే బాజీ, ప్రధాన కార్యదర్శి వై శ్యాంబాబు, గుంటూరు ఏరియా కార్యదర్శి సుబ్బారావు, నాయకులు జోజప్ప, వెంకయ్య, శంకర ప్రసాద్, జిల్లా నాయకులు బేగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెదబాబు

క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన ఆర్వీఆర్ జేసీ విద్యార్థులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో యూ వరల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 7 మంది విద్యార్థులు రూ.5.5 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.25 వేలు స్టయిఫండ్ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

గడువులోపే అర్జీలను పరిష్కరించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● పీజీఆర్ఎస్‌కు 240 అర్జీలు



ఆనంద్‌పేటకు చెందిన సుతానా సమస్యను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను గడవులోపే పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీనివాసరావు కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇతర సమస్యలు, రెవెన్యూ క్లినిక్‌కు మొత్తం 240 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీని పక్కాగా పరిష్కారం చేయాలన్నారు. జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డీపీవో బీవీ నాగసాయి కుమార్, డీఆర్డీఏ పీడీ వి.విజయలక్ష్మి, పశు సంవర్థక శాఖ జేడీ కేవీవీ సత్యనారాయణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గాబాయి, ఉద్యాన శాఖ డీడీ రవీంద్ర బాబు, ఆర్టీవో శ్రీహరి, డీఈవో బాషా పాల్గొన్నారు.

ఐవీఆర్ఎస్‌లో సానుకూల దృక్పథం రావాలి

ప్రభుత్వం ఐవీఆర్ఎస్ విధానంలో అమలు చేస్తున్న పథకాలపై అభిప్రాయాలను సేకరిస్తుందని కలెక్టర్ చెప్పారు. ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాలని సూచించారు. రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లు మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, సమస్యల పరిష్కారం, సేవలు అందించడం తదితర అన్ని విభాగాలలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

● స్థానిక ఆనందపేట 8వ లైన్‌కు చెందిన ఇక్బాల్ సుతానా రెండు ఊపిరితిత్తులు పనిచేయడంలేదని, దీంతో ఆమెకు సాయం అందించాలని కోరుతూ ఆమె కుమారుడు పీజీఆర్ఎస్‌కు తీసుకురావడంతో, కలెక్టర్ తమీమ్ అన్సారియా నేరుగా ఆమె వద్దకు వెళ్లి అర్జీని తీసుకున్నారు. వైద్య పింఛను కింద మంజూరుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ప్రతి నెల మందులు ఉచితంగా అందేలా చర్యలు తీసుకుంటామని బాధితురాలికి కలెక్టర్ హామీ ఇచ్చారు.

● భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కోరుతూ రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు (సిపిఎం) ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపచేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాశం రామారావు, మొలక శివ సాంబిరెడ్డి, ఈమని అప్పారావు, నాగేశ్వరరావు తదితరులున్నారు.

● భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులను కేటాయించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ అర్జీ అందజేశారు. బోర్డు ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, కాకపోతే సదుపాయాలు, పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెమ్‌లు నిధులు చెల్లించవద్దని ఆయన చెప్పడం అన్యాయమన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాయల రామారావు, బొట్టు శ్రీనివాసరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, రెంటాల కుమారి విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

● వీధి కుక్కల నుంచి నగర ప్రజలను కాపాడాలని కోరుతూ సీపీఐ నగర కార్యదర్శి అకిటి అరుణ్ కుమార్ అర్జీ అందజేశారు. రెండు రోజుల క్రితం నల్లచెరువు ప్రాంతంలో ఆరు ఏళ్ల బాలుడిపై అత్యంత దారుణంగా కుక్కలు దాడి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి కుక్కలను అక్కడకు చేర్చి వాటిని పరిరక్షించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జంగాల చైతన్య, రావుల అంజిబాబు, కోట్ల మరియదాసు, జానీ తదితరులు ఉన్నారు.

● వ్యవసాయ, అనుబంధ రంగాలకు 50శాతం నిధులను కేటాయించాలని కోరుతూ రైతు సంఘ నాయకులు అర్జీ అందజేశారు. వ్యవసాయ బడ్జెట్లో గిట్టుబాటు, మద్దతు స్థిరీకరణ నిధికి ఐదు వేల కోట్లు, పంటల బీమా పథకానికి మరిన్ని నిధులను కేటాయించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం మరింతగా పెంచాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాదరావు, కె.రంగారెడ్డి, చిన్ని తిరుపతయ్య, విఠల్‌రెడ్డి ఉన్నారు.



ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐ టీయూ) జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యూటి అమలు, మే నెల సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం ప్రాజెక్టు కార్యాలయాల వద్ద, 25, 26, 27వ తేదీలలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు జరుగుతాయని, ఆ తరువాత మార్చి 2న చలో విజయవాడ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిరసన దీక్షలలో కె శ్రీనివాసరావు, శివలీల, సంధ్య, విజయ కుమారి, నాగమణి, చిన్న వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ పితామహుడు సంత్ గాడ్గే బాబా

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతకు తపించిన గొప్ప వ్యక్తి సంత్ గాడ్గే బాబా అని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణయ్య కొనియాడారు. అరండల్‌పేట, బీఎస్పీ జిల్లా కార్యాలయంలో సోమవారం గాడ్గే బాబా 150వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత దైవమని నమ్మి చీపురుతో వీధుల్ని, కీర్తనలతో మస్తిష్కాలను శుభ్రం చేసిన సంస్కర్త బాబా అని అన్నారు. బీసీ మహాజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వుగ్గం సాంబశివరావు మాట్లాడుతూ మూఢ నమ్మకాలకు, జంతు బలులకు వ్యతిరేఖంగా ప్రజలను బాబా చైతన్యపరిచారని గుర్తు చేసుకున్నారు. మహాత్మగాంధీ, అంబేద్కర్ వంటి మహనీయులు బాబా వారిని ఆదర్శనీయులు అని ప్రశంసించారని అన్నారు. బాబా వారి ఆలోచనలను ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకిచ్చే ఘన నివాళులని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ప్రసాదు, మునుగోటి నరసింహారావు, మేకల సుబ్బారావు, ఎం.రాజారావు, తన్నీరు సాంబయ్య, వరగాని ఏడుకొండలు, తాల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సంత్‌గాడ్గే బాబా వారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ బీసీ సంఘాల నాయకులు

శ్రీ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు విశేష గణపతి పూజ, అనంతరం శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం సువాసినులచే సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. కార్యక్రమాల్ని ప్రధాన అర్చకుడు మర్రిపాటి ప్రసాద్ పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పి.సి. సర్కార్ సీనియర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తొలుత ఆలయ పాలకమండలి వారు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరానికి చెందిన బాబు నాయుడు, డాక్టర్ రామకుమార్, వి.ఆర్ వాగోలు, నాగేంద్రప్రసాద్, రాంబాబు, డాక్టర్ ఆర్.ఎల్. ప్రసాద్ తదితరులు ఇంద్రజాలాలను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఇందులో బాల మెజీషియన్స్‌లు బేబి శ్రీవల్లి, మాస్టర్ ధనుష్ ప్రదర్శనలు అందరిని అబ్బుర పరిచాయి. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరి డాక్టర్ ఆర్ఎల్ ప్రసాద్‌లు సర్కార్ జీవిత విశేషాలను వివరించారు. ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు మెజీషియన్స్‌కి మెమోంటోలు అందజేశారు.

అర్ధరాత్రి ఇల్లు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్పీ స్కూల్ ఎదురు కబ్జా చేసేందుకు అర్థరాత్రి ప్రయత్నించిన నిందితులపైన, ల్యాండ్ మాఫియా పైన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొని వారి నుంచి తమకు ప్రాణ రక్షణ కల్పించాలని బాధితులు వేడుకున్నారు ఈ మేరకు సోమవారం బాధితులు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తాము 16 సంవత్సరాల క్రితం స్థలం కొనుగోలు చేసి అందులో ఇల్లు నిర్మించుకొని పాత సామాన్ల వ్యాపారం చేసుకుంటున్నామని కామాదుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అయితే ఈ నెల 12న అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని సుమారు 20 మంది లారీ, జేసీబీలతో వచ్చి ఇల్లు ధ్వంసం చేశారని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తమపై దాడి చేసి కొట్టారని వాపోయారు. పోలీసులకు ఫోన్ చేయగా వారు వచ్చే సరికి నిందితులంతా ఎక్స్‌కవేటర్, లారీని వదిలి పారిపోయారన్నారు. తర్వాత పోలీసులు ఎక్స్‌కవేటర్‌ని, లారీని స్టేషన్‌కు తరలించారు. ఘటన జరిగిన నాలుగైదు రోజులకు గానీ పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు అంతేకాకుండా ఇంటి కబ్జాకు ప్రయత్నించిన సమయంలో పోలీసులకు తాము ముగ్గురిని పట్టించామని వారిని కూడా వదిలేశారన్నారు. ఇదిలా ఉంటే ఆ ఇంటి పక్కనే ఉన్న తన చికెన్ షాప్‌ను కూడా గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని నేరెళ్ల దుర్గ మల్లేశ్వరరావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను ఎన్నో సంవత్సరాలుగా చికెన్ షాప్ నిర్వహిస్తున్నామని , ఈ నెల 12న అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు తన షాప్ షట్టర్ పగలగొట్టి ఐదు ట్రేల కోడిగుడ్లు ధ్వంసం చేసి, కౌంటర్లో ఉన్న రూ.19వేల నగదు తీసుకుని ఫర్నిచర్ సైతం ధ్వంసం చేశారన్నారు. వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకొని దాడికి పాల్పడిన వారందరినీ అరెస్టు చేయాలన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని వైసీపీ నాయకుడి మోసం

నగరపాలక సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానని తన నుంచి నాలుగు లక్షలు డబ్బులు తీసుకొని వైసీపీ నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు సోదరుడు మరో డైమండ్ బాబు మోసం చేశాడని బాధితుడు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు మండలం కసుకర్రు గ్రామానికి చెందిన లింగం షాలేం రాజు ఎంసీఏ చదివి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నానన్నారు. ఇలా ఉంటే మల్లికార్జునపేట మూడో లైనుకు చెందిన వనమాల వజ్రబాబు తనకు పరిచయమై నీకు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగం ఇస్తానని, తన తమ్ముడు డైమండ్ బాబు డిప్యూటీ మేయర్‌గా ఉన్నాడని చెప్పాడన్నారు ఇందుకుగాను రూ.ఐదు లక్షలు ఖర్చవుతుందని చెప్పి చివరకు నాలుగు లక్షలు తీసుకున్నాడని అన్నారు. చివరకు ఉద్యోగం రాకపోవడంతో తన డబ్బు తనకివ్వమని అడుగుతుంటే బెదిరిస్తున్నాడన్నారు. ఈనెల 20న డబ్బులు అడిగేందుకు వెళ్ళగా తనపై దాడి చేసి కొట్టాడన్నారు.

గేదెలు అపహరించి తప్పుడు కేసు బనాయిస్తున్నారు

ఇంటి ముందు కట్టేసిన గేదెలను అపహరించడమే కాకుండా చివరకు తనపై తప్పుడు కేసు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కొండా వెంకటప్పయ్య కాలనీకి చెందిన కే.వాలీబాయి సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కోదండ రామయ్యనగరుకు చెందిన కొందరు తన గేదెలను అపహరించారన్నారు. ఈ విషయమై తాను గతంలో నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు ఇదిలాఉంటే వారికి చెందిన స్కూటీని ఎవరో గుర్తు తెలియని వారు పెట్రోల్ పోసి దహనం చేస్తే దానికి తనను బాధ్యులుగా చేస్తున్నారని బాధితురాలు వాపోయారు. న్యాయం చేయాలని బాధితురాలు పోలీసు అధికారులను వేడుకున్నారు.

బార్‌లో క్యాషియర్‌పై దాడి

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వసంతరాయపురానికి చెందిన జంపాల శివకృష్ణ శారదకాలనీ ఆర్చి సెంటర్లోని శ్రీ విజయ సారథి బార్ అండ్ రెస్టారెంట్లో క్యాషియర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 22న రాత్రి ఆరు గంటల సమయంలో నంబూరు రాజ్‌కుమార్, పిల్లి జేమ్స్, బడుగు మనోజ్ మద్యం మత్తులో క్యాషియర్‌తో గొడవపడి బార్ షట్టర్లు మూసివేసి కుర్చీలు విరకొట్టి క్యాషియర్‌ని చంపుతానని బెదిరించారు. దీంతో క్యాషియర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

సాకేత్‌పురానికి చెందిన అలివేలు మంగమ్మ (31)కు సుమారు పది సంవత్సరాల క్రితం సత్యనారాయణతో పెళ్లి జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. సోమవారం ఉదయం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయింది. ఆమె తండ్రి మోపిదేవి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లింగాయపాలెం, లాలుపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ బి.రాజమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

మైనారిటీల పక్షపాతి కూటమి ప్రభుత్వం

● అసెంబ్లీ సమావేశాల్లో తూర్పు ఎమ్మెల్యే నసీర్



అసెంబ్లీలో మాట్లాడుతున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు బడ్జెట్లో ప్రాధాన్యం కల్పించి కూటమి ప్రభుత్వం మైనార్టీల పక్షపాతి అని నిరూపించుకుందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో సోమవారం ఆయన మైనారిటీల సంక్షేమం, న్యాయశాఖ అనే అంశంపై మాట్లాడారు. మైనారిటీల కోసం విద్య, ఉపాధి, రివాల్వింగ్ ఫండ్ వంటి అంశాలకు బడ్జెట్‌లో కేటాయింపులపై హర్షం వ్యక్తం చేస్తూనే, అమరావతిలో హజ్ హౌస్ నిర్మాణ ఆవశ్యకత వివరించారు. గత ప్రభుత్వంలో 78 గురుకులాలకు నిధులు నిలిపేస్తే ప్రస్తుత బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించారని చెప్పారు. మైనారిటీలకు ఉన్నత విద్య అందించేందుకు అబ్దుల్ కలాం విదేశీ విద్య పథకం ద్వారా రూ.20 కోట్లు కేటాయించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని మూలనపడేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డెక్కారని గుర్తు చేశారు. జనవికాస్ యోజన పథకాన్ని గత వైసీపీ నిర్వీర్యం చేస్తే, కూటమి ప్రభుత్వం రాష్ట్ర గ్రాంట్ కేటాయించి 120 పథకాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా కోటి రూపాయలు రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమని, ఈ ఫండ్ మరికొంత పెంచాలని విన్నవించారు. ఉర్దూను ద్వితీయ భాషగా గుర్తించడంతోపాటు ఉర్దూ ఘర్‌లు, షాదీఖానాలను నిధులు కేటాంచారన్నారు. సెంటర్ ఫర్ డెవపల్‌మెంట్ మైనారిటీస్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. దూదేకుల అభ్యున్నతికి రూ.50 కోట్లు కేటాయించారన్నారు.

బీసీ భవన నిర్మాణం త్వరితగతిన ప్రారంభించాలి

● అసెంబ్లీలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



అసెంబ్లీలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన బీసీ భవన నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. శాసన సభలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో 'బీసీ సంక్షేమం'పై జరిగిన చర్చలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడారు. బీసీ సంక్షేమానికి కేటాయించిన రూ. 51,021 కోట్ల నిధులు కేవలం సంఖ్యలు కాదని, అవి బీసీల ఆత్మగౌరవ పత్రంగా భావించవచ్చని అన్నారు. కింద టేడాది కేటాయింపుతో పోల్చితే ఈసారి భారీ పెరుగుదల చూపడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. బీసీల ఆర్థిక, సామాజిక పురోగతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఆదరణ 3.0 కింద 1000 కోట్లు, ఉచిత విద్యుత్ కోసం 600 కోట్లు, బీసీ వసతి గృహాల పురోగతి కోసం 300 కోట్లు, ఎన్టీఆర్ విదేశీ విద్యాధరణ పథకం కింద 3,838 కోట్ల కేటాయింపులు చేయడం హర్షణీయమని అన్నారు. కులవృత్తుల ఆధునీకరణకు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి, సమష్టి ర్ణయాల కోసం ఒక ఉమ్మడి వేదికగా బీసీ భవనం ఉపయోగపడుతుందని, సాధ్యమైనంత త్వరగా భవనాన్ని పూర్తి చేయాలని కోరారు. అలాగే బీసీలపై జరుగుతున్న దాడులు, వివక్షలను అరికట్టేందుకు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా దేశవ్యాప్తంగా జాతీయ బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు.

యార్డు అభివృద్ధికి ఏపీటీఎస్ సహకారం

● చైర్మన్ మన్నవ మోహన కృష్ణ

● మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావుకు శుభాకాంక్షలు

గుంటూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : గుంటూరు మిర్చి యార్డు అభివృద్ధిలో, సాంకేతికపరంగా ఏపీటీఎస్ పూర్తి సహకారం అందిస్తుందని ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన కుర్రా అప్పారావు, డైరెక్టర్లను కలిసి సోమవారం ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ సదుపాయాలు, పారదర్శక వ్యవస్థలు, ఆధునిక టెక్నాలజీ ద్వారా మిర్చి యార్డును మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. గుంటూరు మిర్చిని అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేయడంలో తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. మిర్చి యార్డును మరింత అభివృద్ధి చేసి రైతులకు మెరుగైనసేవలు అందించాలని కుర్రా అప్పారావును మన్నవ మోహనకృష్ణ కోరారు.



మిర్చియార్డు చైర్మన్, డైరెక్టర్లతో మన్నవ మోహనకృష్ణ

వైసీపీ పాలనలో దేవాలయాలపై జరిగిన దాడులను విచారించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో దేవాలయాలపై జరిగిన దాడులను విచారించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ అంతర్వేది రథం తగలబెట్టిన ఘటన, హిందూ దేవుళ్ళ విగ్రహాల తలలను ధ్వంసం చేసిన వాటిపై విచారణ చేపట్టాలన్నారు. అలాగే జనతా వారధిలో వృద్ధాప్య, వితంతు పెన్షన్లు, ఇళ్ల స్థలాల కోసం, రెవెన్యూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేసు సత్యనారాయణ, జనతా వారధి కో కన్వీనర్‌లు కత్తి మేరీ సరోజినీ, షేక్ సాంబశివరావు, మార్తా నరేంద్ర, దానబోయిన శివయ్య, కటారి దత్తప్రసాదు, లక్ష్మణ్ గౌడ్, మొవ్వ సురేష్, అబ్రహం పాల్గొన్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయండి

మార్చి 27న నగరంలో జరిగే శోభాయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ కోరారు. ఈ శోభాయాత్ర సాయంత్రం 4:12 నిమిషాలకు పాత గుంటూరు, వేంకటేశ్వరస్వామి గుడి మణి హోటల్ సెంటర్ నుంచి ప్రారంభమై గోరంట్ల, వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు సాగుతుందన్నారు.



వినతిపత్రం అందించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన బీజేపీ నాయకులు

అంబటికి ముద్రగడ, తమ్మినేని సీతారామ్‌ల పరామర్శ

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సిద్ధార్థనగర్‌లో నివాసం ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబును ముద్రగడ పద్మనాభంతో పాటు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్‌లు సోమవారం పరామర్శించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ముద్రగడ మాట్లాడుతూ అంబటి కుటుంబం పై జరిగే దాడులు ఆపాలని స్పష్టం చేశారు. తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ ఎన్ని దాడులు, అరెస్టులు చేసినా భయపెట్టలేరని, ఇంకా తమకు రెట్టింపు బలమిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా, వనమా బాలవజ్రబాబు తదితరులున్నారు.

సూర్యలంకకు గోవా సొబగులు

- గోవాకు సూర్యలంకకు చాలా అంశాల్లో సారుప్యత
- చారిత్రక అంశాలు గోవాకు అదనపు ఆకర్షణ
- ఇక్కడ పరిస్థితులకు తగ్గట్లు కొన్ని అమలు
- గోవా పర్యటన విశేషాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్న కలెక్టర్ వినోద్‌కుమార్



గోవా పర్యాటకానికి తగ్గట్లు సూర్యలంకలో ఉన్న అనుకూలతలు ఏమిటీ అనే అంశంతో పాటు ప్రతికూలతలపైన అధ్యయనం. శానిటేషన్ మొదలుకొని శాంతిభద్రతల వరకు గోవా మోడల్ ఏంటి. వాతావరణ పరిస్థితులపై పరిశీలన, తీర ప్రాంత నిబంధనల అమలు ఇలా అనేక అంశాలపై సమగ్రంగా చర్చించడంతో పాటు క్షేత్రస్థాయి పర్యటనకు ప్రాధాన్యమిచ్చేలా కలెక్టర్ వినోద్‌కుమార్ సారథ్యంలోని బృందం పర్యటన మూడు రోజుల పాటు గోవాలో సాగింది. ఈ పర్యటన విశేషాలను కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గోవా పర్యటనలో భాగంగా తొలి రోజే గవర్నర్ అశోక్ గజపతిరాజును కలిశాం. ఆయన ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. పైగా అక్కడి అధికారులను కూడా తమకు అసోసియేట్ చేయడం, ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. పర్యటన ముగింపు రోజయిన శనివారం సీఎం ప్రమోద్‌సావంత్‌ను కలిశాం. టూరిజంపై ఎన్నో విషయాలను ఆయన పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పర్యాటక అభివృద్ధిపై పెట్టిన శ్రద్ధను ఆయన ప్రశంసించారు. తీర ప్రాంత నిబంధనల విషయంలో సీఎం ప్రమోద్ సావంత్ ఇచ్చిన సూచనలు ఎంతో విలువైనవి.

● అధికారులతో సమీక్షలు

టూరిజానికి సంబంధించి గోవాలో వివిధ స్థాయిలో ఉన్న అధికారులతో ఉదయం పూట సమీక్షలు జరిపి, మధ్యాహ్నం నుంచి ఫీల్డ్ విజిట్ చేశాం. మూడు రోజుల షెడ్యూల్‌ను తయారు చేసుకొని, ఉన్న సమయంలోనే అన్నింటిని పరిశీలించాం. నిజానికి పర్యాటకానికి సంబంధించి ఇంకొంతమంది గోవా ఉన్నతాధికారులతో సమావేశం కావాల్సి ఉన్నప్పటికీ ఏఐ సమ్మిట్ మూలంగా షెడ్యూల్ కుదరలేదు.

● విస్తీర్ణం విషయంలో.....

పర్యాటకంగా గోవా విస్తీర్ణం 3 వేల చదరపు మీటర్లు కాగా దాదాపు బాపట్ల జిల్లాది కూడా ఇదే స్థాయిలో ఉంది. ఇక తీరప్రాంతం విషయానికి వస్తే గోవాలో 84 కిలోమీటర్ల మేర ఉండగా, జిల్లాలోని తీర ప్రాంతం కూడా 78 కిలోమీటర్లు వరకు ఉండడం కలిసొచ్చే అంశం.

● అక్కడవన్నీ ఇక్కడ అమలు చేస్తామని కాదు

పర్యాటకంగా గోవాకు, జిల్లాలోని తీర ప్రాంతానికి ఉన్న సారూప్యతతో పాటు వైరుధ్యాలను అంచనా వేయడానికి ఈ పర్యటన ఉపకరిస్తుంది. దానికనుగుణంగా ఇక్కడ ప్రణాళికలు రచించుకోవడానికి వీలుంటుంది. అక్కడ, ఇక్కడ పరిస్థితులను బేరీజు వేసుకొని సాధ్యాసాధ్యాలను బట్టి కొన్నింటినీ అమలు చేస్తాం.

మడ అడవులు కూడా మన దగ్గర లాగే ఉన్నాయి. కానీ భారీ స్థాయిలో అటవీ సంపద ఉంది. అది పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తోంది. అరుదైన వృక్ష సంపద, జంతువులు కూడా కనుల విందుగా ఉంటాయి. అక్కడితో పోలిస్తే మన దగ్గర అటవీ సంపద చాలా స్వల్పం.

● వర్షాలు అధికం...

ఇక్కడితో పోల్చుకుంటే గోవాలు మూడు రెట్లు అధిక వర్షాలు కురుస్తున్నాయి. ఇది కూడా అక్కడి ఆతిథ్య రంగానికి ఊతమిచ్చేదే. ఇక గోవాకు చారిత్రక నేపథ్యం ఉంది. పోర్చుగీసు చరిత్రతో వారికి లింకు ఉంది. ఇదే ప్రామాణికంగా అక్కడ అనేక చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. బీచ్ టూరిజానికి అదనంగా అవి కూడా తోడవడంతో రోజుల పాటు అక్కడ గడపడానికి పర్యాటకులు ఇష్టపడుతున్నారు. వీటన్నింటి వల్ల అక్కడ ఆర్గానిక్ టూరిజానికి వీలు కలిగింది. మన దగ్గర బీచ్ ఉన్నప్పటికీ రిలేటెడ్ టూరిజంపై కొంత కసరత్తు చేయాల్సి ఉంది. తీర ప్రాంత నిబంధనలకు అనుగుణంగా అక్కడ బీచ్ షాక్ (గుడిసెలాంటి రిసార్టు)లు పర్యాటకులకు మరింత వినోదాన్ని పంచుతున్నాయి. ఇదే తరహా మోడల్‌ను సూర్యలంకలో అమలు చేయొచ్చనే అంచనాకు వచ్చాం

● లిక్కర్...ఇతర వినోదాలు

గోవాలో పర్యాటకుల ఆకర్షణకు లిక్కర్ పాలసీ కూడా ఓ కారణమే. కాకపోతే మనకున్న పరిమితుల నేపథ్యంలో వాటిని ఎంతవరకు అనేది ప్రభుత్వం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మనకంటూ కొన్ని సాంస్కృతిక ప్రత్యేకతలు ఉన్నాయి. వాటిని ఇక్కడకు వచ్చే పర్యాటకులకు అందుబాటులోకి తెస్తే వారికి ఉపాధి దొరకడంతో పాటు మన చారిత్రక కళలను కూడా కాపాడుకున్న వారమవుతాం.

● రేపు నివేదిక అందిస్తాం...

అక్కడ పరిశీలించిన వాటిలో సూర్యలంకలో వేటిని అమల్లోకి తేగలం అన్న వాటిని ప్రభు త్వంతో చర్చించాక బహిర్గతం చేస్తాం. గోవా మూడు రోజుల పర్యటనను వివరంగా ప్రభుత్వా నికి నివేదిక రూపంలో బుధవారం అందిస్తాం. అనుకూలతలతో పాటు ప్రతికూలతలు, అక్కడి అధికారులు ఇచ్చిన సూచనలు, ముఖ్యమంత్రి, గవర్నర్ సందేశాలు ఇలా ప్రతి ఒక్క అంశాన్ని ప్రభుత్వానికి సమర్పిస్తాం. వాటి ఆధారంగా ప్ర భుత్వం తీసుకునే నిర్ణయాలను ఇక్కడ అమలు చేస్తాం. కానీ రాబోయే రోజుల్లో సూర్యలంక తీరా నికి గోవా తరహా సొబగులు అద్దడం మాత్రం ఖాయమంటూ కలెక్టర్ వినోద్‌కుమార్ తన టీం పర్యటన విశేషాలను ముగించారు.



అమరావతి కేంద్ర గ్రంథాలయం నమూనా

కేంద్ర గ్రంథాలయ నమూనాలు విడుదల

● అత్యాధునిక వసతులతో అమరావతి లైబ్రరీ నిర్మాణం ● చరిత్ర, సంస్కృతికి చిహ్నంగా సెంట్రల్ లైబ్రరీ ● 12 నెలల్లో నిర్మించేలా ప్రణాళికలు

(మంగళగిరి/గుంటూరు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కేంద్ర గ్రంథాలయ' నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి.అత్యాధునిక వసతులతో, ప్రపంచస్థాయి ప్రమాణాలతో కేంద్ర గ్రంథాలయాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల క్రితం నిర్వహించిన సమీక్షా సమావేశంలో తెలిపారు. ఆ సందర్భంగా గ్రంథాలయ నిర్మాణానికి సంబంధించి నిపుణులు రూపొందించిన నమూనాలను వీడియో ప్రెజెంటేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ నేపథ్యంలో సోమవారం 'కేంద్ర గ్రంథాలయ' నమూనాలు విడుదలయ్యాయి.

● నాలెడ్జ్ సిటీలో నిర్మాణం..

రాజధానిలో అత్యంత కీలకమైన నాలెడ్జ్ సిటీలో ఈ ప్రపంచస్థాయి స్టేట్ సెంట్రల్ లైబ్రరీని నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో గ్రంథాలయాన్ని నిర్మిస్తున్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అత్యాధునిక జ్ఞాన కేంద్రంగా ఉండేలా దీనిని నిర్మించనున్నారు. గ్రంథాలయం కోసం నిర్మించే భవనాలు మన చరిత్ర, సంస్కృతికి చిహ్నాలుగా ఉండేలా నమూనాలు రూపొందించాలని మంత్రి లోకేశ్ అధికారులకు సూచించారు. కేంద్ర గ్రంథాలయ నిర్మాణానికి రూ. 150 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 15లక్షల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంచనున్నారు. వాటితో డిజిటల్ లైబ్రరీ సిస్టమ్, ఈ-బుక్స్ వాటి అధ్యయనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఇంటర్నెట్ ల్యాబ్స్, స్టడీ రూమ్స్, గ్రూప్ డిస్కషన్ హాల్స్, ఆడియో, వీజువల్ రిసోర్స్ సెంటర్, సెమినార్ హాల్స్, ఆడిటోరియం వంటి సకల సదుపాయాలు ఉండేలా స్టేట్ సెంట్రల్ లైబ్రరీని నిర్మిస్తున్నారు. 12 నెలల్లో ఈ లైబ్రరీ నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు.

సుబ్రహ్మణ్య స్వామి వాహనానికి వెండి తొడుగు బహూకరణ



వెండి ఆభరణాలతో అలంకరించిన స్వామివారు, నెమలి వాహనం



వెండి నెమలి ఆభరణాన్ని బహూకరించిన ఎన్ఆర్ఐ పవన్‌కుమార్ దంపతులు

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అమరేశ్వరాలయంలోని ఉపాలయంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి వాహనం నెమలికి కాలిఫోర్నియాకు చెందిన ఎన్ఆర్ఐ దంపతులు యార్లగడ్డ పవన్‌కుమార్, పూర్ణిమా సౌభాగ్యలక్ష్మి సోమవారం వెండి తొడుగును బహూకరించారు. 3.750 కేజీల వెండితో చేసిన నెమలి కవచాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. స్వామివారికి అర్చకులు పూజలు నిర్వహించి వెండి ఆభరణాలను అలంకరించారు. గతంలో సుబ్రహ్మణ్య స్వామికి భక్తులు కొందరు వెండి తొడుగును బహూకరించగా పవన్‌కుమార్ దంపతులు నెమలి వాహనానికి వెండి ఆభరణం బహూకరించారు.

26 నుంచి మిర్చియార్డులో మధ్యాహ్న భోజనం

● 27వ తేదీ నుంచి అల్పాహారం కూడా పంపిణీ ● ఎల్-1 బిడ్డర్‌కే కేటాయించాలని చైర్మన్ అప్పారావు ఆదేశం

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో ఈ నెల 26వ తేదీ గురువారం నుంచి రైతులకు మధ్యాహ్న భోజనం పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుంది. 27వ తేదీ శుక్రవారం నుంచి అల్పాహారం కూడా పంపిణీ చేయనున్నారు. ఇంచుమించు మూడు వారాల నుంచి పెండింగ్‌లో ఉన్న టెండర్ వివాదాన్ని యార్డు నూతన చైర్మన్ కుర్రా అప్పారావు పరిష్కరించారు. నిబంధనల ప్రకారం ఎల్1 బిడ్డర్‌కే కేటాయించాలని ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ.చంద్రికని ఆదేశించారు. సోమవారం మిర్చియార్డు పరిపాలన భవనంలో రైతులకు మధ్యాహ్న భోజనం పంపిణీపై ఆయన సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ వద్ద జరిగిన టెండర్లలో అందరికంటే తక్కువ మొత్తానికి రూ. 88.25 పైసలకు బిడ్ దాఖలు చేసిన కాంట్రాక్టర్‌ని కాదని ఎల్2 బిడ్డర్‌ని ఖరారు చేశారు. అయితే దీనిపై ఎల్1 బిడ్డర్ అభ్యంతరం చెప్పడంతో టెండర్ ఖరారు నిలిచిపోయింది. దీనిపై తాను బాధ్యతలు స్వీకరించిన వెంటనే తుది నిర్ణయం తీసుకొంటామని చైర్మన్ అప్పారావు చెప్పారు. ఆ మేరకు సోమవారం అందరితో చర్చించి నిబంధనల మేరకు నిర్ణయం తీసుకొన్నారు. ఒకవేళ ఎల్1 బిడ్డర్ భోజనం, అల్పాహారం నాణ్యమైన, రైతులకు సరిపడా పెట్టకపోతే అప్పుడు అతనిపై చర్యలు తీసుకుందామని చెప్పారు.



మిర్చియార్డులో మధ్యాహ్న భోజనంపై సమీక్షిస్తోన్న చైర్మన్ కుర్రా అప్పారావు

రైతులకు రుణ కష్టాలు

(5వ పేజీ తరువాయి)

రైతులకు సహకార రుణాలు రాలేదు.

● సీసీ రుణాలకు నో..

సహకార బ్యాంకుల ద్వారా రైతులకు ఎకరాకు సీసీ రుణం కింద రూ.10 లక్షలు, పంట రుణం కింద రూ.3లక్షల చొప్పున ఇచ్చే అవకాశం ఉంది. లింక్ డాక్యుమెంటు లేదనే వంకతో బ్యాంకు అధికారి సీసీ రుణాలను నిరాకరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. వాటి స్థానే పంట రుణం కింద రూ.3 లక్షలు ఇస్తామని చెప్పినా.. అవి కూడా పూర్తిగా ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. వెలగపూడి గ్రామానికి చెందిన ఒక మహిళా రైతుకు పాత బ్రాంచ్ మేనేజర్ సీసీ రుణం ఇవ్వడానికి అంగీకరించగా, కొత్తగా వచ్చిన మేనేజర్ పంట రుణం రూ.2 లక్షలే ఇచ్చారు. మిగిలిన లక్ష రూపాయలు ఇవ్వకుండా బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటున్నారని చెబుతున్నారు. ఇలా చాలా మంది రైతులకు అరకొరగా రుణాలిచ్చి ఇబ్బందులకు గురి చేస్తుండడంతో ఇటీవల రైతులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేసిన రైతుల్లో ఒకరిద్దరికి రుణాలిచ్చి గొడవ సద్దుమణిగేలా చేసుకున్నారు. కాగా, రుణాల వ్యవహారంపై రైతులు డీసీసీబీ చైర్మన్, సీఈవోలను కలిసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. స్వయంగా సీఈఓ బ్యాంకు మేనేజర్‌కు ఫోన్ చేసి చెప్పినా రుణాలు ఇవ్వకపోవడం విశేషం.

అన్నదాతకు అండగా..

(5వ పేజీ తరువాయి)

సమీపంలోని యంత్ర సేవా ప్రదాతల నుచి అద్దె ప్రాతిపదికన పొందడానికి ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎప్పుడైనా బుక్ చేసుకొవచ్చు. ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్స్ యాప్‌ను డైన్‌లోడ్ చేసుకుని డ్రోన్‌లను కూడా బుక్ చేసుకోవచ్చు. ఈ-క్రాప్ నమోదుకు సబంధించి కూడా ముందస్తు సమాచారాన్ని రైతుల మెబైల్స్‌కు సమాచారాన్ని అందిస్తోంది.

సాధారణంగా పంటలకు తెగుళ్ల సోకితే ఎరువులు, పురుగు మందు వ్యాపారులు సిఫార్సు చేసిన మందులను రైతులను పిచికారి చేసి, తెగుళ్ల తగ్గక నష్టపోయేవారు. అలాగే తెగుళ్ల సోకిన మొక్కలను వ్యసాయ శాఖ అధికారుల వద్దకు తీసుకెళ్లి సలహాలు తీసుకుంటారు. ఇప్పుడు ఈ విధానానికి స్వస్తి చెప్పి వ్యవసాయ శాఖ సాంకేతికతను జోడించి పంటల సాగుపై సమాచారాన్ని అందిస్తుండటం మేలు చేసేదిలా ఉందని రైతులు చెబుతున్నారు. సకాలంలో సమాచారం పంటల దిగుబడులకు ఊతం ఇస్తోందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయానికి డ్రోన్ సాయం

● సమయం, డబ్బు కలిసొస్తుందంటున్న రైతులు
● ఆధునిక పద్ధతులతో సాగుకు సిద్ధం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి వ్యవసాయ పద్ధతులకు, నేటి పద్ధతులకు ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు పంటలకు పురుగుమందులు పిచికారి చేయాలంటే రైతుకు డబ్బు, సమయం ఎంతో వృథా అయ్యేది. కాని ఇప్పుడు డ్రోన్‌లు రావడంతో వారికి సమయంతో పాటు డబ్బు ఆదా అవుతోంది. దాంతో రైతులు వీటిపై మొగ్గు చూపుతున్నారు.

● డ్రోన్‌తో సమస్యలకు చెక్

ఒక ఎకరం విస్తీర్ణంలో సాగుచేస్తున్న పంటపై పురుగుమందులు పిచికారి చేయాలంటే సుమారు రూ.వెయ్యి ఖర్చే కాకుండా ఒక పూట సమయం, పంట కూడా కొంతమేర నష్టపోతుంది. ఏపుగా పెరిగే పత్తి, మిర్చి, కంది పంటలపై కూలీలు, రైతులు మందులు పిచికారి చేయాలంటే కొంత ఇబ్బందిగా ఉండేది. ఆ ప్రభావంతో కొందరు రైతులు అనారోగ్యం పాలయ్యేవారు, ఒక్కొక్కరు ప్రాణాల మీదకు తెచ్చుకునేవారు. అయితే డ్రోన్‌లతో ఆ పరిస్థితిని అధిగమించే అవకాశం రైతులకు ఉండటంతో వాటిపై వారు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వమూ చొరవ తీసుకొని యువ రైతులను వీటి వాడకంపై అవగాహన కల్పిస్తోంది. డ్రోన్‌లతో పాటు రోటావేటర్, గొర్రుచెట్లు, కలుపు నివారణతో పాటు మరికొన్ని యంత్రాలను సబ్సిడీపై రైతులకు ప్రభుత్వం అందజేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి డ్రోన్‌లను రైతు గ్రూపులకు అందజేసింది. ఒక్కో డ్రోన్ రూ.10 లక్షలు ఖర్చుకాగా, ప్రభుత్వం రూ.7 లక్షల 80 వేల సబ్సిడీ అందిస్తుండగా, రైతు వాటాగా రూ.2 లక్షల 20 వేలు చెల్లిస్తే సరిపోతుంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే మొదటి విడతగా డ్రోన్‌ల పంపిణీ పూర్తయింది.



రైతులకు డ్రోన్‌ను అందిస్తున్న వ్యవసాయ అధికారులు

● ఆసక్తి చూపుతున్న రైతులు

డ్రోన్ సాయంతో పంటలపై పురుగుమందులను స్ప్రే చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం కూడా భారీగా రాయితీ ప్రకటించడంతో రైతులు డ్రోన్‌లు తీసుకునేందుకు వ్యవసాయ అధికారులను సంప్రదిస్తున్నారు. కేటాయింపునకు మించి రైతులు డ్రోన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడం చూస్తే వాటిపై వారికున్న ఆసక్తిని తెలియజేస్తోంది. అలాగే గ్రామీణ ప్రాంతాలలో చదువుకున్న నిరుద్యోగ యువకులు డ్రోన్ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు.

ఆదాయం అన్వేషించాలి

(5వ పేజీ తరువాయి)

మూడేళ్ల సగటు తీసుకొంటే రూ.94.18 కోట్లు మాత్రమే ఏటా వసూలు జరుగుతోంది. దీనిని పరిగణనలోకి తీసుకొంటే దాదాపుగా రూ.15 కోట్ల ఆదాయం లోటు ఏర్పడుతోంది. దీనికి కారణం పత్తి జిన్నింగ్ మిల్లులు, శీతల గిడ్డంగులు, గొర్రెల మండి వంటి వాటి ద్వారా ఆదాయాన్ని ప్రత్తిపాడు ఏఎంసీకి కోల్పోవడమే. మార్కెట్ యార్డు ప్రాంగణం విస్తరించడానికి అవకాశం లేదు. ప్రాంగణమంతా దాదాపుగా కమీషన్ ఏజంట్ల దుకాణాలు ఏర్పాటయ్యాయి.

గతంలో చుట్టుగుంట వద్ద మార్కెట్ యార్డుకు ఉన్న స్థలంలో ఆఫీసులు ఏర్పడ్డాయి. రైతుబజార్‌ని కూడా ఏర్పాటు చేశారు. త్వరలో స్టేట్ జీఎస్టీ కమిషనరేట్‌ని ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో మిర్చియార్డుకు సమీపంలో కొంత స్థలాన్ని సమకూర్చుకోగలిగితే అక్కడ గొర్రెల మండి ఏర్పాటు చేయడానికి అవకాశాలుంటాయి. మిర్చికే పరిమితం కాకుండా మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులను రైతులు తీసుకొచ్చి విక్రయించుకొనే అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించాలి.

రైతుకు కన్నీరు తెప్పిస్తున్న కొత్తిమీర

● అమాంతంగా ధర తగ్గడంతో విలవిల ● కిలో రూ.25 నుంచి రూ.6కు పడిపోయిన వైనం

కొల్లిపర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొత్తిమీర పంటను సాగు చేసిన రైతులకు ఈ ఏడాది కూడా కోలుకోలేని దెబ్బతగిలింది. రెండు సంవత్సరాలుగా పంట చేతికి వచ్చే దశలో ధరలు తగ్గుతుండడంతో రైతుల కంట కన్నీరు మిగులుతోంది. రెండు సంవత్సరాలుగా ఆదాయం లేక అల్లాడుతున్న రైతులు ఈ ఏడాదయినా ధర బాగుంటుందని భావించారు. కాని వారికి నిరాశే మిగిలింది.

● కూలీ ఖర్చులైనా వస్తాయో రావోనని రైతుల ఆందోళన

కొత్తిమీర పంటను రైతులు కూలీలతో పీకించి మార్కెట్‌కు తరలిస్తుంటారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా కొత్తిమీర ధర ఒక్కసారిగా పడిపోవడంతో కనీసం కూలీ ఖర్చులయినా మిగులుతాయో లేదోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. దాంతో పంట చేతికి వచ్చినా కొత్తిమీరను కూలీలతో పీకించాలంటే రైతులు భయపడుతున్నారు.

● చల్లటి వాతావరణంలోనే సాగు

సంవత్సరం పొడవునా కొత్తిమీర పండదు. చల్లటి వాతావరణం ఉన్న సమయంలోనే కొత్తిమీరను రైతులు సాగు చేస్తారు. ఏప్రిల్, మే నెలల్లో కొత్తిమీర సాగు చేయటానికి అనుకూలంగా ఉండదు. రెండు సంవత్సరాల నుంచి మార్కెట్‌లో ధర హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. ఈ సంవత్సరం అయినా మంచి ధర వస్తుందన్న ఆశతో రైతులు కొత్తిమీర పంటను సాగుచేశారు. సాగుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. పంట 40 రోజుల్లో చేతికొస్తుంది. ఎకరానికి కౌలు, పెట్టుబడి, కూలి రవాణా ఖర్చులు రూ. లక్ష అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. గతంలో మార్కెట్‌లో కిలో రూ.25 నుంచి రూ.30 వరకు ధర ఉండేదని, అటువంటిది ఇప్పుడు కిలో రూ.6 నుంచి రూ.7కు పడిపోవడంతో కూలి, రవాణా ఖర్చులు కూడా మిగలడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న ధరలకు పంటను విక్రయించడం దండగని భావించిన కొందరు రైతులు పంటను తీసేస్తున్నారు. కొత్తిమీర గుబాళింపు రావాల్సిన ప్రదేశంలో కలుపు మందు వాసన వస్తోందని కొత్తిమీర సాగు చేసిన రైతులు కన్నీళ్లతో చెబుతున్నారు. కనీసం కిలోకు రూ.20 ధర ఉంటే గిట్టుబాటు అవుతుందని వారు పేర్కొంటున్నారు.



కొత్తిమీరను కట్టలు కట్టడానికి సిద్ధం చేస్తున్న కూలీలు



మార్కెట్‌కు తరలించటానికి ట్రేలలో సిద్ధం చేసిన కొత్తిమీర

ఇక సులువుగా గుండె స్కానింగ్

గుండెను స్కానింగ్ చేసే అత్యాధునిక సిటి స్కానింగ్ మిషన్ '640 స్లైస్ సిటి స్కానర్' అందుబాటులోకి వచ్చింది. ఇటువంటివి దేశంలో మూడే మూడు ఉండగా దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారి మన హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చింది. మెడికవర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్డియాలజిస్ట్ **డాక్టర్ శరత్‌రెడ్డి** దాని పనితీరును వివరించారు.





కొత్తగా

శరీరంలో 16 సెంటీమీటర్ల పరిధిని ఇమేజ్ చేసే పరికరమిది. మునుపటి సిటి యంత్రాలన్నీ కదులుతూ, తిరుగుతూ పనిచేసేవి. పైగా ఇమేజింగ్‌కు ఎక్కువ సమయాన్ని తీసుకుంటూ ఉండేవి. గుండె నిరంతరం కదిలే అవయవం కాబట్టి దీని ఇమేజ్‌ను స్వీకరించడం కొంత క్లిష్టంగా ఉంటుంది. 640 స్లైస్ సిటి స్కానర్ 16 సెంటీమీటర్ల స్ట్రక్చర్‌ను సేకరించగలుగుతోంది కాబట్టి అతి తక్కువ సమయంలో కచ్చితమైన ఇమేజింగ్ మొత్తం పూర్తయిపోతుంది. మునుపటి సిటిలతో పోల్చుకుంటే తాజా సిటి స్కానర్ ఎన్నో విధాల మెరుగైనది. ఎలాగంటే...

- పాత సిటి స్కానర్ల ఇమేజింగ్ కోసం కనీసం 8 సెకన్ల పాటు శ్వాసను ఆపవలసి వస్తుంది, కానీ తాజా స్కానర్‌తో ఆ సమస్య ఉండదు
- హృదయ స్పందనను 70కి తగ్గించినప్పుడే పాత సిటిలు ఇమేజింగ్ చేయగలుగుతాయి. తాజా స్కానర్‌కు హృదయ స్పందన అవరోధం కాదు
- పాత సిటి స్కానర్ల ఇమేజింగ్‌కు కనీసం అరగంట సమయం పడుతుంది. తాజా సిటి ఇమేజింగ్ మొత్తం సెకనులో నాలుగో వంతులోనే పూర్తయిపోతుంది

త్వరితం, సమర్థం

ఇమేజింగ్ పూర్తయిన తర్వాత, రేడియాలజిస్ట్, ఒక టెక్నీషియన్ ప్రతి ఇమేజ్‌ను పరిశీలించి, రక్తనాళాన్ని మార్క్ చేయవలసి వస్తుంది. కానీ 640 స్లైస్ సిటి స్కానర్, ఎఐ ఇంటిగ్రేటెడ్ కాబట్టి, మార్కింగ్ అవసరం ఉండదు. ఇమేజింగ్ పూర్తయిన వెంటనే అంతిమ ఇమేజ్ చేతికి అందుతుంది. పైగా ఫలితం ఎంతో కచ్చితంగా ఉంటుంది. త్వరిత ఇమేజింగ్, త్వరిత ఫలితం 640 స్లైస్ సిటి స్కానర్‌తో సాధ్యపడుతుంది. మునుపు కొరొనరీ యాంజియోగ్రామ్‌కూ సిటి కొరొనరీ యాంజియోగ్రామ్‌కూ మధ్య రిజల్యూషన్ పరంగా కొంత వ్యత్యాసం ఉండేది. ఈ రెండు సిటిల కోసం శ్వాస నిలిపి ఉంచడం, హృదయస్పందన తక్కువగా ఉండడం లాంటి పరిమితులను పాటించవలసిన అవసరం ఉంటుంది. అప్పుడే సిటి యాంటియోగ్రామ్ సాధ్యపడుతుంది. లేనప్పుడు సంప్రదాయ పద్ధతిలో కన్వెన్షనల్ యాంజియోగ్రామ్ చేయవలసి వస్తుంది. కానీ ఈ యంత్రానికి అలాంటి పరిమితులు ఉండవు.

రక్తనాళాల్లో అవరోధాలను కనిపెట్టడంతో పాటు ఇమేజింగ్ సమయంలోనే చికిత్సను ప్లాన్ చేసుకోగలిగే సౌలభ్యం 640 స్లైస్ సిటి స్కానర్‌లో ఉంటుంది. పరిస్థితి తీవ్రతను బట్టి అవరోధాలను తొలగించి గుండెకు రక్షణ కల్పించే చికిత్సలను వైద్యులు అంతిమంగా ఎంచుకుంటారు.



హియరింగ్ లాస్

పైబడే వయసులో వినికిడి శక్తి తగ్గడం సహజం. అలాగని ఆ సమస్యను అలాగే వదిలేయడం సరి కాదు. అవసరాన్ని బట్టి పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనలు, సలహాలు పాటించగలిగినప్పుడే, నాణ్యమైన జీవితం సాధ్యపడుతుంది.

వినికిడి విలువ తెలుసుకుందాం

శరీరంతో పాటు చెవులకు కూడా వయసు పైబడుతుంది. ఈ ప్రభావం 45 నుంచి 60 ఏళ్ల వయస్కుల్లో స్పష్టంగా బయల్పడుతూ ఉంటుంది. ఈ వయసులో నాడులు బలహీనపడి, కంటిచూపు తగ్గుతుంది. దాంతో ఏ పనికైనా చూపు అవసరం కాబట్టి వెంటనే కళ్లజోడు వాడుకోవడం మొదలుపెడతాం. కానీ వినికిడిని కాస్త నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. మాటలు గందరగోళంగా ఉండడం, సరిగా వినిపించకపోవడం, వినిపించినా స్పష్టత లోపించడం లాంటి సమస్యలు ఈ వయసులో మొదలవుతాయి.

చెవుల మీద కన్నేసి...

50 ఏళ్లు పైబడినవాళ్లు తప్పనిసరిగా జనరల్ చెకప్‌తో పాటు చెవులు కూడా పరీక్ష చేయించుకోవాలి. మధుమేహులు, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు, మూత్రపిండాల సమస్యలున్నవారు, రేడియో, కీమో థెరపీ తీసుకుంటున్నవారు, ఆటోఇమ్యూన్ వ్యాధులున్నవారు, ఫ్యాక్టరీలో



బిగ్గర శబ్దాలకు బహిర్గతమయ్యేవారిలో చెవులు దెబ్బతిని, వినికిడిశక్తి తగ్గే ముప్పు ఉంటుంది కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు తప్పనిసరిగా చెవులు పరీక్ష చేయించుకోవాలి. పెద్ద వయసులో గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో రక్తపు గడ్డల అవరోధాలు ఏర్పడినట్టే, చెవికి వెళ్లే రక్తనాళాల్లో కూడా రక్తపు గడ్డలు అడ్డుపడి వినికిడి శక్తి సన్నగిల్లే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆరోగ్య సమస్యలున్న ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి చెవులు పరీక్షించుకుంటూ ఉండాలి.

అవసరం, సౌకర్యం ఆధారంగా...

వినికిడి లోపం పైబడే వయసుతో పాటు పెరుగుతూ ఉంటుంది. ఈ సమస్యను సమూలంగా తొలగించే చికిత్స లేకపోయినప్పటికీ, అవసరాన్ని బట్టి వినికిడి మిషన్లను వాడుకోవాలి. బిహైండ్ ది ఇయర్, ఇన్ ది కెనాల్, రిసీవర్ ఇన్ ది కెనాల్, కంప్లీట్లీ ఇన్ ది కెనాల్, ఇన్ ది ఇయర్.. ఈ హియరింగ్ ఎయిడ్స్‌లో ఎవరికి వారు అవసరం, సౌకర్యం ఆధారంగా ఎయిడ్‌ను ఎంచుకోవాలి. కళ్లజోడు పెట్టుకోకపోతే మనకే ఇబ్బంది కాబట్టి తప్పకుండా జోడు పెట్టుకుంటాం. కానీ హియరింగ్ ఎయిడ్ మన కంటే పక్కవాళ్లకే ఎక్కువ అవసరం ఉంటుంది. కాబట్టి కళ్లజోడుకు ఇచ్చినంత ప్రాముఖ్యం హియరింగ్ ఎయిడ్‌కు ఇవ్వం. వినికిడి మిషన్ వాడుకునే ఎక్కువ మంది, దాన్ని అత్యవసరమైనప్పుడు వాడుకుంటూ మిగతా సమయాల్లో దాచుకుంటూ ఉంటారు. కానీ జీవితమంతా ఎప్పటిలాగే సౌకర్యంగా గడుపుతూ, ప్రతి పనిలో, ప్రతి విషయంలో ప్రమేయం కల్పించుకోవాలంటే వీటిని మన శరీరంలో భాగం చేసుకోవాలి.

హియరింగ్ ఎయిడ్ వాడకం

వయసు పైబడేకొద్దీ, హియరింగ్ ఎయిడ్ ఉపయోగించుకున్నా, ఉపయోగించుకోకపోయినా వినికిడి శక్తి క్రమేపీ తగ్గిపోతూనే ఉంటుంది. అలాగని ఈ పరికరాన్ని వాడుకోకుండా ఉండకూడదు. దీన్ని ఉపయోగించకపోతే.. కుటుంబసభ్యులతో, స్నేహితులతో కలవలేరు. మాటలు కలపలేరు. దాంతో కుటుంబంలోనే పరాయి వ్యక్తిగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. దాంతో మానసిక కుంగుబాటుకు లోనవుతారు. కంపెనీ యజమాని హోదాలో ఉన్నవారిలో పని సామర్థ్యం సన్నగిల్లుతుంది. అలాగే వినికిడి శక్తి కొంత మేరకు ఉన్నప్పుడే హియరింగ్ ఎయిడ్స్ పని చేస్తాయి. వినికిడి శక్తిని పూర్తిగా పోగొట్టుకుని, ఆ తర్వాత హియరింగ్ ఎయిడ్స్ మీద ఆధారపడాలి అనుకుంటే, అవి ఏ విధంగానూ ఉపయోగపడవు.

సమర్థ చికిత్సలున్నాయి

కొందరికి చెవిలో చీము కారుతూ ఉంటుంది. ఇలాంటప్పుడ వైద్యులను కలిసి కర్ణభేరిని మరమ్మతు చేయించుకుంటే, వినికిడిశక్తి మెరుగుపడే అవకాశం ఉంటుంది. కొందరికి చెవి లోపలి ఎముకల్లో సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. మహిళల్లో ఈ సమస్య ఎక్కువ. ఈ సమస్యను సర్జరీతో సరిచేయవచ్చు. దాంతో వినికిడి మెరుగు పడుతుంది. పూర్తిగా వినికిడి శక్తి కోల్పోయిన వారికి సర్జరీతో కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చి వినికిడిని తిరిగి తెప్పించవచ్చు.

ఈ పరీక్షలు కీలకం

- **ప్యూరిటోన్ ఆడియోమెట్రీ:** తక్కువ, ఎక్కువ ఫ్రీక్వెన్సీలలో తలెత్తిన వినికిడి లోపాన్ని ఈ పరీక్షతో కనిపెట్టవచ్చు. 50 ఏళ్లు పైబడిన వాళ్లలో అధిక ఫ్రీక్వెన్సీల దగ్గర వినికిడి లోపం ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా శబ్దం వినగలుగుతున్నా స్పష్టత లోపిస్తుంది
- **ఇంపిడెన్స్ ఆడియొమెట్రీ:** పైబడే వయసులో కీళ్లు బిగుసుకుపోయినట్టే, మధ్యచెవిలో ఉండే మూడు ఎముకలు, వాటి జాయింట్లు కూడా బిగుసుకుపోతూ ఉంటాయి. ఫలితంగా చెవులు దిబ్బెడ పడినట్టు, వినికిడి తగ్గిపోతుంది. కండక్టివ్ హియరింగ్ లాస్ సమస్య తలెత్తుతుంది. ఈ సమస్యను సర్జరీతో సరిచేసుకోవచ్చు
- **స్పీచ్ ఆడియొమెట్రీ:** ఈ పరీక్షతో వినికిడి మోతాదును తెలుసుకోవచ్చు
- **ఓటోఅకౌస్టిక్ ఎమిషన్స్:** ఈ పరీక్షతో, శబ్దానికి లోపలి చెవి స్పందించే తీరును తెలుసుకోవచ్చు

నియంత్రణ ఇలా...

- మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలి
- అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి
- ఆరోగ్యకరమైన ఆహారశైలితో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవాలి
- ఫ్యాక్టరీల్లో పెద్ద శబ్దాల మధ్య పని చేసేవారు, ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి
- సాఫ్ట్‌వేర్, కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్స్, తరచూ చెవులకు విశ్రాంతినిస్తూ ఉండాలి
- అవసరం ఉన్నా లేకపోయినా, రోజంతా ఇయర్‌పాడ్స్, ఇయర్‌ఫోన్స్ వాడేవారు త్వరగా వినికిడి శక్తి కోల్పోయే ముప్పు ఉంటుంది. కాబట్టి ఈ అలవాటు మానుకోవాలి
- రోజు మొత్తంలో 60 డెసిబుల్స్ కంటే తక్కువ వినడం సురక్షితం. కాబట్టి రోజు మొత్తంలో ఎన్ని అడుగులు నడిచామో లెక్కించుకున్నట్టే రోజు మొత్తంలో ఎన్ని డెసిబుల్స్ విన్నామో లెక్కించుకుంటూ ఉండాలి
- హెడ్‌ఫోన్స్ పెట్టుకుని నిద్రపోకూడదు, చెవులకు విశ్రాంతి ఇవ్వాలి

డాక్టర్ పివిఎల్ఎన్ మూర్తి
సీనియర్ కన్సల్టెంట్ ఇఎన్‌టి,
స్టార్ హాస్పిటల్స్, బంజారా హిల్స్,
హైదరాబాద్



వీటిలోనూ ప్రొటీన్

మాంసకృత్తులు అనగానే ఎవరికైనా మాంసాహారమే గుర్తొస్తుంది. కానీ కొన్ని తృణధాన్యాల్లో ఎముకలు, కండరాలను బలపరిచే మేలు రకం మాంసకృత్తులుంటాయి. వాటి గురించి తెలుసుకుందాం!

క్వినోవా

ఈ తృణధాన్యంలో అత్యధిక ప్రొటీన్లుంటాయి. పీచుతో కూడిన ఈ తృణధాన్యాన్ని నీళ్లలో ఉడికించి, కూరగాయలతో కలిపి తినొచ్చు. ఆకుకూరల సలాడ్ మీద చల్లుకుని తినొచ్చు. లేదాంటే ఓట్‌మీల్ మాదిరిగా పాలతో కలిపి, నట్స్, సీడ్స్, పండ్ల ముక్కలు చల్లుకుని తినొచ్చు. ఒక కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

గుడ్ ఫుడ్



అడవి బియ్యం

బ్రౌన్, వైల్డ్ రైస్‌లో తక్కువ పిండిపదార్థాలు ఎక్కువ పీచు, ప్రొటీన్ ఉంటాయి. పర్పుల్ బ్లాక్ రైస్‌లో బి విటమిన్లు, క్యాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, జింక్ కూడా ఉంటాయి. ఈ బియ్యాన్ని ప్రధాన భోజనంలా లంచ్, డిన్నర్‌లో తినొచ్చు. ఒక కప్పు వైల్డ్ రైస్‌లో ఆరున్నర గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.


అమరాంథ్


తోటకూర విత్తనాలు ప్రధానంగా హృద్రోగులు, టైప్2 మధుమేహులకు ఆరోగ్యకరం. తోటకూర విత్తనాల్లో యాంటీఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. అలాగే బి విటమిన్లు, కాపర్, జింక్, మాంగనీస్ మొదలైన ఖనిజాలు కూడా ఉంటాయి. ఉడికించినప్పుడు మెత్తగా జారుడుగా తయారయ్యే ఈ విత్తనాలను ఓట్స్ మాదిరిగా తినొచ్చు. ఒక కప్పు తోటకూర విత్తనాల్లో తొమ్మిది గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

పారాహుషార్

మార్కెట్‌లో కల్తీ పన్నీర్

దేశవ్యాప్తంగా దొరికే 122 పన్నీర్ నమూనాలను పరీక్షించిన ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, వాటిలో 83 శాతం నమూనాలు నకిలీవని తేల్చింది. 83% నమూనాలు నాణ్యత పరీక్షలో విఫలమయ్యాయి. 40% పన్నీర్ నమూనాలు జంతువులు తినడానికి కూడా సురక్షితమైనవి కావు. భారతదేశంలో అత్యంత ఎక్కువగా నకిలీ రూపంలో దొరుకుతున్న, కల్తీ అవుతున్న పదార్థం పన్నీర్ ఒక్కటే! మైదా, యారో రూట్ పౌడర్, కల్తీ పాలు లేదా పాలపొడి, పామాయిల్, నిల్వ పదార్థాలు, యూరియాలను కలిపి నకిలీ పన్నీర్‌ను తయారు చేస్తారు. ఈ పన్నీర్‌ను తినడం వల్ల దీర్ఘకాలంలో పేగులు, కాలేయం దెబ్బతినడంతో పాటు మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. రోడ్డు పక్కన ఫుడ్ స్టాల్స్, చిన్న చిన్న హోటళ్లు, ఈటరీలు విక్రయించే పనీర్ 65, పన్నీర్ టిక్కా లాంటి వంటకాల్లో ప్రమాదకరమైన వంటనూనెలు ఉపయోగించి తయారుచేసిన సింథటిక్ పన్నీర్‌ను ఉపయోగిస్తున్నట్టు పరీక్షల్లో తేలింది. కాబట్టి ఇలాంటి నాసి రకం పన్నీర్‌తో ఆరోగ్యం కుదేలవకుండా ఉండాలంటే బయట పన్నీర్ తినడం మానేయాలి. కల్తీ పన్నీర్‌ను కనిపెట్టడం కోసం దానికి అయోడిన్‌ను జోడించాలి. పన్నీర్ నీలంగా మారితే అది కల్తీదని అర్థం.





డైట్

బరువు అదుపులో ఉండడానికి తోడ్పడే సరళమైన సూత్రం సమతులాహారమే! తినకూడనివి పరిమితం చేసి, తినవలసినవి తింటే బరువు అదుపులో ఉంటుంది. అందుకోసం ఎలాంటి ఆహార నియమాలు పాటించాలో తెలుసుకుందాం!

ఆహారం వ్యవహారం

చక్కెర చేటే!

చక్కెర...శరీరంలో నొప్పితో కూడిన వాపులు (ఇన్‌ఫ్లమేషన్), సోరియాసిస్, మొటిమలు, ఎగ్జిమా, చర్మం సాగిపోవడం లాంటి చర్మ సంబంధ సమస్యలకు కారణమవుతుంది. చక్కెర వల్ల చర్మం అడుగున ఉండే కొల్లాజెన్ క్షీణించి, చర్మం సాగే గుణం కోల్పోతుంది. తెల్లని చక్కెర, బ్రౌన్ షుగర్, సుక్రలోజ్, మేపుల్ షుగర్, మొలాసిస్, తేనెలు మానేయాలి. బదులుగా పండ్లు ఎంచుకోవచ్చు.

ఇవి మానేయాలి

సరళమైన పిండిపదార్థాలు అతి త్వరగా సింపుల్ షుగర్స్‌గా మారిపోతాయి. ఇలా రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోకుండా ఉండాలంటే క్లిష్టమైన పిండిపదార్థాలు తినాలి. అందుకోసం చిలకడదుంపలు, గుమ్మడి, క్వినోవా లాంటి, ఇన్సులిన్ పెరగకుండా ఉంచే పిండి పదార్థాలనే ఎంచుకోవాలి.

హార్మోన్ల హెచ్చుతగ్గులు

హార్మోన్ల హెచ్చుతగ్గులు కూడా బరువును ప్రభావితం చేస్తాయి. అందుకు కారణాల గురించి తెలుసుకుందాం

ప్రొలాక్టిన్: ఈటింగ్ డిజార్డర్లు, అస్తవ్యస్థ థైరాయిడ్, కాలేయం పనితీరు గాడి తప్పడం, పిట్యుటరీ గ్రంథిలో కణుతులు ప్రొలాక్టిన్ అధిక విడుదలకు ప్రధాన కారణాలు. లక్షణాలను బట్టి వైద్యులను కలిసి చికిత్స తీసుకుని, ఈ హార్మోన్ స్రావాన్ని సరిచేసుకోవాలి.

ఎండోమెట్రియోసిస్: ప్రొజెస్టరాన్ హార్మోన్ తగ్గుదల కారణంగా ఎండోమెట్రియోసిస్ తలెత్తే వీలుంది. ఇందు కోసం ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తిని తగ్గించే మందులు వాడి పరిస్థితిని అదుపు చేసుకోవచ్చు.

పిసిఒ, పిసిఒడి: చక్కెరకు ఫుల్‌స్టాప్ పెట్టి, పీచును పెంచి, అత్యల్ప గ్లైసెమిక్ ఆహారం తీసుకుంటూ, అత్యధిక మాంసకృత్తులు, ఒమేగా 3 కొవ్వులు తీసుకోవాలి. వ్యాయామం తప్పనిసరి.

శుద్ధి వద్దు

ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో నిల్వ రసాయనాలు, కృత్రిమ రంగులు, రుచులు జోడించి ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి హానికరం. ఎక్కువ మొత్తాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్, ఉప్పు, చక్కెరలూ ఉంటాయి. కాబట్టి ప్యాకెట్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. వీటిలో ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమయ్యే పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని మరింత సున్నితంగా మార్చేసి, పలు రకాల అలర్జీలకు గురయ్యేలా చేస్తాయి. గ్లూటెన్ లేని ప్యాకెట్ ఫుడ్స్ పీచు లేని పిండిని కలిగి ఉంటాయి. గ్లూటెన్ లేని పదార్థాలు తినాలనకుంటే పాలిష్ పట్టని గోధుమలు, బియ్యం, క్వినోవా తినాలి. ప్యాకెట్లలో దొరికే చిప్స్, కేక్స్ మానేయాలి. వీటితో పాటు ప్యాకెట్లు, ప్లాస్టిక్ డబ్బాలలో దొరికే శుద్ధి చేసిన నూనెలు (పొద్దుతిరుగుడు, వేరుసెనగ) కూడా మానేయాలి. ఇవన్నీ ఫ్రక్టోజ్, సుక్రోజ్, డెక్స్ట్రోజ్ చక్కెరల్లా, హార్మోన్ల పనితీరును దెబ్బతీసి స్థూలకాయులుగా మారుస్తాయి.

వాపులు, నొప్పులు

వ్యాధికి తొలి సూచనలు ఇవి. కీళ్ల నొప్పులు (ఆర్థ్రయిటిస్), హృద్రోగ సమస్యలు, ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్ (విరేచనాలు), మధుమేహం, కొన్ని రకాల కేన్సర్లకు ఇవే ప్రధాన లక్షణాలు. తింటున్న పదార్థాలు సరిపడకపోతే పేగుల్లో వాపు మొదలవుతుంది. ఈ సమస్యే ముందు హార్మోన్ల మీద కూడా ప్రభావం చూపిస్తుంది. ఇలాంటి ఇన్‌ఫ్లమేషన్‌కు కలిగించే పదార్థాల్లో ప్రధానమైనవి.... చక్కెర, ఎర్రని మాంసం, గ్లూటేన్. మాంసం, చక్కెరలు చర్మపు పిహెచ్ విలువలను మార్చేస్తాయి. అంతే కాదు, పెద్ద పేగుల్లోని బ్యాక్టీరియానూ మారుస్తాయి. ఇన్‌ఫ్లమేషన్ అదుపులో ఉండడం కోసం పొట్టు తీయని, పాలిష్ పట్టించని ధాన్యాలు, సేంద్రీయ కూరగాయలు, పళ్లు, పసుపు, బ్రకోలి, నిమ్మ ఎక్కువగా తినాలి.

లవణం నిషిద్ధం

ఆహారానికి రుచిని అందించడంతో పాటు నాడుల మధ్య ప్రసారాలు జరగడానికి, రక్తంలో చక్కెర స్థాయిలు సమంగా ఉండడానికీ, హార్మోన్ల స్రావాలు క్రమం అవడానికీ ఉప్పు అవసరమే! అయితే మితిమీరిన ఉప్పు అనర్థాన్ని తెచ్చి పెడుతుంది. నిజానికి వైద్యులు రోజుకు 6 గ్రాముల ఉప్పునే తీసుకోమని సూచిస్తున్నారు. ఇది ఒక చెంచా కంటే తక్కువ. రోజుకు 13 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకునేవారు 6.8 గ్రాముల ఉప్పు తీసుకునే వారి కంటే ఎక్కువగా గుండె సమస్యల బారిన పడే ప్రమాదం ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు.

తెలుసుకుందాం

వ్యాయామంతో అల్జీమర్స్‌కు అడ్డుకట్ట

వ్యాయామం... ఇన్‌ఫ్లమేషన్ తగ్గించి, మెదడు చురుకుదనాన్ని పెంచి అల్జీమర్స్ ముప్పును తగ్గించే కాలేయ ఎంజైమ్‌ను ప్రేరేపిస్తుందని శాస్త్రవేత్తలు తాజాగా కనిపెట్టారు.

అల్జీమర్స్ వ్యాధి క్రమేపీ జ్ఞాపకశక్తిని క్షీణింపచేస్తుంది. మెదడులో ఇన్‌ఫ్లమేషన్‌కూ, హానికారక పదార్థాలు రక్తంలో కలిసిపోయిుండా నియంత్రించే బ్లడ్ బ్రెయిన్ బ్యారియర్‌కూ అల్జీమర్స్‌తో సన్నిహిత సంబంధం ఉంటుంది. వయసు పైబడేకొద్దీ ఈ బ్యారియర్ బలహీనపడుతుంది. అయితే వ్యాయామంతో పైబడే వయసు ప్రభావం మెదడు మీద పడకుండా నియంత్రించుకోవచ్చనీ, తద్వారా అల్జీమర్స్ నుంచి రక్షణ పొందవచ్చనీ యూనివర్శిటీ ఆఫ్ క్యాలిఫోర్నియాలో చేపట్టిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. వ్యాయామం వల్ల జిపిఎల్‌డి 1 అనే ఎంజైమ్ కాలేయం నుంచి విడుదలవుతోందనీ, దాంతో పాటే జ్ఞాపకశక్తి కూడా మెరుగు పడుతోందనీ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఎంజైమ్ రక్తం ద్వారా మెదడుకు చేరుకోకుండానే ఫలితాన్ని కనబరుస్తూ ఉండడంతో, మరింత లోతుగా అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు, ఎంజైమ్ మెదడు బయటే ప్రమాదకరమైన టిన్యాప్ అనే ప్రొటీన్‌ను తొలగిస్తూ ఉండడంతో, జ్ఞాపకశక్తి మెరుగుదల సాధ్యపడుతున్నట్టు కనిపెట్టారు.



అధ్యయనం

ఎగ్జిమా పెరగదమ్మా...

ఎగ్జిమా చర్మ సమస్య కలిగిన వాళ్లు స్నానం చేస్తే, చర్మంలోని సహజసిద్ధ నూనెలు తొలగిపోయి, సమస్య మరింత తీవ్రమవుతుందని ఇంతకాలం నమ్ముతూ వచ్చాం. కానీ ఈ సమస్య ఉన్న వాళ్లు ఆ భయాలేమీ లేకుండా కావలసినన్ని సార్లు స్నానం చేయొచ్చని ఒక తాజా అధ్యయనం నిర్ధారించింది. రోజూ స్నానం చేసే ఎగ్జిమా రోగులు, వారానికి రెండు సార్లు మాత్రమే స్నానం చేసే ఎగ్జిమా రోగుల మధ్య ఎగ్జిమా తీవ్రతలను పరిశీలించినప్పుడు, రోజూ స్నానం చేసిన వారిలో చర్మం పొడిబారడం, దురదలు పెరగడం లాంటి లక్షణాలు కనిపించలేదు. ఇంగ్లండ్‌లో 438 ఎగ్జిమా రోగుల మీద చేపట్టిన ఈ ప్రయోగం ద్వారా ఎగ్జిమా ఉన్నప్పటికీ ఎటువంటి భయాలూ లేకుండా ప్రతిరోజూ స్నానం చేయొచ్చని పరిశోధకులు నిర్ధారించారు. ఈ చర్మ సమస్యతో బాధపడే లక్షల మంది బాధితులకు ఈ వార్త ఊరటను కలిగిస్తోంది. నిష్ఠతో కూడిన దైనందిన జీవితాన్ని గడపడానికి బదులుగా సౌకర్యవంతమైన జీవన శైలిని గడిపే వెసులుబాటును బాధితులకు కల్పిస్తోంది.



స్పోర్ట్స్



భారత్‌కు క్లిష్టంగా మారిన సెమీస్ అవకాశాలు

గెలుపే కాదు అంతకుమించి..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టీ20 వరల్డ్‌కప్‌లో దూసుకెళ్తున్న టీమిండియాకు ఒక్క ఓటమి కళ్లెం వేసింది. గ్రూప్ దశలో అజేయ ఆటతీరును ప్రదర్శించినా.. కీలక సూపర్-8 ఆరంభ పోరులో సఫారీల దెబ్బకు భారత్ సెమీస్ బెర్త్ క్లిష్టంగా మారింది. ఎందుకంటే.. ఈ మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఓటమి భారత్‌ను రన్‌రేట్ పరంగా దారుణంగా దెబ్బతీసింది. 188 పరుగుల ఛేదనలో మనోళ్లు చేసింది 111 పరుగులే కావడంతో ప్రస్తుతం గ్రూప్ 1లో భారత్ నెట్‌రన్‌రేట్ -3.800తో దయనీయంగా ఉంది. దీంతో జింబాబ్వే, వెస్టిండీస్‌తో మిగిలిన మ్యాచ్‌లను కచ్చితంగా గెలిచి తీరాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా కూడా సెమీస్ అవకాశాలు అంత సులువేమీ కాదు. మున్ముందు భారత జట్టు ఎలా ఆడాలనే విషయం పరిశీలిస్తే..

రెండు మ్యాచ్‌లూ గెలిస్తే..

సూపర్-8లో భారత్‌కు మిగిలిన రెండు మ్యాచ్‌లను గెలిస్తే నాలుగు పాయింట్లు లభిస్తాయి. సెమీస్‌కు వెళ్లేందుకు ఈ ఫలితాలు సరిపోతాయి. కానీ ఇందుకు దక్షిణాఫ్రికా కూడా సహాయపడాల్సి ఉంటుంది. ఆ జట్టు కచ్చితంగా తమ రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవాల్సి ఉంటుంది. అలాగైతేనే.. సఫారీలు ఆరు, భారత్ నాలుగు పాయింట్లతో సెమీస్‌కు వెళతాయి.

పాయింట్లు సమానంగా ఉంటే..

పరిస్థితులు సవ్యంగా సాగకుండా.. భారత్ రెండు మ్యాచ్‌లు గెలిచి, వెస్టిండీస్ జట్టు సౌతాఫ్రికాకు షాకిస్తే మాత్రం సీన్ మారుతుంది. అప్పుడు భారత్, సౌతాఫ్రికా, విండీస్ కూడా నాలుగేసి పాయింట్లతో ఉంటాయి. ఆ సమయంలో నెట్ రన్‌రేట్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. జింబాబ్వేపై విండీస్ 107 రన్స్ తేడాతో గెలవడంతో వారి రన్‌రేట్ +5.350తో ఆకాశాన ఉంది. అందుకే భారత్ రెండు మ్యాచ్‌లను అలాఇలా గెలిస్తే సరిపోదు.. భారీ తేడాతో ప్రత్యర్థులను మట్టికరిపించాల్సి ఉంది.

భారత్ ఒక్క మ్యాచే గెలిస్తే..

ఒకవేళ భారత జట్టు గురువారం జింబాబ్వే చేతిలో ఓడితే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. ఈ సందర్భంలో దక్షిణాఫ్రికా తమ రెండు మ్యాచ్‌లను కచ్చితంగా గెలవాలి. అలాగే టీమిండియా చివరి మ్యాచ్‌లో విండీస్‌ను భారీ తేడాతో ఓడించాల్సి ఉంటుంది. అలా జరిగితే భారత్, వెస్టిండీస్, జింబాబ్వే ఖాతాలో రెండేసి పాయింట్లు ఉంటాయి. ఈ సమయంలో కూడా మెరుగైన నెట్‌రన్‌రేట్‌ను కలిగిన జట్టే సెమీఫైనల్‌కు దూసుకెళుతుంది.

పాయింట్ల పట్టిక

గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
వెస్టిండీస్	1	1	0	0	2	5.350
దక్షిణాఫ్రికా	1	1	0	0	2	3.800
భారత్	1	0	1	0	0	-3.800
జింబాబ్వే	1	0	1	0	0	-5.350

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
ఇంగ్లండ్	1	1	0	0	2	2.550
న్యూజిలాండ్	1	0	0	1	1	0.000
పాకిస్థాన్	1	0	0	1	1	0.000
శ్రీలంక	1	0	1	0	0	-2.550

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; ర: రద్దు; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్



బ్రూక్

స్పిన్నర్లే ఆయుధంగా..

నేడు ఇంగ్లండ్‌తో పాక్ పోరు


రాత్రి 7 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



సల్మాన్

పల్లెకెలె: టీ20 వరల్డ్‌కప్ సూపర్-8 గ్రూప్ 2లో మంగళవారం ఇంగ్లండ్, పాకిస్థాన్ బరిలోకి దిగనున్నాయి. ఇప్పటికే ఇంగ్లండ్ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకను 51 పరుగుల తేడాతో చిత్తు చేసి రెండు పాయింట్లు దక్కించుకుంది. అయితే పాక్ జట్టు మాత్రం కివీస్‌తో మ్యాచ్ రద్దు కారణంగా ఒక పాయింట్ లభించింది. దీంతో ఈ మ్యాచ్ గెలవడం పాక్‌కు మరింత కీలకం కానుంది. మరోవైపు ఇరు జట్లూ స్పిన్నర్లపై అధికంగా ఆధారపడ్డాయి. ఇక్కడి పిచ్ కూడా స్పిన్‌ను అనుకూలించనుండడంతో మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. ఇంగ్లండ్ తమ స్పిన్నర్ల ప్రతిభ కారణంగానే శ్రీలంకపై 146 పరుగులను కాపాడుకుని, ప్రత్యర్థిని 95 పరుగులకే పరిమితం చేయగలిగింది. స్పిన్నర్లు విల్ జాక్స్, రషీద్, డాసన్‌లకే ఏడు వికెట్లు దక్కడం విశేషం. జాక్స్ అటు బ్యాటింగ్‌లోనూ చెలరేగుతున్నాడు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ ఫామ్‌లోకి రావడం లాభించనుంది. పాక్ సైతం నాణ్యమైన స్పిన్నర్లతో సవాల్ విసరేందుకు సిద్ధమైంది. మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్, సయీమ్ అయూబ్, ఎబ్రార్ అహ్మద్, షాదాబ్, నవాజ్‌లే కాకుండా కెప్టెన్ సల్మాన్ పార్ట్‌టైమ్ బౌలర్‌గా రాణించగలడు. కానీ బ్యాటింగ్‌లో నిలకడలేమి పాక్‌ను ఆందోళనపరిచే అంశం. ముఖ్యంగా స్పిన్‌ను ఎదుర్కోవడంలో బ్యాటర్లు తడబడుతున్నారు. టోర్నీ టాప్ స్కోరర్ సాహిబ్‌జాదా శుభారంభంపై జట్టు ఆధారపడి ఉంది.

ఎవరిపైనో వేటు?



తిలక్ వర్మా.. అభిషేక్ శర్మా?

ఓపెనర్‌గా సంజూకు చాన్స్! | టీమిండియా కూర్పుపై చర్చ



టీ20 వరల్డ్‌కప్ సూపర్-8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఘోర పరాజయం తర్వాత భారత జట్టు కూర్పుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జట్టులో మార్పులు చేయడానికి మేనేజ్‌మెంట్ సిద్ధమవుతున్నట్టుగా సంకేతాలు అందుతున్నాయి. ముఖ్యంగా ఫామ్ కోల్పోయి జట్టుకు భారంగా మారిన టాపార్డర్ బ్యాటర్లలో ఒకరిపై వేటువేసే ఆలోచనలో ఉన్నట్టు సహాయ కోచ్‌లు టెన్ డస్కాటే, సితాన్షు కోటక్ మాటలను బట్టి తెలుస్తోంది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌తో పాటు వన్‌డౌన్‌లో వస్తున్న తిలక్ వర్మ కూడా లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్లు కావడంతో.. ఈ కాంబినేషన్ అంతగా విజయవంతం కావడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో అభిషేక్ లేదా తిలక్‌లో ఒకరిపై వేటుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. లెఫ్ట్-రైట్ కాంబినేషన్ కోసం వరుసగా విఫలమవుతున్న అభిషేక్ స్థానంలో సంజూ శాంసన్‌కు తుది జట్టులో చోటు కల్పించవచ్చు. ఇక, తిలక్ ఫామ్ కూడా మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. అతడి ఆటలో ఆత్మవిశ్వాసం లోపించింది. ఒకవేళ కుడి చేతివాటం బ్యాటర్ సంజూతో ఓపెనింగ్ చేయిస్తే తిలక్‌ను తప్పించి.. అతడి స్థానంలో అభిషేక్‌ను చాన్సిస్తే ఎలా ఉంటుందనే వ్యూహంపై కూడా జోరుగా చర్చసాగుతోంది. కానీ, శాంసన్ వరుస వైఫల్యాల కారణంగానే కిషన్‌ను ఓపెనింగ్‌కు పంపాల్సి వచ్చిందనే విషయాన్ని గమనించాలి. మెగా టోర్నీలో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ ఓపెనర్లలో ఒకరు డకౌట్ కావడంతో.. ఆ ఒత్తిడి మిగతా బ్యాటర్లపై పడుతోందని డస్కాటే చెప్పాడు. సూర్యకుమార్, దూబెల ఆట నిరాశపర్చినా.. అభిషేక్, తిలక్ వైఫల్యాలను వెనకేసుకు రాలేమన్నాడు. ఫినిషర్‌గా రింకూకు తగిన అవకాశాలు లభించలేదనే అభిప్రాయం వ్యక్తం చేశాడు. జింబాబ్వేతో మ్యాచ్‌లో పూర్తిస్థాయిలో సత్తాచాటడమే జట్టుముందున్న ఏకైక లక్ష్యమని పేర్కొన్నాడు. అక్షర్‌కు బదులు సుందర్‌కు అవకాశం కల్పించడం వ్యూహాత్మకమేనని తెలిపాడు. కాగా, అక్షర్‌ను తప్పిస్తున్నట్టు కోచ్, కెప్టెన్ ముందుగానే సమాచారం ఇచ్చారని కోటక్ చెప్పాడు.

అహం వీడండి - గవాస్కర్



భారత ఆటగాళ్లు అహాన్ని పక్కనబెట్టి.. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడాలని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సూచించాడు. అతి విశ్వాసం కొంప ముంచిందన్నాడు. 'మరో ఆలోచన లేకుండా వచ్చిన వెంటనే బాదేయాలనుకొన్నారు. దక్షిణాఫ్రికా బౌలర్ల ఉచ్చులో చిక్కి వికెట్లు పారేసుకొన్నారు. అంతకు ముందు సఫారీలు ఏదశ నుంచి గట్టెక్కారో గమనించి ఉండాల్సింది. ఎంతో తెలివిగా వ్యవహరించే తిలక్ కూడా నిరాశపర్చాడు. అతడు క్రీజులో కుదురుకోవడానికి కొంత సమయం తీసుకోవాల్సిందని గవాస్కర్ అన్నాడు. సుందర్ స్థానంలో అక్షర్‌ను తుది జట్టులోకి తీసుకోవాలన్నాడు.

వన్డేలూ కొట్టేస్తారా?

- ఆత్మవిశ్వాసంతో భారత మహిళలు
- ఆసీస్‌తో తొలి మ్యాచ్ నేడు
- ఉ. 9.20 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పర్యటనలో విశేషంగా రాణిస్తోన్న భారత మహిళల క్రికెట్ జట్టు ఇక మూడు వన్డేల సిరీస్‌పై కన్నేసింది. మంగళవారం ఇక్కడి గాబా మైదానంలో వరల్డ్ చాంపియన్ హర్మన్‌ప్రీత్ సేన ఆసీస్‌తో తొలి వన్డే ఆడనుంది. ఇప్పటికే మూడు టీ20ల సిరీస్‌ను మనోళ్లు 2-1తో దక్కించుకున్న విషయం తెలిసిందే. అటు భారత వన్డే జట్టులో కష్వీ గౌతమ్, హర్లీన్, ప్రతీక చేరారు. స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్, జెమీమా బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. బౌలింగ్ విభాగంలో పేసర్ రేణుకా సింగ్, స్పిన్నర్ శ్రీచరణిలపై జట్టు ఆధారపడి ఉంది. అయితే వన్డే వరల్డ్‌కప్ సెమీస్‌లో తమను ఓడించిన భారత్‌పై అలీసా హీలీ సారథ్యంలోని ఆసీస్ జట్టు ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది.





విండీస్ వీరవిహారం

దంచేసిన హెట్‌మయెర్, పావెల్ | పడగొట్టిన గుడకేష్, అకిల్

- 107 పరుగులతో జింబాబ్వే చిత్తు
- టీ20 వరల్డ్‌కప్ సూపర్-8 పోరు



హెట్‌మయెర్ (34 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సలతో 85)

ముంబై: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కరీబియన్లు.. టీ20 వరల్డ్‌కప్ సూపర్-8లో ఘన విజయాన్ని నమోదు చేశారు. షిమ్రన్ హెట్‌మయెర్ (34 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సలతో 85) సుడిగాలి అర్ధ శతకంతో పాటు స్పిన్నర్ గుడకేష్ మోటీ (4/28) తిప్పేయడంతో.. సోమవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 107 పరుగుల తేడాతో జింబాబ్వేను మట్టికరిపించింది. తొలుత విండీస్ 20 ఓవర్లలో 254/6 స్కోరు చేసింది. ఈ టోర్నీలో ఇదే అత్యధికం. రోవ్‌మన్ పావెల్ (59), రూథర్‌ఫోర్డ్ (31 నాటౌట్) సత్తా చాటారు. ముజరబాని, ఎన్‌గరవ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో జింబాబ్వే 17.4 ఓవర్లలో 147 పరుగులకే కుప్పకూలింది. బ్రాడ్ ఇవాన్స్ (43), డియాన్ మేయర్స్ (28), సికందర్ రజా (27) ఫర్వాలేదనిపించారు. అకిల్ హొస్సేన్ 3 వికెట్లు తీశాడు. హెట్‌మయెర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

బాదుడే.. బాదుడు

హెట్‌మయెర్ ఊచకోత మ్యాచ్‌కే హైలైట్. పావెల్‌తో కలసి షిమ్రన్ మూడో వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో.. విండీస్ భారీస్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్.. ఓపెనర్లు కింగ్ (9), కెప్టెన్ షాయ్ హోప్ (14) వికెట్లను స్వల్ప స్కోర్లకే కోల్పోయింది. అయితే, వన్‌డౌన్‌లో వచ్చిన హెట్‌మయెర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ముజరబాని బౌలింగ్‌లో మునేకివా క్యాచ్‌ను చేజార్చడంతో బతికిపోయిన హెట్‌మయెర్.. జింబాబ్వే బౌలర్ల భరతం పట్టాడు. మరో ఎండ్‌లో పావెల్ చక్కని సహకారం అందించడంతో స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఎడాపెడా సిక్సలు బాదిన హెట్‌మయెర్ 19 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. దీంతో విండీస్ 10 ఓవర్లలో 115/2తో నిలిచింది. అనంతరం పావెల్ కూడా షిమ్రన్‌తో పోటీపడి షాట్లు ఆడాడు. కాగా, 15వ ఓవర్‌లో సింగిల్‌తో పావెల్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నా.. హెట్‌మయెర్‌ను క్రీమర్ అవుట్ చేసి జట్టుకు ఊరటనిచ్చాడు. పావెల్‌ను ముజరబాని వెనక్కి పంపాడు. ఆఖర్లో రూథర్‌ఫోర్డ్, షెఫర్డ్ (21), హోల్డర్ (13) భారీ షాట్లతో చెలరేగడంతో.. టీమ్ స్కోరు 250 మార్క్ దాటింది.



గుడకేష్ మోటీ (4/28)

టీ20 ప్రపంచకప్‌లో టాప్-5 స్కోర్లు

ఎవరు	ఎంత	ఎవరిపై	ఎప్పుడు
శ్రీలంక	260/6	కెన్యాపై	2007
వెస్టిండీస్	254/6	జింబాబ్వేపై	2026
ఐర్లాండ్	235/5	ఒమన్‌పై	2026
ఇంగ్లండ్	230/8	దక్షిణాఫ్రికాపై	2016
దక్షిణాఫ్రికా	229/4	ఇంగ్లండ్‌పై	2016

1 టీ20 వరల్డ్‌కప్‌లో ఈ మ్యాచ్‌లో అత్యధికంగా 31 సిక్సలు నమోదయ్యాయి. 2014లో నెదర్లాండ్స్-ఐర్లాండ్ మ్యాచ్‌లో 30 సిక్సల రికార్డు బద్దలైంది.

పొట్టికప్‌లో ఓ ఇన్నింగ్స్‌లో అత్యధికంగా 19 సిక్సలు బాదిన నెదర్లాండ్స్ (2014లో ఐర్లాండ్‌పై) రికార్డును సమం చేసిన విండీస్.

2 వెస్టిండీస్ సాధించిన 254 పరుగుల స్కోరు.. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో రెండో అత్యధికం. 2007 టోర్నీలో కెన్యాపై శ్రీలంక 260/6 చేసింది.

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్: 20 ఓవర్లలో 254/6 (హెట్‌మయెర్ 85, పావెల్ 59; ముజరబాని 2/42, ఎన్‌గరవ 2/47). జింబాబ్వే: 17.4 ఓవర్లలో 147 ఆలౌట్ (ఇవాన్స్ 43, మేయర్స్ 28; గుడకేష్ 4/28, అకిల్ 3/28, మాథ్యూ ఫోర్డ్ 2/27).

బరిలో శ్రీకాంత్, తన్వీ



నేటి నుంచి జర్మన్ ఓపెన్

మ్యూహెమ్ అండర్ హవా (జర్మనీ): జర్మన్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ మంగళవారం ఇక్కడ ప్రారంభం కానుంది. వెటరన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్స్ రజత పతక విజేత తన్వీశర్మ ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రపంచ మాజీ నెంబర్ వన్ శ్రీకాంత్ గత సీజన్‌లో నిలకడైన ప్రదర్శన చేశాడు. తద్వారా మలేసియా మాస్టర్స్ సూపర్ 500, సయ్యద్ మోదీ సూపర్ 300 టోర్నీలలో రన్నరప్‌గా నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో 16 ఏళ్ల తన్వీ మలేసియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌తో మ్యాచ్ ద్వారా టోర్నీని ఆరంభించనుంది. ఏడాదిగా నిలకడగా రాణిస్తున్న తన్వీ శర్మ గువాహటి, యూఎస్ ఓపెన్‌లలో రన్నరప్‌గా నిలిచి భళా అనిపించుకుంది. మాళవికా బన్సోద్ మొదటి రౌండ్‌లో లినె మార్క్ (డెన్మార్క్)ను ఢీకొంటుంది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్‌తోపాటు కిరణ్ జార్జ్, తరుణ్ మన్నేపల్లి, మహిళల డబుల్స్‌లో అశ్విని భట్/శిఖా గౌతమ్ పోటీపడుతున్నారు.

సంచలనం సృష్టిస్తారా..?

కర్ణాటకతో జమ్మూ కశ్మీర్ రంజీ ఫైనల్ నేటినుంచి

హుబ్బళ్లి: ప్రతిష్ఠాత్మక రంజీట్రోఫీ ఫైనల్లోకి తొలిసారి అడుగుపెట్టిన జమ్మూ కశ్మీర్ జట్టు మంగళవారం నుంచి జరిగే పోరులో కర్ణాటకతో తలపడుతోంది. కర్ణాటకకు ఎదురొడ్డి నిలిచి టైటిల్ అందుకోవాలంటే జమ్మూ కశ్మీర్ అద్భుతంగా ఆడాల్సిందే. ఎనిమిదిసార్లు చాంపియన్ కర్ణాటక ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కళ్, స్మరణ్‌లతో కర్ణాటక బ్యాటింగ్ దుర్భేద్యంగా ఉంది. పేసర్ అకీబ్ నబీ ఆధ్వర్యంలోని కశ్మీర్ బౌలింగ్ విభాగం వారిని ఎలా అడ్డుకుంటుందో చూడాలి. ఈ సీజన్‌లో 55 వికెట్లు తీసిన నబీనే జమ్మూ కశ్మీర్ ప్రధాన బౌలింగ్ ఆయుధం. ఇక..భారత జట్టు పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ, కావేరప్ప, విద్యాధర్, వైశాఖ్, మొహిసిన్ ఖాన్, శ్రేయాస్ గోపాల్‌తో కర్ణాటక బౌలింగ్ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. అలాంటి జట్టును పరాస్ డోగ్రా సారథ్యంలోని జమ్మూ కశ్మీర్ ఎలా నిలువరిస్తుందనేది ఆసక్తికరం.

నేటినుంచే జాతీయ కబడ్డీ పోటీలు

వడోదరా: వడోదరాలో మంగళవారం నుంచి 27 వరకు జాతీయ పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ జరుగనుంది. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 31 జట్లు పాల్గొంటున్నాయి. జాతీయ కబడ్డీ సంఘం (ఏకేఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో 400 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ప్రొ కబడ్డీ లీగ్ స్టార్లు ఆశు మాలిక్, అవాన్, దేవాంక్, భరత్ హూడా, అర్జున్ దేశ్వాల్ తదితరులు బరిలోకి దిగుతున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఆ సమయంలో రాజ్ అండగా నిలిచారు



సమంత

రాజ్ నిడిమోరు కీలక సమయంలో అండగా నిలిచారని, ఆయన రాక తన జీవితాన్ని మార్చేసిందని అన్నారు సమంత. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. 'వివాహబంధం ముగిసిన తర్వాత చాలా డీలాపడిపోయా. ఎవరిమీదా ఆధారపడకూడదని నిర్ణయించుకున్నా. వ్యాయామం.. ధ్యానం చేయడం, నాతో నేను ఎక్కువ సమయం గడపడం.. ఇదే నా దినచర్యగా ఉండేది. ప్రేమ, స్నేహం మీద నమ్మకం కోల్పోయా. ఆ సమయంలో రాజ్ పరిచయం ఏర్పడింది. ఆయనతో పెళ్లి జరిగాక జీవితం పూర్తిగా మారిపోయింది. ప్రతీ పని కలిసి చేయాలనుకుంటాం. నిజంగా మేము చికాకు కలిగించే జోడీ' అని సమంత చెప్పారు. గతేడాది దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహబంధంలోకి అడుగుపెట్టారు సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం మే 15న విడుదలవుతోంది. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై దీనిని నిర్మించారు సమంత.



మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) నూతన డైరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు, ఉపాధ్యక్షుడు మాదాల రవి, కోశాధికారి శివ బాలాజీ, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. 'మా' సభ్యుల సంక్షేమం కోసం కార్యవర్గం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా ప్రశంసించారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

అనురాగ్‌కు ప్రతిదీ సమస్యే



'ది కేరళ స్టోరీ 2' చిత్రం విడుదల తేదీ దగ్గర పడుతున్నా వివాదాలు మాత్రం సద్దుమణగడం లేదు. దర్శకుడు అనురాగ్ కశ్యప్ సైతం ఈ సినిమా మీద విమర్శల వర్షం కురిపించారు. 'ఇదొక చెత్త సినిమా. అర్థం పర్థం లేని కథలతో సినిమాలు తీస్తూ డబ్బు చేసుకోవాలని చేసే ప్రయత్నం. మనుషుల్ని విడగొట్టాలని చూసే ఆలోచన' అంటూ అనురాగ్ చేసిన విమర్శలకు 'ది కేరళ స్టోరీ 2' చిత్ర దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ గట్టిగా స్పందించారు. అనురాగ్‌కు ప్రతిదీ సమస్యేనని అన్నారు. 'అనురాగ్ జీ.. మీ సినిమాలు ఈ మధ్య సరిగ్గా ఆడకపోవడం వల్లనో ఏమో మనసు స్థిమితం తప్పి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. అనురాగ్‌కు ఓ విజయాన్ని అందించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని వ్యంగ్యంగా అన్నారు కామాఖ్య నారాయణ్ సింగ్.

ఆద్యంతం అలరించే 'విష్ణు విన్యాసం'



"విష్ణు విన్యాసం' సినిమా హీరో పాత్రపై నడిచే కథ. దానితోపాటు మరో ఆసక్తికరమైన ట్రాక్ కూడా ఉంటుంది. హీరోకు జాతకాలపై నమ్మకం ఎక్కువ. ఈ పాత్ర ఆద్యంతం అలరించేలా ఉంటుంది' అని అన్నారు నిర్మాతలు సుబ్రహ్మణ్యం నాయుడు, సుమంత్ నాయుడు. శ్రీ విష్ణు, నయన సారిక జంటగా యదునాథ్ మారుతీ రావు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై వారు నిర్మించిన చిత్రమిది. ఈనెల 27న సినిమా విడుదలవుతున్న సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. 'కామెడీ కథలు ఎప్పుడు కూడా విన్నప్పుడు కంటే స్ర్కీన్ మీదకి వచ్చిన తర్వాతనే కథలో ఉన్న వినోదం ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. సినిమా అవుట్‌పుట్ బాగా వచ్చింది. మేము అనుకున్నది స్ర్కీన్ మీద అద్భుతంగా చూపించగలుగుతున్నాము. విష్ణుగారి క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. సారిక తన పాత్రలో చక్కగా నటించారు. ఒక మంచి సినిమా వస్తే ప్రేక్షకులు కచ్చితంగా థియేటర్లకు వస్తారని నమ్ముతాము. 'విష్ణు విన్యాసం' చూసిన ప్రేక్షకులు థియేటర్ల నుంచి చిరునవ్వుతో బయటకు వస్తారు' అని వారు పేర్కొన్నారు.



వాస్తవ ఘటనల 'కాక్రోచ్'

అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ ప్రధాన పాత్రల్లో పి. సునీల్ కుమార్‌రెడ్డి రూపొందించిన తాజా చిత్రం 'కాక్రోచ్'. శ్రీ లక్ష్మీ పిక్చర్స్ బ్యానర్‌పై బి.బాపిరాజు, ముతుకి నాగసత్యనారాయణ నిర్మించారు. సినిమా మార్చి 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత బి.బాపిరాజు మాట్లాడుతూ 'సమాజంలో జరుగుతున్న ఘటనలకు వాస్తవిక రూపంగా ఈ సినిమాను నిర్మించాం' అని తెలిపారు. డైరెక్టర్ పి.సునీల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 'నేను జర్నలిస్ట్‌గా కెరీర్ స్టార్ట్ చేశాను. పాత్రికేయుడిగా నేను సమాజంలో చూసిన వాటిని ప్రేక్షకులకు కూడా తెలియజేయాలనే ఉద్దేశంతో దర్శకుడిగా మారాను' అని చెప్పారు.



ప్రతీ ప్రేక్షకుడిని 'కిల్లర్' ఆకట్టుకుంటుంది

'ఐదారేళ్ల కిందట అనుకున్న స్క్రిప్ట్ ఇది. మేము గ్లింప్స్ ద్వారా చూపించింది చాలా తక్కువ. ఇప్పుడు టీజర్‌లో చూపించిన కంటెంట్ 40 శాతం మాత్రమే. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ డ్రామా, బ్రదర్ సిస్టర్ బాండింగ్, రివెంజ్, సబ్‌కాన్షియస్ ఐడెంటిటీ.. ఇలాంటి ఎలిమెంట్స్‌తో సైఫై థ్రిల్లర్‌గా 'కిల్లర్'ని తెరకెక్కిస్తున్నాం అని దర్శకుడు సుకు పూర్వాజ్ చెప్పారు. పూర్వాజ్ స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'కిల్లర్'. జ్యోతి పూర్వాజ్ కథానాయిక. పూర్వాజ్, ఏ. పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ జ్యోతి పూర్వాజ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఆరేడు పాత్రల్ని పోషించే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉన్నా' అని అన్నారు.

ఏఐ.. నాగరికతలో పెద్ద మార్పు!

(మొదటిపేజీ తరువాయి)

మార్పు ఉంటుంది. మనం పనిచేసే విధానాన్ని, జీవించే విధానాన్ని ఏఐ పూర్తిగా మార్చుతోంది. వ్యక్తులను, సంస్థలను మరింత తెలివిగా, సమర్థంగా మారుస్తోంది. ఉత్పాదకత పెరిగేలా చేస్తోంది. అయితే.. గణితం, కంప్యూటర్ సైన్స్‌లో బలమైన పునాది ఉన్న భారత్‌కు ఏఐలో ప్రపంచ నాయకత్వ సామర్థ్యం ఉంది. ఇది అద్భుత అవకాశం. ఇంతకు ముందటి సాంకేతిక విప్లవాలు పనిని వ్యాపార కార్యకలాపాల నుంచి డిజిటల్ స్థాయికి మార్చాయి. ఏఐ అందుకు భిన్నం. దానివల్ల.. సాధారణ పనులకు పరిమితమైన ప్రవేశ స్థాయి ఉద్యోగాలు తగ్గిపోతాయి. కొత్తగా పట్టాలు పొందినవారు నేరుగా మధ్య స్థాయి ఉద్యోగాలకు వెళతారు. ఉన్నత స్థాయి నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతుంది. ఏఐ సొల్యూషన్ ఆర్కిటెక్ట్స్, సిస్టం లెవల్ థింకర్స్, ఏఐ గవర్నెన్స్, అల్గారిథమ్స్, స్టాటిస్టికల్ మోడలింగ్, ఫుల్ స్టాక్ ఏఐ డెవలపర్స్ లాంటి ఉద్యోగాలకు డిమాండ్ ఎక్కువగా ఉండబోతోంది. మేధో సంపత్తి (ఐపీ), ఉత్పత్తులు, కొత్త ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కొత్త ఆదాయ మార్గాలు సమకూరుతాయి.

వచ్చే 5-10 ఏళ్లలో కొత్తగా ఎలాంటి ఉద్యోగాలకు డిమాండ్ ఉంటుంది?

సాధారణ ఉద్యోగాలపై ఏఐ ప్రభావం చూపినా.. కొత్త అవకాశాలను కూడా సృష్టిస్తుంది. ఏఐ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి నైపుణ్యం కలిగినవారు అవసరమవుతారు. ఐటీలోనే కాకుండా వ్యవసాయం, ఆరోగ్యం, తయారీ, బ్యాంకింగ్ వంటి రంగాల్లోనూ ఏఐ విస్తృత మార్పులు తీసుకురాగలదు. ఆరోగ్య రంగంలో ఏఐ కీలక పాత్ర పోషించనుంది. వచ్చే 5-10 ఏళ్లలో శాప్, ఒరాకిల్, సర్వీస్ నౌ, ఎస్‌ఎఫ్‌డీసీ వంటి సేవల్లోనూ ఏఐ నిపుణుల అవసరం ఏర్పడుతుంది. ఇంజనీరింగ్, వీఎల్ఎస్ఐ, 5జీ/6జీ, నెట్‌వర్క్ డిజైన్, చిప్ డిజైన్, పీఎల్ఎం వంటి విభాగాలకు డిమాండ్ మరింత పెరుగుతుంది.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఉద్యోగాల కోసం ప్రభుత్వం, పరిశ్రమలు ఎలా సిద్ధమవాలి?


ప్రభుత్వం, పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు కలిసి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను సిద్ధం చేయాలి. నైపుణ్యాలను పెంచేలా ప్రణాళికలు ఉండాలి. ఈ దిశగా టీసీఎస్ ఇప్పటికే విశ్వవిద్యాలయాలతో శిక్షణ కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ఏఐ టూల్స్ రాకతో దేశ ఐటీ రంగంపై ఎలాంటి మార్పు ఉండబోతోంది?

ఐటీ, ఆరోగ్య సంరక్షణ, తయారీ రంగం, బ్యాంకింగ్.. ఇలా ప్రతీ విభాగంలో సాంకేతికతకు నిరంతర డిమాండ్ ఉంటుంది. మరింత అభివృద్ధి సాధించడానికి పరిశ్రమలు ఏఐని అద్భుత అవకాశంగా భావిస్తున్నాయి. ఇలాంటి సమయంలో కొత్త సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకోవడం ఉద్యోగార్థులకు కీలకంగా మారింది. కంపెనీలు కూడా ఉద్యోగుల నైపుణ్యాల పెంపు కోసం ప్రయత్నిస్తున్నాయి. ఉద్యోగులకు శిక్షణపై టీసీఎస్ దృష్టి పెట్టింది. మేము ప్రతి శుక్రవారాన్నీ 'ఏఐ డే'గా నిర్వహిస్తున్నాం.

డాలర్‌తో డ్రాగన్ ఢీ

(మొదటి పేజీ తరువాయి)



చాటుతున్న డాలర్‌ను ఇటీవలికాలంలో ఆసియా దేశాలు సవాల్ చేస్తున్నాయి! చైనా, భారత్ సహా పలు దేశాలు డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించే దిశగా (డీ-డాలరైజేషన్) అడుగులు వేస్తున్నాయి. చైనా తన డిజిటల్ యువాన్ల (ఈ-సీఎన్‌వై) ద్వారా దేశీయంగా.. థాయ్‌లాండ్, యూఏఈ, సౌదీలతో కలిసి 'ఎంబ్రిడ్జ్' అనే ప్లాట్‌ఫామ్ ద్వారా డాలర్ ఆధిపత్యానికి చెక్ పెట్టే ప్రయత్నం చేస్తోంది. బ్రిక్స్ దేశాలు కూడా ఆ దిశగా ఇప్పటికే ఆలోచిస్తున్నాయి. ముందుగా చైనా విషయానికి వస్తే.. అది ఇన్నాళ్లుగా రెండు దేశాల మధ్య (లేదా) రెండు దేశాల వ్యాపారుల మధ్య జరిగే లావాదేవీలకు వాడుతున్న 'స్విఫ్ట్' చెల్లింపుల వ్యవస్థనే లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతోంది. ఈ స్విఫ్ట్ వ్యవస్థపై పూర్తిగా అమెరికా, డాలర్ ఆధిపత్యం ఉంది. ఈ వ్యవస్థ ద్వారా ఒక దేశం నుంచి మరొక దేశానికి డబ్బు పంపాలంటే మధ్యలో డాలర్లలోకి మార్చాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక భారతీయ వ్యాపారి థాయ్‌లాండ్ వ్యాపారి నుంచి లక్ష బాట్ల విలువైన వస్తువులు కొన్నాడు. నేరుగా భారత కరెన్సీని థాయ్ కరెన్సీలోకి మార్చి ఆ వ్యాపారికి చెల్లించవచ్చు. కానీ, బ్యాంకులు అందుకు భారీగా ఎక్స్ఛేంజి ఫీజు వసూలు చేస్తాయి. ఎందుకంటే.. తక్కువ డిమాండ్ ఉండే బాట్‌ల లభ్యత మార్కెట్లో తక్కువగా ఉంటుంది. కాబట్టి వాటి సేకరణకు బ్యాంకులు ఎక్కువ ఫీజు వసూలు చేస్తాయి. అదే డాలర్లయితే ఎక్కువగా అందుబాటులో ఉంటాయి. దీనివల్ల డాలర్ మార్పిడి ఫీజు 1 నుంచి 2 శాతం ఉంటే.. బాట్ మార్పిడి ఫీజు 5 నుంచి 7 శాతం దాకా ఉంటుంది. అందుకే రూపాయల్ని తొలుత డాలర్లలోకి మార్చి ఆ తర్వాత బాట్లలోకి మారిస్తే భారతీయ వ్యాపారికి ఖర్చు తగ్గుతుంది. ఇలా డాలర్లలోకి మార్చడానికి స్విఫ్ట్ వ్యవస్థ ఉపయోగపడుతుంది. అయితే.. ఇది కరెన్సీ మార్పిడి వ్యవస్థ కాదు. కేవలం ఒక మెసేజింగ్ వ్యవస్థ. పైన చెప్పిన ఉదాహరణలో భారత వ్యాపారి లక్ష బాట్ల విలువైన వస్తువులు కొని చెల్లింపులు చేయాలనుకున్నప్పుడు తన బ్యాంకుకు వెళ్లి లక్ష బాట్లకు సరిపడా డాలర్లు కొంటాడు. దీనికి అతడు రూపాయల్లోనే చెల్లింపు చేస్తాడు. అప్పుడా బ్యాంకు అమెరికాలోని తన ప్రతినిధి బ్యాంకుకు (జేపీ మోర్గాన్, సిటీ బ్యాంకు వంటివాటికి).. "మా ఖాతా నుంచి లక్ష బాట్లకు సరిపడా డాలర్లను థాయ్‌లాండ్‌లోని పలానా బ్యాంకుకు పంపించండి" అని సందేశాన్ని పంపిస్తుంది. ఈ సందేశం పంపడానికి వాడేదే స్విఫ్ట్ నెట్‌వర్క్. ఆ సందేశం అందుకున్న అమెరికన్ బ్యాంకు.. థాయ్‌లాండ్‌లోని బ్యాంకుకు నిర్ణీత డాలర్లను పంపుతుంది. థాయ్ బ్యాంకు.. ఆ డాలర్లను తీసుకుని, లక్ష బాట్లుగా మార్చి ఆ వ్యాపారి ఖాతాలో వేస్తుంది. అయితే, ఈ పద్ధతిలో రెండు నష్టాలున్నాయి. ఒకటి.. డాలర్ కన్వర్షన్ ఫీజు రెండుసార్లు చెల్లించాల్సి వస్తుంది (మన కరెన్సీతో డాలర్లను కొన్నప్పుడు, ఆ డాలర్లను మళ్లీ థాయ్ కరెన్సీలోకి మార్చినప్పుడు). రెండోది.. ఈ మొత్తం ప్రక్రియ జరగడానికి 2-3 రోజులు పడుతుంది. అందుకే.. డాలర్ ఆధిపత్యానికి చెక్ పెడుతూనే, వేగంగా డబ్బు పంపేలా చైనా, హాంగ్‌కాంగ్, థాయ్‌లాండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కలిసి.. డాలర్ అవసరం లేని, బ్లాక్‌చైన్ సాంకేతికతతో పనిచేసే 'ఎంబ్రిడ్జ్' అనే చెల్లింపుల వ్యవస్థను ప్రారంభించాయి. తర్వాత సౌదీ అరేబియా కూడా ఇందులో చేరింది. ఇందులో మార్పిడి ఎలా జరుగుతుందంటే.. ఎంబ్రిడ్జ్‌లో భాగంగా ఉన్న దేశాలన్నీ తమ తమ డిజిటల్ కరెన్సీలను ఆ ప్లాట్‌ఫామ్‌పై ఉంచుతాయి. చైనాలోని ఒక కంపెనీ యూఏఈలోని ఒక కంపెనీకి చెల్లింపులు చేయాల్సి వచ్చినప్పుడు.. తన డిజిటల్ యువాన్లను ఆ ప్లాట్‌ఫామ్‌లోకి విడుదల చేస్తుంది. ఎంబ్రిడ్జ్‌లోని 'స్మార్ట్ కాంట్రాక్ట్' అనే ప్రోగ్రామ్ (ఇదొక డిజిటల్ మధ్యవర్తిలాంటిది. ఇది అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లతో అనుసంధానమై ఉంటుంది).. ఆ డిజిటల్ యువాన్లను ఆ రోజు రేటు ప్రకారం డిజిటల్ దిర్హామ్‌లలోకి మార్చి యూఏఈ కంపెనీ ఖాతాలో వేసేస్తుంది. దీనికి పట్టే సమయం.. కేవలం కొన్ని సెకన్లు మాత్రమే. దీంట్లో ఎక్కడా డాలర్ ప్రస్తావన ఉండదు. చైనా ఈ-యువాన్ల తరహాలోనే.. ఇటీవలికాలంలో భారత ప్రభుత్వం కూడా డిజిటల్ రూపీ(ఈ-రూపీ)ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇండియా కూడా ఎంబ్రిడ్జ్‌లో చేరి మన ఈ-రూపీని ఆ ప్లాట్‌ఫామ్‌పై ఉంచొచ్చు. కానీ.. ఎంబ్రిడ్జ్‌లో మిగతా దేశాలన్నీ చిన్నవి కావడంతో చైనా ఆధిపత్యం ఎక్కువగా ఉంది. కాబట్టి.. అదే తరహాలో బ్రిక్స్ దేశాల డిజిటల్ కరెన్సీలను అనుసంధానం చేస్తే బాగుంటుందని ఆర్బీఐ కేంద్రానికి సూచించింది. ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలియడంవల్లనే.. ట్రంప్ ఇటీవల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఏ దేశమైనా అమెరికా డాలర్‌ను కాదని కొత్త చెల్లింపు వ్యవస్థను ప్రవేశపెట్టాలని చూస్తే ఆ దేశం నుంచి వచ్చే వస్తువులపై 100% సుంకాలు విధిస్తాం" అని బ్రిక్స్ దేశాలను దృష్టిలో పెట్టుకునే హెచ్చరించారు.



ఇప్పటికే కొన్ని ప్రయత్నాలు..

పెద్ద ఎత్తున కాదుగానీ.. డాలర్‌తో సంబంధం లేకుండా ఇతర దేశాలతో లావాదేవీలు జరపడానికి భారత్ ఇప్పటికే చెప్పుకోదగ్గ ప్రయత్నాలు చేస్తోంది. ఉదాహరణకు.. విదేశీ బ్యాంకులు మన దేశంలోని ప్రత్యేక బ్యాంకుల్లో ఖాతాలు (వీటిని వోస్ట్రో ఖాతాలు అంటారు) తెరిచి రూపాయిల్లో లావాదేవీలు జరపడానికి ఆర్బీఐ ఇప్పటికే అనుమతిచ్చింది. రష్యా, యూఏఈ, శ్రీలంక, నైజీరియా, టాంజానియా, మారిషస్ వంటి దేశాలతో భారత్ ఈ పద్ధతిలోనే రూపీ ట్రేడింగ్ దిశగా కీలక ముందడుగు వేసింది. అలాగే.. వివిధ దేశాల స్థానిక చెల్లింపుల వ్యవస్థలతో మన యూపీఐని అనుసంధానం చేసేందుకు భారత్ కృషి చేస్తోంది. ఇప్పటికే ఈ మేరకు పలు దేశాలతో ఒప్పందాలు చేసుకుంది. సింగపూర్‌లోని 'పేనౌ' వ్యవస్థతో మన యూపీఐ పూర్తిగా అనుసంధానమైంది. అంటే ఇప్పుడు సింగపూర్ వెళ్లే భారతీయులు ఎంచక్కా యూపీఐ ద్వారా అక్కడి దుకాణాల్లో చెల్లింపులు చేయొచ్చు. దీనికి మన ఫోన్‌పే, గూగుల్‌పే వంటి యాప్స్ ఖాతాల్లో 'యూపీఐ ఇంటర్నేషనల్' ఆప్షన్‌ను ఎనేబుల్ చేసుకుంటే సరిపోతుంది. మన ఖాతాలోంచి రూపాయల్లో డబ్బులు కట్ అయ్యి.. వారి ఖాతాలో సింగపూర్ డాలర్లలో జమవుతాయి. ఇలాగే.. యూఏఈలో 'నియోపే' టెర్మినల్స్ ఉన్న చోట మన యూపీఐ పనిచేస్తుంది. నేపాల్, భూటాన్‌లో భారతీయులు యూపీఐ యాప్స్‌తో చెల్లింపులు చేయొచ్చు. 2024 ఫిబ్రవరి నుంచి మారిషస్, శ్రీలంకలో కూడా యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. యూరప్‌లో తొలిసారి.. పారిస్‌లోని ఈఫిల్ టవర్ వద్ద యూపీఐ చెల్లింపులను అనుమతించారు. యూకే, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, సౌదీఅరేబియా వంటి దేశాలతో.. యూపీఐ అనుసంధానానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రిటైల్ చెల్లింపుల్లో ప్రస్తుతం అమెరికాకు చెందిన వీసా, మాస్టర్‌కార్డ్‌లదే ఆధిపత్యం. కానీ, యూపీఐ ఎన్ని దేశాలకు విస్తరిస్తే.. అన్ని దేశాల్లో మన చెల్లింపులు అంతగా పెరుగుతాయి. అన్ని దేశాలూ ఇదే విధానాన్ని పాటించడం మొదలుపెడితే క్రమంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో డాలర్ హవా తగ్గుతుంది.

ఆసియాలోనే అత్యంత పేలవ ప్రదర్శన చేసిన కరెన్సీ.. రూపాయి!


మన ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నా, ఆర్థిక వృద్ధి బాగున్నా.. రూపాయి మాత్రం బలహీనంగానే ఉంటోంది. 2025లో ఆసియాలోని అన్ని దేశాల కన్నా అత్యంత బలహీనమైన కరెన్సీగా రూపాయే నిలవడం ఇందుకు నిదర్శనం. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల కరెన్సీతో పోలిస్తే రూపాయి ఇప్పటికీ బలంగానే ఉందిగానీ.. ఆసియాలోని ఇతర దేశాలన్నింటి కరెన్సీల కన్నా డాలర్‌తో పోలిస్తే ఎక్కువగా పతనమైంది (దాదాపు 5 శాతం దాకా) రూపాయే. అందుకే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వేలో ఈ విషయాన్ని పేర్కొని.. రూపాయి పేలవ ప్రదర్శనకు కారణాలేంటో కూడా చెప్పారు. ఈ సమస్యకు అంతర్గత లోపాల కంటే.. బయటి కారణాలే ఎక్కువని తెలిపారు. భౌగోళిక రాజకీయాలు, విదేశీ పెట్టుబడులు తగ్గడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో నెలకొన్న అనిశ్చితి వంటివాటివల్లే రూపాయి బలహీన పడిందని వెల్లడించారు.

అసలు డాలర్‌కు ఇంత విలువ ఎలా వచ్చింది? డాలర్ అంతర్జాతీయ కరెన్సీగా ఎలా, ఎప్పుడు మారింది? ..ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే దాదాపు 80 ఏళ్లు వెనక్కి వెళ్లాలి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య ప్రభ రెండో ప్రపంచ యుద్ధం దెబ్బకు కొడిగట్టినప్పుడు.. అందివచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్న అగ్రరాజ్యం ప్రపంచానికి పెద్దన్నగా అవతరించినప్పుడు.. ఈ కథ మొదలైంది! మొదటి ప్రపంచ యుద్ధ సమయంలోనూ, ఆ తర్వాతా.. పలు ఐరోపా దేశాలు తమ వద్ద ఉన్న బంగారాన్ని అమెరికాకు అమ్మి ఆహారాన్ని, ఆయుధాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేశాయి! దీంతో రెండో ప్రపంచ యుద్ధం ముగింపునకు వచ్చే సమయానికి ప్రపంచంలో అన్ని దేశాల కన్నా ఎక్కువగా బంగారం అగ్రరాజ్యం వద్ద పోగుపడింది. దీంతో, 1944లో బ్రెటన్‌వుడ్స్ కవలలుగా పేరొందిన ప్రపంచబ్యాంకును, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థను (ఐఎంఎఫ్) ఏర్పాటు చేసి.. 'మా దగ్గర ప్రపంచంలోనే అందరికన్నా ఎక్కువ బంగారం ఉంది కాబట్టి, మీకు ఈ రెండు సంస్థల ద్వారా అప్పులు కావాలంటే డాలర్‌ను రిజర్వ్ కరెన్సీగా వాడుకోండి' అనే ప్రతిపాదన చేసింది. అలా అమెరికా తన డాలర్ విలువను బంగారంతో ముడిపెడితే (అప్పట్లో ఔన్స్ (31.1 గ్రాములు) బంగారం వెల 35 డాలర్లుగా ఉండేది. ఇప్పుడు దాదాపు 5000 డాలర్లు ఉంది).. మిగతా దేశాలన్నీ తమ కరెన్సీ విలువను డాలర్‌తో ముడిపెట్టాయి. డాలర్ రిజర్వ్ కరెన్సీ కావడంతో

డాలర్ హవా.. అలా మొదలైంది!

ప్రపంచదేశాలన్నీ తమకు కావాల్సిన డాలర్ల కోసం అమెరికాకు విస్తృతంగా ఎగుమతులను పెంచాయి. డాలర్‌కు విలువ పెరిగిపోవడంతో.. అమెరికా తన వద్ద ఉన్న బంగారం విలువను మించి డాలర్ నోట్లను ముద్రించడం ప్రారంభించింది. రెండున్నర దశాబ్దాలు తిరిగే సరికి.. అమెరికా వద్ద ఉన్న బంగారానికి, అది ముద్రించిన డాలర్ల విలువకు అసలు సంబంధమే లేకుండా పోయింది. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడి ప్రపంచ దేశాలన్నీ ఒకేసారి వచ్చి, తమ వద్ద ఉన్న డాలర్లను అమెరికాకు ఇచ్చి.. ఆ విలువకు సమానమైన బంగారాన్ని ఇవ్వాలని అడిగితే అమెరికా దివాలా తీసే పరిస్థితి ఏర్పడింది. దీంతో, బంగారానికి, డాలర్‌కు మధ్య ఉన్న లింక్‌ను అమెరికా తెంచేసింది. దీంతో, డాలర్‌కు డిమాండ్ తగ్గింది. ఈ సమయంలోనే అమెరికా వ్యూహాత్మకంగా ప్రపంచంలోనే అతి పెద్ద చమురు ఉత్పత్తి దేశమైన సౌదీ అరేబియాతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దాని ప్రకారం సౌదీ తన చమురు మొత్తాన్నీ డాలర్లలోనే అమ్మాలి(దీన్నే 'పెట్రో డాలర్ వ్యవస్థ' అంటారు). దానికి బదులుగా ఆ దేశ రక్షణ బాధ్యతలు తీసుకుంటామని అమెరికా మాటిచ్చింది. అమెరికా ఎందుకు ఈ నిర్ణయం తీసుకుందంటే.. ఈ విధానంలో చమురు కొనుగోళ్లకు అన్ని దేశాలకు డాలర్లు కావాలి కాబట్టి.. డాలర్ డిమాండ్ మళ్లీ పెరిగిపోయింది. అప్పట్నుంచీ ప్రపంచ వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది.

బిజినెస్



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను ఏఐ భర్తీ చేయలేదు

▸▸ మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)తో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఐటీ నిపుణుల ఉద్యోగాలు పోతాయన్న భయాలను మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్ తోసిపుచ్చారు. నిజానికి ఏఐ వీరి నైపుణ్యాలు, సృజనాత్మకతను మరింత పెంచుతుందన్నారు. ప్రజలను మరింత తెలివైన వారుగా మార్చే టెక్నాలజీలను అభివృద్ధి చేయడమే తమ కంపెనీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏఐ వల్ల పునరావృతమయ్యే కోడింగ్ పనులు మాత్రమే పోతాయన్నారు. దాంతో సాఫ్ట్‌వేర్ డెవలపర్లు ప్రొడక్ట్ డిజైన్, ఆర్కిటెక్చర్, టెస్టింగ్, సెక్యూరిటీలపై మరింతగా దృష్టి పెట్టవచ్చన్నారు. దీంతో కొత్త ఉద్యోగావకాశాలు ఏర్పడి జీతాలూ పెరిగే అవకాశం ఉందన్నారు. ఏఐ లక్ష్యాలు ఏమిటో కంపెనీలు స్పష్టంగా నిర్వచించుకోవాలని స్మిత్ సూచించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	465	విజయవాడ	500
వరంగల్	467	గోదావరి	475
చిత్తూరు	533	విశాఖపట్నం	480
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	119
కర్నూలు	120	నెల్లూరు	124
విశాఖపట్నం	120	అనంతపురం	124
గోదావరి	120		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,61,350 ▲	1,47,900 ▲	3,00,000 ▲
విజయవాడ	1,63,000 ▲	1,51,000 ▲	2,71,000 ▲
విశాఖపట్నం	1,63,195 ▲	1,47,900 ▲	3,00,000 ▲
రాజమండ్రి	1,61,350 ▲	1,47,900 ▲	2,76,000 ▲
ప్రొద్దుటూరు	1,57,500 ▲	1,44,900 ▲	2,70,000 ▲
ముంబై	1,58,220 ▲	1,44,930 ▲	2,64,075 ▲

బ్యాంకర్లూ హద్దులు దాటొద్దు



కీలక వ్యాపారాలే మీకు ముఖ్యం ● బీమా పాలసీలతో వేధించవద్దు

ముంబై: అవసరం ఉన్నా లేకపోయినా బ్యాంకులు ఖాతాదారులకు బీమా పాలసీలు, ఇతర ఆర్థిక పెట్టుబడుల ఉత్పత్తులను అంటగట్టడంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులకు స్వస్తి చెప్పి తమ కీలక వ్యాపారమైన డిపాజిట్ల సేకరణ, రుణ వితరణపై దృష్టి పెట్టాలని కోరారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కేంద్ర బోర్డు సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గృహ రుణం, వాహన రుణం ఇలా ఏ రుణం తీసుకున్నా బ్యాంకులు బలవంతంగా తమ చేత ఏదో ఒక బీమా పాలసీ కొనిపిస్తున్నాయని ఇటీవల బ్యాంకు ఖాతాదారుల నుంచి ఫిర్యాదులు పెరిగి పోయాయి. ఈ అక్రమాలకు చెక్ పెడుతూ ఆర్‌బీఐ ఇటీవల కొన్ని మార్గదర్శకాలు విడుదల చేయడంపై ఆర్థిక మంత్రి సీతారామన్ హర్షం వ్యక్తం చేశారు.

బంగారం ధరలు

కేంద్ర బ్యాంకులు భారీగా కొనడం వల్లే భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు అనూహ్యంగా పెరిగాయని నిర్మలా సీతారామన్ చెప్పారు. ప్రభుత్వం, ఆర్‌బీఐ పసిడి దిగుమతులను నిశితంగా గమనిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతానికైతే ఈ దిగుమతులు ఆందోళనకర స్థాయిలో లేవన్నారు. గత ఏడాది ఏప్రిల్-డిసెంబరు మధ్య కాలంలో మన పసిడి దిగుమతులు 5,000 కోట్ల డాలర్లకు చేరాయి. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది వంద కోట్ల డాలర్లు మాత్రమే ఎక్కువని సీతారామన్ చెప్పారు.

> పసిడి దిగుమతులపై బేఫికర్
> పీఎస్‌బీల విలీనాలపై ఇంకా రోడ్‌మ్యాప్ లేదు
> ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

సుంకాలపై ఇప్పుడే ఏమీ చెప్పలేం

ట్రంప్ సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేయడంపై మాట్లాడేందుకు ఆర్థిక మంత్రి నిర్మల నిరాకరించారు. ఈ అంశంపై ఇప్పుడు మాట్లాడడం తొందరపాటు అవుతుందన్నారు. ఈ తీర్పు పర్యవసానాలను కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ సమీక్షిస్తోందన్నారు.

పీఎస్‌బీల విలీనాలు

ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీనాలకు సంబంధించి ప్రస్తుతం తమ వద్ద ఎలాంటి రోడ్ మ్యాప్ లేదని సీతారామన్ స్పష్టం చేశారు. అయితే వికసిత భారత్ కోసం ఏర్పాటు చేసే ఉన్నత స్థాయి బ్యాంకింగ్ కమిటీ ఈ విషయాన్ని పరిశీలిస్తుందన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ఈ కమిటీ విధివిధానాలను ఇంకా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం జరిగిన ఆర్‌బీఐ కేంద్ర బోర్డు సమావేశంలోనూ పీఎస్‌బీల విలీనంపై చర్చించలేదన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధన సాకారం కావాలంటే దేశంలో మూడు నాలుగు అంతర్జాతీయ స్థాయి మెగా బ్యాంకులు ఏర్పడాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పుడున్న 12 పీఎస్‌బీల విలీనాల ద్వారా ఈ లక్ష్యం సాధ్యమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

ద్రవ్యోల్బణాన్ని బట్టే వడ్డీ రేట్ల నిర్ణయం

ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా

రిటైల్ ద్రవ్యోల్బణం, జీడీపీ వృద్ధి రేటు ఆధారంగానే కీలక రెపో రేటుపై నిర్ణయం తీసుకుంటామని ఆర్థిక మంత్రితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా చెప్పారు. ప్రస్తుతం దేశంలో నిధుల సరఫరాకి ఎలాంటి లోటు లేదన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అన్ని రంగాలకు నిధుల లభ్యత పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాత రుణ పత్రాలు తీసుకుని కొత్త రుణ పత్రాలు జారీ చేయడం ఆర్‌బీఐ రుణ నిర్వహణలో భాగమన్నారు. 2022లో ఆర్‌బీఐ ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టిన సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) కరెన్సీ నోట్లు లేదా యూపీఐ చెల్లింపులకు ప్రత్యామ్నాయం కాదని మల్హోత్రా తేల్చి చెప్పారు. అయితే సీబీడీసీలో మరిన్ని సురక్షిత ఫీచర్లను జోడించాల్సి ఉందన్నారు.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ పరిణామాలను గమనిస్తున్నాం: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా చెప్పారు. చండీగఢ్‌లోని తమ బ్యాంకు శాఖలో ఉద్యోగులు, ఇతరులు రూ.590 కోట్ల నిధులు స్వాహా చేసినట్టు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఇప్పటికే ప్రకటించింది. దీన్ని ప్రత్యేక సంఘటనగా చూడాలే తప్ప వ్యవస్థాగత సమస్యగా చూడలేమని ఆయన స్పష్టం చేశారు. ఈ నిధుల స్వాహా కూడా హరియాణా ప్రభుత్వానికి చెందిన కొన్ని శాఖల నిధులని అన్నారు.

కొత్త ద్రవ్యోల్బణ సూచీ మంచిదే: రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాల కోసం 2024 నాటి వినియోగ ధరల ఆధారంగా రూపొందించిన కొత్త వినియోగ ధరల సూచీ (సీపీఐ)ని మల్హోత్రా సమర్థించారు. ఇది గృహ వినియోగదారుల వినియోగ వివరాలు, ఖర్చుల వివరాలను మరింత సమర్థవంతంగా ప్రతిఫలిస్తుందన్నారు. తద్వారా మరింత మెరుగైన ఆర్థిక, ద్రవ్య విధానాల రూపకల్పన సాధ్యమవుతుందన్నారు.

ఎయిర్‌టెల్ మనీకి రూ.20,000 కోట్ల నిధులు

న్యూఢిల్లీ: ఎయిర్‌టెల్ తన అనుబంధ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ 'ఎయిర్‌టెల్ మనీ లిమిటెడ్ (ఏఎంఎల్)ను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం వచ్చే కొద్ది సంవత్సరాల్లో ఆ సంస్థకు రూ.20,000 కోట్ల నిధులు సమకూర్చనుంది. ఇందులో 70% నిధులను తాము, మిగతా 30 శాతం నిధులను తమ ప్రమోటర్ గ్రూప్ భారతీ ఎంటర్‌ప్రైజెస్ సమకూరుస్తుందని రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఆర్‌బీఐ ఈ నెల 13వ తేదీన ఎయిర్‌టెల్ మనీకి ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు మంజూరు చేసింది. ఏఎంఎల్ ఇప్పటికే రూ.9,000 కోట్ల రుణాలు మంజూరు చేసింది. తాజా నిధులతో ఏఎంఎల్ రుణ వితరణ సామర్థ్యం మరింత పెరుగుతుందని భారతీ ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గోపాల్ విఠల్ తెలిపారు.

లాభాల్లో మార్కెట్లు

సెన్సెక్స్ 479 పాయింట్లు అప్

ముంబై: టారిఫ్‌లపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశీయ స్టాక్ మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపింది. దీంతో సోమవారం సూచీలు లాభాల్లో ముగిసాయి. పీఎస్‌యూ బ్యాంక్, ఆటోమొబైల్, ఫైనాన్షియల్ రంగ షేర్లు లాభాల్లో మదుపరులు భారీగా అమ్మకాలు దిగటంతో బీఎస్ఈ సెన్సెక్స్ 479 పాయింట్ల లాభంతో 83,294.66 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సూచీ 671.44 పాయింట్ల లాభంతో 83,486.15 పాయింట్లను తాకింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 141.75 పాయింట్ల లాభంతో 25,713 పాయింట్ల దగ్గర ముగిసింది. సూచీలు లాభాల్లో ముగియటం వరుసగా ఇది రెండో రోజు. బీఎస్ఈలో మొత్తం 2,435 స్టాక్స్ పతనమవగా 1,894 షేర్లు లాభాల్లో 168 స్టాక్స్ ఎలాంటి మార్పు లేకుండా ముగిసాయి. అమెరికా సుప్రీంకోర్టు టారిఫ్‌ల అమలు రద్దు చేయటం మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపిందని, ట్రంప్ మరోసారి 15 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని అంతగా పట్టించుకోలేదని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే డాలర్ బలహీనత, 10 ఏళ్ల ట్రెజరీ బాండ్ల లాభాలు క్షీణించటం మధ్యకాలికంగా అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపించే అవకాశం ఉందని వారన్నారు. సోమవారం నాటి ట్రేడింగ్‌లో పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.4 శాతం లాభపడగా హాస్పిటల్ ఇండెక్స్ 0.89 శాతం, సేవల రంగం 0.97 శాతం, ఆటోమొబైల్ 0.71 శాతం, ఫైనాన్షియల్ సర్వీసుల రంగం 0.65 శాతం మేర లాభపడ్డాయి.

బులియన్ మార్కెట్ పైపైకి

3 వారాల గరిష్ఠ స్థాయికి ధరలు

▸▸ 10 గ్రాముల పసిడి రూ.1,62,800

▸▸ కిలో వెండి ధర రూ.2.72 లక్షలు

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో మళ్లీ ర్యాలీ ప్రారంభమైంది. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం రూ.3,300 లాభంతో రూ.1,62,800 వద్ద, కిలో వెండి రూ.8,000 లాభంతో రూ.2.72 లక్షల వద్ద ముగిశాయి. గత మూడు వారాల్లో బంగారం, వెండి ధరలు ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు లాభాల బాట పట్టాయి. సోమవారం ఔన్స్ (31.10 గ్రాములు) 5,215 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఔన్స్ వెండి ధర 87.35 డాలర్లకు చేరింది.

గ్రీన్ హైడ్రోజన్‌లో ఏపీ టాప్

▸▸ మెరుగైన విధానాలతో ముందంజ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: స్వచ్ఛ ఇంధనంవైపు దేశంలోని అన్ని రాష్ట్రాలు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ పాలసీల రూపకల్పనలో ఆంధ్రప్రదేశ్ టాప్‌లో నిలిచింది. దేశంలోని 21 రాష్ట్రాల్లో విద్యుత్ వినియోగంలో వస్తున్న పరివర్తనాన్ని అధ్యయనం చేసిన ఇండియన్ స్టేట్స్ ఎలక్ట్రిసిటీ ట్రాన్సిషన్(ఎస్ఈటీ)-2026 నివేదిక సోమవారం విడుదలైంది. అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎనర్జీ ఎకనామిక్స్, ఫైనాన్షియల్ ఎనాలిసిస్ (ఐఈఈఎఫ్ఏ)తో మేధో సంస్థ ఏంబర్ సంయుక్తంగా రాష్ట్రాల్లో విద్యుత్ వినియోగాన్ని పరిశీలించి నివేదికను విడుదల చేశాయి. కర్బన ఉద్గారాల తగ్గింపు, విద్యుత్ పర్యావరణ వ్యవస్థ సంసిద్ధత-పనితీరు, మార్కెట్ ఎనేబులర్లు అనే మూడు ప్రధాన అంశాల్లో రాష్ట్రాల పనితీరును మదింపు చేసి నివేదిక రూపొందించారు. కర్బన ఉద్గారాల తగ్గింపు, స్వచ్ఛ ఇంధన వినియోగంలో కర్ణాటక ప్రథమ స్థానంలో నిలిచింది. తర్వాత హిమాచల్ ప్రదేశ్, కేరళ ఉన్నాయి. ఎకోసిస్టమ్ సంసిద్ధతలో ఢిల్లీ, హరియాణా మెరుగ్గా ఉన్నాయి. విద్యుత్ వాహనాల వినియోగం, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ టారిఫ్‌ల విధానాల్లో ఏపీ టాప్‌లో ఉంది. సమగ్ర పునరుత్పాదక ఇంధన విధానం, గ్రీన్ హైడ్రోజన్‌లో పురోగతిలో మెరుగైన పనితీరు కనబరచింది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో సోలార్ అవర్ టారిఫ్‌లో చురుగ్గా ఉంది. ఇక ఓవరాల్ ప్రదర్శనలో మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, అస్సాం, పంజాబ్, హిమాచల్ ముందున్నాయి. పునరుత్పాదక ఇంధనం వినియోగం, అమలులో తెలంగాణ కూడా వెనకబడింది.

నేటి నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల క్రీడా పోటీలు

- విజయవాడలో మూడు రోజులు నిర్వహణ
- క్రికెట్‌లో ఆరు జట్లు.. కెప్టెన్లుగా మంత్రులు

విజయవాడ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్ మంగళవారం ప్రారంభం కానుంది. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం(ఐజీఎంఎస్)లో ఈ పోటీలను ప్రారంభిస్తారు. మూడు రోజులపాటు పోటీలు నిర్వహిస్తారు. ఆ వివరాలను శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ కల్యాణచక్రవర్తి సోమవారం ఐజీఎంఎస్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొనే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధరించే జెర్సీలను ఆవిష్కరించారు. మొత్తం 14 రకాల ఆటల పోటీలను నిర్వహించనుండగా, పాల్గొనేందుకు 156 మంది ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పేర్లు నమోదు చేసుకున్నారు. టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, కబడ్డీ, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, పికిల్ బాల్, మ్యూజికల్ చైర్స్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెక్, క్యారమ్స్ పోటీలను నిర్వహిస్తారు. బ్యాడ్మింటన్‌కు 60 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. క్రికెట్‌లో ఆరు జట్లు పాల్గొంటాయి. పోటీలను ఐజీఎంఎస్, డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియంలలో నిర్వహిస్తారు.

కెప్టెన్లు వీరే.. త్రోబాల్‌లో ఒక జట్టుకు మంత్రులు అనిత కెప్టెన్‌గా, సవిత వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. టగ్ ఆఫ్ వార్‌లో ఒక జట్టుకు స్పీకర్ అయ్యన్న, మరో జట్టుకు డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కెప్టెన్‌లుగా వ్యవహరిస్తారు. క్రికెట్‌లో ఆరు జట్లకు మంత్రి అచ్చెన్న, కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, పల్లా శ్రీనివాసరావు కెప్టెన్‌లుగా ఉంటారు. బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి క్రికెట్ వ్యాఖ్యాత వ్యవహరిస్తారు.

జగన్ బౌలింగ్.. లోకేశ్ బ్యాటింగ్ చూడాలని ఉంది: బొజ్జల

ఆటల పోటీల్లో పాల్గొనాలని వైసీపీని ఆహ్వానించామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. వైసీపీకి అసెంబ్లీలో ఉన్న 11 మంది ఎమ్మెల్యేలు క్రికెట్‌లో ఒక జట్టుగా ఉంటే బాగుంటుందని వ్యాఖ్యానించారు. జగన్ బౌలింగ్‌కు మంత్రి లోకేశ్ బ్యాటింగ్ చేస్తుంటే చూడాలని ఉందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఏదో ఒక రోజున పోటీల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



జెర్సీలను ఆవిష్కరిస్తున్న రవినాయుడు, సుధీర్‌రెడ్డి తదితరులు

సునీల్ నాయక్ అరెస్టులో హైడ్రామా

(మొదటి పేజీ తరువాయి)

బిహార్ అగ్నిమాపక, హోంగార్డుల విభాగం ఐజీగా ఉన్న సునీల్ కుమార్ నాయక్‌ను ఏపీ పోలీసులు సోమవారం అరెస్టు చేయగా.. కొద్ది గంటల్లోనే ఆయన్ను వదిలేయాల్సి వచ్చింది. ఆయన్ను ఏపీ తరలించడానికి స్థానిక కోర్టు ట్రాన్సిట్ వారెంటు ఇవ్వకపోవడమే దీనికి కారణం. చిత్రహింసల కేసులో ఆయన్ను అరెస్టు చేసేందుకు దర్యాప్తు అధికారి, విజయనగరం ఎస్పీ దామోదర్ నేతృత్వంలో గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ రమణకుమార్, వెస్ట్ డీఎస్పీ అరవింద్, నగరంపాలెం సీఐ సత్యనారాయణ, మరో ఇరువురు సిబ్బంది ఆదివారమే పట్నా చేరుకున్నారు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో నేరుగా సునీల్ నాయక్ ఇంటికి వెళ్లారు. రఘురామరాజును టార్చర్‌కు గురిచేసిన సంఘటన సంబంధించి నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టు చేస్తున్నట్లు చెబుతూ ఆయన తల్లికి నోటీసులు అందజేశారు. ఆయన్ను తీసుకెళ్తుండగా.. హోంగార్డు విభాగానికి చెందిన సిబ్బంది నానా రచ్చ చేసి అడ్డుకున్నారు. ఓ సీనియర్ ఐపీఎస్ అధికారిణి వచ్చి దామోదర్ బృందాన్ని తీవ్రస్థాయిలో దూషించినట్లు తెలిసింది. పట్నా (వెస్ట్) ఎస్పీ భానుప్రతాప్‌సింగ్ వారిని శాంతింపజేశారు. ఆ తర్వాత ఏపీ పోలీసులు స్థానిక పోలీసుల సాయంతో సునీల్ నాయక్‌కు స్థానిక ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కోర్టులో ట్రాన్సిట్ వారెంటు తీసుకుని సాయంత్రానికి విమానంలో ఏపీకి తీసుకొచ్చేందుకు టికెట్లు కూడా కొన్నారు. కానీ పట్నా 9వ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ట్రాన్సిట్ వారెంటు జారీకి నిరాకరించింది. అంతర్రాష్ట్ర అరెస్టు విధానాలను పాటించలేదని.. అరెస్టు వారెంటు లేదని.. అవసరమైన పత్రాలు సమర్పించకపోవడం వంటి కారణాలను న్యాయాధికారి ప్రస్తావించి.. ట్రాన్సిట్ వారెంటును తిరస్కరించినట్లు తెలిసింది. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా.. వారెంటు లేకుండా ఎలా అరెస్టు చేస్తారని మేజిస్ట్రేట్ ప్రశ్నించగా.. ఏపీ పోలీసులు ఈ కేసులో సునీల్ నాయక్ పాత్రకు సంబంధించిన ఆధారాలు.. సాక్షులు, ఇతర నిందితుల నుంచి తీసుకున్న 161, 164 వాంగ్మూలాలు, సుమారు వెయ్యి పేజీల సీడీ ఫైలును కోర్టుకు చూపారు. వాటన్నింటినీ పరిశీలించాక.. ఈ కేసు దర్యాప్తు అధికారి దామోదర్ నియామక పత్రాన్ని మేజిస్ట్రేట్ అడిగారు. దీంతో ఆయన నియామక పత్రాన్ని చూపారు. అక్కడి పరిణామాలను ఎప్పటికప్పుడు ఎస్పీ దామోదర్ ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ వీరగంధం రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. సునీల్ నాయక్‌కు కోర్టు తప్పనిసరిగా ట్రాన్సిట్ వారంట్ ఇచ్చి తీరాల్సిందేనని పేర్కొంటూ.. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మూడు తీర్పులను రాజేంద్రప్రసాద్ వారికి పంపారు. అయినా లాభం లేకపోయింది. ట్రాన్సిట్ వారెంటు ఇవ్వడానికి మేజిస్ట్రేట్ నిరాకరించారు. అంతేగాక నెలరోజుల వరకు సునీల్ నాయక్‌పై చర్యలు తీసుకోకుండా ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఈలోగా ఐదారు వందల మంది బిహార్ పోలీసులు కోర్టుకు చేరుకుని పరిసరాల్లో మోహరించారు. ఏపీ పోలీసుల అదుపులో ఉన్న నాయక్‌ను తీసుకెళ్లారు. కోర్టు ట్రాన్సిట్ వారంట్ ఇవ్వనందున ఆయన్ను తీసుకెళ్తున్నట్లు అదనపు డీజీ స్థాయి అధికారి ఒకరు తెలిపారు.



పాట్నాలో సునీల్ నాయక్‌కు అరెస్టు నోటీసులు ఇస్తున్న విజయనగరం ఎస్పీ దామోదర్

ఏపీ పోలీసులపై నాయక్ ఫిర్యాదు..

ఆ తర్వాత ఏపీ పోలీసులపై సునీల్ నాయక్ స్థానిక శాస్త్రినగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసులు అరెస్టు వారెంటు చూపలేదన్నారు. అంతర్రాష్ట్ర అరెస్టుకు ముందు స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలన్న నిబంధనను పాటించలేదని.. అరెస్టు తర్వాతే శాస్త్రి నగర్ పోలీసు స్టేషన్‌కు తెలియజేశారని తెలిపారు. వారి చర్యలతో 66 ఏళ్ల తన తల్లి ఎం.బీకీబాయి తీవ్ర ఆందోళన చెందారని.. ఆమె గది తలుపులకు తాళం కూడా వేశారని ఆరోపించారు.

ఇదీ కేసు..

హైదరాబాద్‌లో జన్మదినం జరుపుకొంటున్న రఘురామ రాజును సీఐడీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అదుపులోకి తీసుకుని 2021 మే 14న గుంటూరులోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. ఆ రోజు రాత్రి ఆయన్ను కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఆయన అరికాళ్లు వాచిపోయేలా రబ్బర్ బెల్టు, ఫైబర్ లాఠీతో విచక్షణరహితంగా కొట్టారు. ఈ వ్యవహారం స్థానిక కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా వెళ్లడం తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 జూలై 11న నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో రఘురామరాజు ఫిర్యాదు చేశారు. పోలీసులు హత్యాయత్నం కేసు నమోదుచేశారు. ఏ-1గా నాటి సీఐడీ డీజీ పీవీ సునీల్‌కుమార్, ఏ-2గా నాటి నిఘా చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ-3గా మాజీ సీఎం జగన్, ఏ-4గా నాటి సీఐడీ అదనపు ఎస్పీ విజయపాల్, ఏ-5గా అప్పటి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతిని చేర్చారు. ఆ తర్వాత తనను టార్చర్‌కు గురిచేసిన గదిలో అప్పటి సీఐడీ డీఐజీ సునీల్‌నాయక్ కూడా ఉన్నట్లు రఘురామ ఆరోపించారు. దీనిపై విచారించిన అధికారులు ఆరోజు ఘటనా స్థలంలో నాయక్ ఉన్నట్లు నిర్ధారించుకుని ఆయన్ను ఏ-6గా చేర్చారు. వాస్తవానికి సునీల్ నాయక్ పల్నాడు జిల్లా కారంపూడి మండలం లాలిపురం తండాకు చెందినవారు. 2005లో బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. జగన్ హయాంలో ఏపీ కేడర్‌కు డిప్యుటేషన్‌పై వచ్చారు. 2024లో కూటమి ప్రభుత్వం రాగానే బిహార్ వెళ్లిపోయారు. అక్కడ ఆయనకు ఐజీగా ఉద్యోగోన్నతి లభించింది. రఘురామ కేసులో తనను అరెస్టు చేస్తారని భావించి పట్నా హైకోర్టును ఆశ్రయించారు. ఆయన్ను అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశాలిచ్చింది. దీనిపై రఘురామరాజు తరపున ఏపీ ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ వీరగంధం రాజేంద్రప్రసాద్ అప్పీలు దాఖలు చేశారు. దీంతో అరెస్టు నుంచి కల్పించిన రక్షణను హైకోర్టు కొట్టివేసింది. వెంటనే ఏపీలోని సంబంధిత కోర్టులో లొంగిపోవాలని ఆదేశించింది. అయితే ఆయన గుంటూరులోని రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. కోర్టు దానిని కొట్టివేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో విచారణకు రావాలని ఏపీ పోలీసులు సునీల్ నాయక్‌కు నోటీసులు పంపారు. ఎన్నిసార్లు నోటీసులు పంపినా ఆయన స్పందించలేదు. దీంతో నేరుగా పట్నా వెళ్లి నోటీసులు అందించారు. అయినప్పటికీ ఆయన రాకపోవడంతో ఎస్పీ దామోదర్ బృందమే అక్కడకు వెళ్లింది.

బతుకు, భవిష్యత్తు... ట్యాంకర్‌కు బలి

- హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం
- ర్యాపిడో బైక్‌ను ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్
- రైడర్, వెనుక కూర్చున్న యువతి దుర్మరణం
- రంజాన్ ఖర్చులకు ర్యాపిడో రైడర్ పనిలో హోంగార్డు
- సౌదీ వెళ్లేందుకు వీసా ఇంటర్వ్యూ కోసం వచ్చిన యువతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే జీతం భార్యాపిల్లల పోషణకే సరిపోవడం లేదు. పండగొస్తోంది.. కిరాణా సామాను, కొత్త బట్టలు అవీ కొనాలి! ర్యాపిడో రైడర్‌గా కొన్నాళ్లు చేస్తే ఆ అదనపు సంపాదనతో పండుగ ఖర్చులు వెళ్లిపోతాయి అనే ఉద్దేశం ఆ హోంగార్డుది! రైడ్‌ను బుక్ చేసుకున్న యువతికేమో విదేశాల్లో ఉద్యోగం చేయాలనే కల! వీసా ఇంటర్వ్యూ కోసం ఏపీ నుంచి ప్రత్యేకంగా హైదరాబాద్ కొచ్చింది! అయితే.. హోంగార్డు బతుకు పోరాటాన్ని.. ఉజ్వల భవిష్యత్తు దిశగా యువతి ఆరాటాన్ని ఆ రాకాసి వాటర్ ట్యాంకర్ నిర్దాక్షిణ్యంగా చిదిమేసింది. బైక్ మీద వెళుతున్న ఇద్దరూ ట్యాంకర్ కింద నలిగి దుర్మరణంపాలయ్యారు. సోమవారం ఉదయం బంజారాహిల్స్ వెంగళరావు పార్కు వద్ద జరిగిన ఈ రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. చంద్రాయణగుట్ట అల్జుబెల్ కాలనీకి చెందిన సయ్యద్ హుస్సేన్ (40) సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, 10, 8, 7 తరగతులు చదువుతున్న ముగ్గురు కుమారులున్నారు. భార్య ఇంటి వద్దే ఉంటోంది. రంజాన్ పండుగ సమీపిస్తుండటంతో ట్రాఫిక్ విధులు ముగిశాక హుస్సేన్ ర్యాపిడోలో బైక్ నడుపుతున్నాడు. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన అక్షిత (22) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ పూర్తిచేసింది. కొన్నాళ్లు నగరంలోనే ఉద్యోగం చేసి.. ఏడాది క్రితం తిరిగి స్వస్థలానికి వెళ్లిపోయింది. విదేశాల్లో ఉద్యోగం చేయాలనే ప్రయత్నాల్లో ఉన్న ఆమె, దుబాయ్ వీసా కోసం దరఖాస్తు పెట్టుకుంది. వీసా ఇంటర్వ్యూకు తేదీ ఖరారు కావడంతో నిబంధనల ప్రకారం ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు 22న నగరానికి వచ్చింది. చింతల్‌లో స్నేహితురాలి వద్ద దిగింది. ఆరోగ్య పరీక్షల కోసం సోమవారం ఉదయం మెహదీపట్నంకు వచ్చింది. అక్కడ పని పూర్తి చేసుకొని తిరిగి చింతల్ వెళ్లేందుకు ర్యాపిడో బుక్ చేసింది. ఇక అప్పటికే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 8గంటలకు విధులు ముగించుకున్న హుస్సేన్ చాంద్రాయణ గుట్ట మీదుగా రేతిబౌలి చేరుకున్నాడు. అక్కడ ర్యాపిడో యాప్ ఓపెన్ చేశాడు. మెహదీపట్నం నుంచి చింతల్ వరకు రైడ్ తగిలింది. వెంటనే మెహదీపట్నంకు వెళ్లాడు. అక్కడ ర్యాపిడో బుక్ చేసిన అక్షితను బైక్ మీద కూర్చోబెట్టుకొని చింతల్ బయలుదేరాడు. వీరు ప్రయాణిస్తున్న బైక్.. బంజారాహిల్స్ వెంగళరావు పార్కు వద్ద ప్రమాదానికి గురైంది. అక్కడ హుస్సేన్ మలుపు తీసుకుంటుండగా పక్క నుంచి వెళుతున్న వాటర్ ట్యాంకర్ వెనుక భాగం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో హుస్సేన్, అక్షిత ఇద్దరూ ట్యాంకర్ కింద పడ్డారు. ఆ భారీ వాహనం వెనుక చక్రాలు ఇద్దరిపై నుంచి దూసుకెళ్లాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ నిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. హుస్సేన్ మృతితో అతడి భార్యాపిల్లలు రోడ్డున పడ్డారు. తమ బిడ్డ ఇక లేదనే వార్త చెవిన పడటంతో అక్షిత కుటుంబసభ్యులు కంటికీమంటికి ధారగా రోదిస్తున్నారు.



హుస్సేన్



అక్షిత

బాబుపై కేసుల రికార్డుల పిటిషన్ వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, తదితరులపై నమోదైన కేసులకు సంబంధించిన రికార్డులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్లపై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. ఈ పిటిషన్లకు విచారణార్హత లేదని.. ఇదే వ్యవహారంపై ఇప్పటికే వ్యాజ్యాలు దాఖలయ్యాయని తెలిపారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి వివరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను వారానికి వాయిదా వేశారు. ప్రస్తుత క్రిమినల్ రివిజన్ పిటిషన్లను ఇదే వ్యవహారంతో ముడిపడి ఉన్న ఇతర వ్యాజ్యాలకు జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు. విశ్రాంత రైల్వే ఉద్యోగి యేము కొండలరావు ఈ క్రిమినల్ రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారు.

అసిస్టెంట్ కమిషనర్ శాంతి సస్పెన్షన్‌పై జీవో 22 మేరకు నిర్ణయం: హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి సస్పెన్షన్‌పై సాధారణ పరిపాలనశాఖ 2024 ఫిబ్రవరి 29న జారీ చేసిన జీవో నంబరు 22 ప్రకారం నిర్ణయం తీసుకోవాలని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌లను హైకోర్టు ఆదేశించింది. సస్పెన్షన్ ఎత్తివేసి, తిరిగి విధుల్లోకి తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శాంతి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ప్రభుత జీవో నంబరు 22 ప్రకారం ఏడాదికి మించి సస్పెండ్ చేయడానికి వీల్లేదని, ఎలాంటి కారణం లేకుండా సస్పెన్షన్ కొనసాగించాలని కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు.

ఇరాన్ నుంచి త్వరగా వచ్చేయండి

- ప్రవాసాంధ్రులకు మంత్రి కొండపల్లి సూచన

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఇరాన్‌లో పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్న నేపథ్యంలో అక్కడున్న రాష్ట్ర విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రవాసాంధ్రులు క్షేమంగా స్వస్థలాలకు చేరుకోవాలని రాష్ట్ర ప్రవాసాంధ్రుల సాధికార సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. నిరసనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని, అక్కడి భారత రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలని, పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు భారత ఎంబసీ, ఏపీఎన్ఆర్టీలను సంప్రదించి త్వరితగతిన స్వస్థలాలకు చేరుకోవాలన్నారు. సాయం కోసం ఏపీఎన్ఆర్టీ హెల్ప్‌లైన్ నంబరు +91 8500027678ను సంప్రదించాలన్నారు.

టెట్ రద్దుకు చొరవ తీసుకోండి: ఏపీయూఎస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేసేందుకు చొరవ తీసుకోవాలని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం) జాతీయ అధ్యక్షుడు నారాయణ లాల్ గుప్తాకు ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) విన్నవించింది.న్యూఢిల్లీలో సోమవారం నారాయణ లాల్‌ను ఏపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ బృందం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు.

ఇంటర్ విద్యార్థులకు స్పెషల్ ఫీజులు పెంపు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు స్పెషల్ ఫీజులను పెంచుతూ ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుత ఫీజులపై 10% పెంచింది. దీంతో ప్రస్తుతం ఏడాదికి రూ.2200 చెల్లిస్తున్న విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి రూ.2420 చెల్లించాల్సి ఉంటుంది. ఇది కాకుండా అదనపు లేబొరేటరీ ఫీజును రూ.275 నుంచి రూ.302కు పెంచింది.

జగన్ పాలనలో దళితుల ఊచకోతే: వర్ల

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో దళితులను ఊచకోత కోశారని, జగన్ దళిత ద్రోహి అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. జగన్ పాలనలో దళితులను వెంటాడి వేటాడి బలి తీసుకున్నారని అన్నారు. వైసీపీ హయాంలో దళితులపై జరిగిన అరాచకాలపై సిట్ వేయాలని సీఎంను రామయ్య కోరారు.

పంటకాలంపై తెలంగాణ వితండం!

- కృష్ణా డెల్టాలో వరికి 190 రోజులు కావాలి: ఏపీ
- ట్రైబ్యునల్ 152 రోజులు చాలంటే సరేనన్నాం
- ఇప్పుడు ఆరుతడి పంటలు చాలంటోంది
- బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఆంధ్ర న్యాయవాదుల సమర్థ వాదనలు

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టా నీటి అవసరాలపై తెలంగాణ అడ్డగోలు వాదనలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఆక్షేపించింది. డెల్టా పరిధిలో వరి పంట కాలంపై వితండవాదం చేస్తోందని పేర్కొంది. ఆరు తడి పంటలే వేయాలని సలహా ఇవ్వడాన్ని తప్పుబట్టింది. రెండు రాష్ట్రాల నడుమ కృష్ణా జలాల పునఃపంపిణీకి సంబంధించి సోమవారం ఢిల్లీలో బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా, సీనియర్ కౌన్సిల్ సభ్యుడు జి.ఉమాపతి, అడ్వకేట్ శరత్ చంద్ర బలమైన వాదనలు వినిపించారు. వాస్తవానికి తమ ప్రాంతంలో వరి పండించేందుకు 180 నుంచి 190 రోజులు నీరు కావాలని.. కానీ 152 రోజులు సరిపోతుందని కృష్ణా ట్రైబ్యునల్ పేర్కొనడంతో దానికి అంగీకరించామని పేర్కొన్నారు. 'ఖరీఫ్ కాలంలో కృష్ణా డెల్టాలో వరిని ప్రధానంగా పండిస్తారు. వరి వంగడాన్ని బట్టి 140 రోజుల్లోనే పంట చేతికి వచ్చే అవకాశాలున్నాయంటూ తమ పంచాంగం చెబుతోందని తెలంగాణ వాదించడం సరికాదు. పంటకాలం విషయంలో ఆ రాష్ట్రానికి అవగాహన లేదు. తెలంగాణ చెబుతున్న 368 రకం వరి వంగడం కృష్ణా డెల్టాలో వేసేందుకు అనువు కాదు. 376 వంగడాన్ని కూడా పట్టించుకోనవసరం లేదు. ఆ రాష్ట్రం చేసిన పరిశోధనల్లోనే ఈ రెండు వంగడాలపై ఏకాభిప్రాయం రాలేదు. 2014లో ఆ రాష్ట్రం విడుదల చేసిన ప్రకటనలో 291 వంగడాన్ని వేస్తే పంట చేతికి వచ్చేసరికి 152 రోజులు పడుతుందని వెల్లడించింది. ఇప్పుడు బ్రిజేశ్ ట్రైబ్యునల్ ఎదుట 140 రోజులు చాలని వితండవాదం చేస్తోంది' అని తెలిపారు. తమ వాదనను బలపరిచేలా 5 సాక్ష్యాధారాలను ఏపీ న్యాయవాదులు ట్రైబ్యునల్ ముందుంచారు. కృష్ణా డెల్టాపై సోమవారం బలమైన వాదనలు వినిపించిన ఏపీ.. మంగళవారం కేసీ కెనాల్ పరిధిలో నీటి అవసరాలపై వాదనలు వినిపించనుంది. కాగా.. కృష్ణా జలాలపై తెలంగాణ పిటిషన్ సుప్రీంకోర్టులో బుధవారం విచారణకు రానుంది. దీంతో కృష్ణా జలాలపై తమ తదుపరి వాదనలు గురువారం వినిపిస్తామనిఏపీ కోరనుంది.

నేనెక్కడకూ పారిపోలేదు

బొత్సతో ఎమ్మెల్సీ అనంతబాబు



అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తానేమీ పారిపోలేదని.. రాష్ట్రంలోనే ఉన్నానని వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. సోమవారం శాసనమండలి ప్రాంగణంలోని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చాంబరుకు ఆయన వచ్చారు. అనంతబాబును చూసిన వెంటనే.. 'ఏమిటీ.. పరారయ్యావని మీడియాలో, పత్రికల్లో రాశారు' అని బొత్స ప్రశ్నించారు. తానెక్కడకూ పారిపోలేదని.. ఇక్కడే ఉన్నానని ఆయన బదులిచ్చారు.

'రెవెన్యూ'కు ఫ్రెష్ లుక్!

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలని పేర్కొన్నారు. భూముల రీ సర్వేతో అన్ని సమస్యలూ పోవాలే తప్ప.. కొత్త వివాదాలు రాకూడదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు సోమవారం అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించారు. రెవెన్యూ శాఖ ఉద్యోగులపై ఏసీబీ దాడులు చేసే పరిస్థితి రాకుండా చూసుకోవాలన్నారు. సరిగా పనిచేయని తహశీల్దార్లను పక్కన పెట్టాలని, బాగా పనిచేసే డిప్యూటీ తహసీల్దార్లను గుర్తించి వారికి తహసీల్దార్లుగా పదోన్నతులు ఇవ్వాలన్నారు. సర్వేయర్లు సరిగా వ్యవహరించకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై ఆడిట్ చేయించాలని సూచించారు.

ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యానికి వారిదే బాధ్యత

ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చూడాలని వైద్యారోగ్య శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు తరచూ కలెక్టర్లతో వైద్యుల ఖాళీల వివరాలు తెలుసుకొని భర్తీ చేయాలన్నారు. ఆస్పత్రులు బాగుపడాలని, దేవాలయాల్లో సదుపాయాలు మెరుగుపడాలని సూచించారు. ఆస్పత్రుల్లో పారిశుధ్యం పాటించకుంటే.. సంబంధిత అవుట్ సోర్సింగ్ ఏజెన్సీని బాధ్యులను చేయాలన్నారు. గతంతో పోలిస్తే ఆలయాల్లో సౌకర్యాలు బాగా మెరుగయ్యాయని.. మరింత పెంచాలని సూచించారు. తాగునీటి శాంపిళ్ల పరీక్షలకు మొబైల్ ల్యాబ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

అభినందన లేఖలు ఇవ్వండి

ఉద్యోగుల పనితీరును మదింపు చేస్తున్నందున.. పనితీరు బాగా లేని వారిని మోటివేట్ చేయడంతో పాటు బాగా పనిచేస్తున్న వారిని ప్రశంసించాలని సూచించారు. ఇలా చేయడం వల్ల ఉద్యోగుల్లో పనిచేశామన్న సంతృప్తి, ఉత్సాహం వస్తాయన్నారు. ఈ విధానం బాగుంటుందని, ఉద్యోగులను ఇలా అభినందించడం ఇదే తొలిసారి అవతుందని పలువురు ఆధికారులు అన్నారు. ఈ రకమైన విధానంతో ఉద్యోగుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. నెలవారీగా బాగా పని చేస్తున్న ఉద్యోగులకు అభినందన లేఖలు అందించాలని సీఎం సూచించారు. వ్యక్తిగత రికార్డుల్లోనూ నమోదు చేయాలని స్పష్టం చేశారు.

ఒప్పందాలను విజయవంతంగా అమలు చేయాలి

ప్రభుత్వం పెద్దఎత్తున టెక్నాలజీ సాయంతో సేవలు అందిస్తోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. పరిపాలనలోనూ సాంకేతికతను అందిపుచ్చుకున్నామని చెప్పారు. టెక్నాలజీ సాయంతో అందిస్తున్న సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ సేవలను టెక్నాలజీ సాయంతో మరింత సులభతరం చేయాలని ఆదేశించారు. ఇటీవల ఢిల్లీలో ఏఐ-ఇంపాక్ట్ సదస్సుకు హాజరయ్యామని, అక్కడ ప్రదర్శించిన టెక్నాలజీలను అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఏడు ఒప్పందాలను మున్సిపల్, వైద్యం, వాణిజ్య పన్నులు, ఐటీ, పరిశ్రమల శాఖలు విజయవంతంగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు.

హత్య చేసి కాశీలో పిండ ప్రదానం

- డబ్బు, బంగారం కోసమే చంపేశాడు
- 15 ఏళ్ల కిందట రాంగ్‌కాల్‌తో పరిచయం
- మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ
- నిందితుడి అరెస్టు.. చోరీ సొత్తు రికవరీ


విశాఖపట్నం/ఆరిలోవ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల క్రితం రాంగ్ కాల్‌తో పరియమైన మహిళను.. ఇప్పుడు డబ్బు కోసం హత్య చేశాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతోపాటు ఇంట్లో గల రూ.ఐదు లక్షలు నగదు అపహరించుకుపోయాడు. కాశీ వెళ్లి అక్కడ ఆమె పేరిట పిండ ప్రదానం, అన్నదానం చేశాడు! విశాఖ ఆరిలోవ దుర్గానగర్‌లో ఈనెల 11న జరిగిన కాపు లక్ష్మి(48) హత్య కేసులో నిందితుడు వంజరాపు శివగంగరావు అలియాస్ టాటూ శివ(34) చెప్పిన వివరాలు విని పోలీసులు సైతం విస్తుపోయారు. సోమవారం క్రైమ్ డీసీపీ లతామాధురి తెలిపిన మేరకు జీవీఎంసీలో ఉద్యోగం చేస్తున్న కాపు వెంకటరమణ దుర్గానగర్‌లో సొంతింట్లో భార్య లక్ష్మితో కలిసి నివాసం ఉంటున్నారు. కుమార్తె, కుమారుడు వివాహాలై దూరంగా ఉంటున్నారు. ఈనెల 11న వెంకటరమణ విధులకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో భార్య లక్ష్మి రక్తపు మడుగులో అచేతనంగా పడి ఉండడం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీ ఫుటేజీ, ఘటనా స్థలంలో టవర్ డంప్ కాల్స్‌ను పరిశీలించగా ఒకరిపై అనుమానం కలిగింది. నిందితుడు విజయనగరం జిల్లా బొబ్బిలి కోనేరుగట్టు ప్రాంతానికి చెందిన వంజరాపు శివగంగరాజు అలియాస్ టాటూ శివగా గుర్తించారు. శివగంగరాజు హత్య చేసిన తర్వాత ధన్‌బాద్, కాశీ, ఢిల్లీ వెళ్లి, అక్కడి నుంచి తిరిగి ఈనెల 22న రైలులో బొబ్బిలి వైపు వెళుతుండగా విశాఖలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా నేరాన్ని అంగీకరించాడు. పదిహేనేళ్ల కిందట కాపు లక్ష్మి రాంగ్ కాల్ ద్వారా పరిచయమైందని చెప్పాడు. అతడు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.కోటి వరకు పోగొట్టుకున్నాడు. ప్రస్తుతం 25 లక్షలు అప్పులున్నాయి. వాటిని తీర్చేందుకు గతంలో ఫోన్ ద్వారా పరిచయమైన కాపు లక్ష్మిని ఉపయోగించుకోవాలని పథకం పన్నాడు. ఈనెల 11న ఆరిలోవ వెళ్లి వేరొకరి ఫోన్ నుంచి ఆమెకు ఫోన్ చేసి ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్నాడు. ఉదయం 10.12 గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి లక్ష్మిని డబ్బు, బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆమె నిరాకరించింది. ఆమె నోరు, ముఖం గట్టిగా మూసేసి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు పుస్తెల తాడు, నల్లపూసలదండ, ఉంగరాలు, కప్‌బోర్డులో ఉంచిన రూ.ఐదు లక్షల నగదును తీసుకుని వెళ్లిపోయాడు. ఆ తర్వాత కాశీలో లక్ష్మికి పిండ ప్రదానం చేసి, అక్కడే అన్నదానం చేశానని పోలీసులు విచారణలో చెప్పినట్టు తెలిసింది. నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

సమస్యలకు ధర్నాలు పరిష్కారం కాదు

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకోండి
- వేతనాల పెంపు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా
- అంగన్వాడీ సంఘాలకు మంత్రి సంధ్యారాణి హామీ

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల డిమాండ్లను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలిస్తుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ నిరాహార దీక్షలు చేస్తున్న నేపథ్యంలో సోమవారం అమరావతి సచివాలయంలో అంగన్వాడీ సంఘాల నేతలతో మంత్రి చర్చలు జరిపారు. వారి డిమాండ్లను, సమస్యలను మంత్రి సమగ్రంగా విన్నారు. అంగన్వాడీల డిమాండ్లపై కూటమి ప్రభుత్వం సమగ్రంగా పరిశీలన చేస్తుందని హామీ ఇచ్చారు. డిమాండ్లను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మార్చి 2 మహా ధర్నా.. మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో అంగన్వాడీ డిమాండ్లపై చర్చలు జరిగాయని ఈ చర్చల్లో వేతనాల పెంపుపై స్పష్టత రాలేదని, అంత వరకూ నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్, ఏపీ ప్రగతి శీల అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్‌లు స్పష్టం చేశాయి. మార్చి 2వ తేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామని సోమవారం ఆ సంఘాల నేతలు బేబీరాణి, లలిత, వీఆర్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.



చూస్తానంటే పులివెందుల ఎమ్మెల్యేకూ క్రికెట్ మ్యాచ్ టికెట్ తీసుకుంటా

» కిలో రూ.360 అంటే అది కల్తీ నెయ్యే.. మంచి నెయ్యి మార్కెట్‌లో వెయ్యికి పైనే: లోకేశ్



అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): టీ-20 ప్రపంచకప్‌లో ఇండియా ఫైనల్‌కు చేరితే తప్పనిసరిగా మ్యాచ్ చూడటానికి వెళ్తానని మంత్రి లోకేశ్ తెలిపారు. మ్యాచ్ చూసేందుకు వస్తానంటే పులివెందుల ఎమ్మెల్యేకూ (జగన్) టికెట్ తీసుకుంటానన్నారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. వైసీపీ హయాంలో సాక్షి, భారతి సిమెంట్స్‌కు రూ.1000 కోట్లు లబ్ధి చేకూర్చారని, హెరిటేజ్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందలేదన్నారు. కిలో రూ.360 అంటే అది కల్తీ నెయ్యేనని, మార్కెట్‌లో కిలో నెయ్యి రూ.వెయ్యిపైనే ఉందని తెలిపారు.

టెక్నాలజీతో 'మొంథా'ను ఎదుర్కొన్నాం

» అందుకే పంటనష్టం చాలా వరకు తగ్గింది

» అసెంబ్లీలో హోంమంత్రి అనిత వెల్లడి



అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీని ఉపయోగించి మొంథా తుఫాన్‌ను ఎదుర్కొన్నామని, సీఎం చంద్రబాబు నిరంతర పర్యవేక్షణతో నష్టాన్ని నివారించామని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, అరిమిల్లి రాధాకృష్ణ, కాగిత కృష్ణప్రసాద్ అడిగిన ప్రశ్నలకు ఆమె బదులిచ్చారు. తొలుత రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ చర్యల వల్ల చాలా వరకూ నష్టం తగ్గినప్పటికీ, కొన్ని చోట్ల ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పంటనష్టాన్ని చాలా వరకు తగ్గించినా, దిగుబడి తగ్గిందని, చాలామంది నష్టపరిహారం అందలేదని తెలిపారు. దీనిపై మంత్రి అనిత బదులిస్తూ.. సీఎం చంద్రబాబుతోపాటు మంత్రులంతా కలిసి రాత్రి 2 గంటలవరకూ తుఫాన్‌పై పర్యవేక్షణ చేశామని చెప్పారు. 25 జిల్లాల్లో 1.67 హెకార్ట వ్యవసాయ, ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని, పంట నష్టం అంచనాపై ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేశామని, ఇప్పటికే చాలా వరకూ పంట నష్టాన్ని అందించామని, మరికొంత మందికి ఇస్తామని తెలిపారు. మొత్తం రూ.410 కోట్లను ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరుకు ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.

సోషల్ మీడియా కట్టడికి ప్రత్యేక చట్టం

రాష్ట్రంలో సోషల్ మీడియా దుర్వినియోగం బాగా పెరిగిందని, సీఎం, పీఎం, చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా ఇష్టారాజ్యంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. దీనిపై ప్రత్యేక చట్టం తీసుకురావడానికి సీఎం చంద్రబాబు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారని అనిత తెలిపారు. దీనికి సంబంధించి 1,384 కేసులు నమోదు చేసి, 1,067 మందిని అరెస్టు చేశామన్నారు. త్వరలోనే ప్రత్యేక చట్టం చేస్తామని తెలిపారు.

'ఈ-శ్రమ్'లో 88.16 లక్షల మంది కార్మికులు

» త్వరలో ప్రసూతి, వివాహ కానుకలు అమలు: మంత్రి సుభాశ్



రాష్ట్రంలో ఇప్పటి వరకు నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి పోర్టల్‌లో రూ.18,24,221 మంది నమోదయ్యారని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో అవ్యవస్థీకృత రంగ కార్మికుల సంక్షేమంపై ఎమ్మెల్యేలు డాక్టర్ పార్థసారధి, మాధవీ రెడ్డి, లోకం మాధవి, బొలిశెట్టి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. రాష్ట్రంలో 'ఈ-శ్రమ్'లో 88.16 లక్షల మంది కార్మికులు నమోదయ్యారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే కార్మికుల కోసం పథకాలను పునరుద్ధరించామన్నారు. ప్రసూతి సహాయం, వివాహ కానుక, మరణ, అంత్యక్రియల సహాయాన్ని అందించాలని నిర్ణయించామని తెలిపారు. న్యూ లేబర్ కోడ్‌ల ద్వారా చివరికి జర్నీ అలవెన్సులు కూడా అందిస్తున్నామని చెప్పారు.

611 లిఫ్టుల పునరుద్ధరణకు రూ.595 కోట్లు: నిమ్మల

రాష్ట్రంలో మూలనపడ్డ 611 లిఫ్టుల (ఎత్తిపోతల పథకాల) పునరుద్ధరణకు రూ.595 కోట్లు కేటాయించినట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు పులవర్తి రామాంజనేయులు, ముప్పిడి వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. రూ.1.40కోట్లతో 3 ఇన్లెట్ల పునర్నిర్మాణానికి, రూ.1.80 కోట్లతో స్లూయిస్‌ల పునర్నిర్మాణానికి అనుమతులిచ్చామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ తీరువల్ల 1008 లిఫ్టులు ఉంటే 613 పనిచేయడం లేదని, 158 మాత్రమే పనిచేస్తున్నాయని చెప్పారు. మిగిలినవి ఎప్పుడు ఆగిపోతాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. 1008 లిఫ్టులను ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్‌కు రూ.765 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా దాదాపు 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, వైసీపీ నిర్లక్ష్యం కారణంగా అది 4 లక్షలకు తగ్గిపోయిందన్నారు.

చీరాలలో 4.17 కోట్లతో చేనేత క్లస్టర్: సవిత

చీరాల చేనేత క్లస్టర్ కోసం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద రూ.4.17 కోట్లు మంజూరు చేశామని మంత్రి సవిత వెల్లడించారు. చీరాలలో వస్త్ర పరిశ్రమ, శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందా? అని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. నేత కార్మికుల ఉత్పాదకత, నాణ్యత, ఆదాయాన్ని పెంచేందుకు క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వసతి గృహాలకు ప్రత్యేక నిధులు: డోలా



రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేక నిధులు కేటాయించామని, ఈ ఏడాది బడ్జెట్‌లో కొత్త భవనాలతోపాటు మరమ్మతులకు కేటాయింపులు చేశామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో వసతి గృహాలకు నూతన భవనాల నిర్మాణంపై ఎమ్మెల్యే ధర్మరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని గురుకుల పాఠశాలల్లో ఫంక్షనరీ లిటరసీ అండ్ న్యూమరసీ గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఎస్సీల శ్మశాన వాటికలకు స్థల సేకరణ కోసం సర్వే నిర్వహించగా దాదాపు రూ.600 కోట్లు అవసరమని తేలిందని, దశల వారీగా ఈ కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. కాగా, నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో గత వైసీపీ హయాంలో జరిగిన వెయ్యి ఎకరాల భూకుంభకోణంపై విచారణ చేపట్టాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజనులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు అన్ని రకాలుగా అభివృద్ధికి దోహదపడే జీవో 3ను, 16 గిరిజన సంక్షేమ పథకాలను గత ప్రభుత్వం నిలిపివేసిందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆరోపించారు. వాటి పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు.

ఎక్కువ సార్లు మైనారిటీ బడ్జెట్: మంత్రి ఫరూక్

రాష్ట్ర శాసనసభలో ఎక్కువసార్లు మైనారిటీ బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని ఆ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. స్పీకరు అయ్యన్నపాత్రుడు కల్పించుకుని 'మీపై బాధ్యత పెరిగింది' అన్నారు. మంత్రి ఫరూక్ స్పందిస్తూ.. 'దీనిని బాధ్యత కంటే.. తెలుగుదేశం ప్రభుత్వం తనకు ఇచ్చిన ప్రసాదం'గా భావిస్తున్నాన్నారు.

బీసీలు ఎప్పటికీ టీడీపీతోనే.. : మంత్రి సవిత

రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి ఎన్టీఆర్ పునాదులు వేస్తే.. ఆ పునాదులపై అభివృద్ధి అనే గోపురాన్ని సీఎం చంద్రబాబు నిర్మించారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఈ బడ్జెట్‌లో సింహభాగం బీసీల అభివృద్ధికే కేటాయించారని, రాష్ట్రంలోని బీసీలు ఎప్పటికీ తెలుగుదేశం పార్టీతోనే ఉంటారని చెప్పారు. శిక్షణ పొందిన మహిళలకు త్వరలోనే కుట్టు మిషన్లు అందజేస్తామని, ఆదరణ పథకాన్ని తిరిగి అమలులోకి తెస్తామని చెప్పారు.

గత ప్రభుత్వ పొరపాట్లు సరిదిద్దాం: నాదెండ్ల

పేదలకు రేషన్ పంపిణీ వ్యవస్థలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన పొరపాట్లను సరిదిద్ది ప్రజాపంపిణీ వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను కొనుగోలు చేసి ప్రభుత్వ ఖజానాకు రూ.3 వేల కోట్లు నష్టం చేసిందన్నారు. జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి పౌరసరఫరాల సంస్థను రూ.40,750కోట్ల అప్పుల్లో ముంచేస్తే... కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ. 24,296 కోట్ల అప్పు తిరిగి చెల్లించామన్నారు.

సంక్షేమానికి బడ్జెట్ పెంచాం



» ఆర్థిక అసమానతలు తగ్గిస్తాం

» అన్ని వర్గాలకూ న్యాయం చేస్తాం

» సామాజిక సమానత్వం సాధిస్తాం

» బీసీల రిజర్వేషన్ల పెంపునకు కసరత్తు

» అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అల్పాదాయ వర్గాలవారికి ఆదాయ మార్గాలు కల్పించడం ద్వారా మెరుగైన జీవన ప్రమాణాలు పెంచేందుకు కసరత్తు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సాంఘిక సంక్షేమం, మహిళ, శిశు, గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మైనారిటీ సంక్షేమ శాఖలకు బడ్జెట్ కేటాయింపుల కోసం సంబంధిత శాఖల మంత్రులు ప్రతిపాదించిన డిమాండ్లపై సోమవారం శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, అన్ని వర్గాలవారికీ న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. "రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసి సంక్షేమం, అభివృద్ధి కోసం ఆదాయం పెంచుతామని ప్రజలకు హామీ ఇచ్చాం. ఆ దిశగానే ముందుకు వెళుతున్నాం. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, ఆయా వర్గాల జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక సమానత్వం కోసం కృషి చేస్తున్నాం. ఎన్నికల్లో కూటమికి 94 శాతం విన్నింగ్ చాన్స్ ఇచ్చారంటే ప్రజలు మనపై ఎంత నమ్మకం పెట్టుకున్నారో చూడండి. వారి నమ్మకాన్ని మనం నిలబెట్టుకోవాలి. 'సూపర్-6' హామీలను సూపర్ హిట్ చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుంది. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి వీలైనంత వరకు బడ్జెట్ కేటాయింపులు పెంచాం. వాటిని ఆయా వర్గాలకే ఖర్చు చేసేలా చిత్తశుద్ధితో పని చేస్తాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ, వారికి సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం. 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌లో నిర్దేశించుకున్న ప్రకారం ప్రజల తలసరి ఆదాయాన్ని రూ. మూడు లక్షల నుంచి రూ. 54 లక్షలకు పెంచే నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాం. బావితరాలపై ప్రధానంగా దృష్టి సారించి, అంగన్‌వాడీ కేంద్రాలు మొదలుకొని రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నాం. పీపీపీ విధానంలో రోడ్లు, విమానాశ్రయాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనతో సంపద పెరిగినప్పటికీ, సమాజంలో అసమానతలు మాత్రం తగ్గలేదు. వీటిని తగ్గించేందుకే పీ4 విధానం తీసుకువచ్చాం. రాష్ట్రంలో ఇప్పటివరకు 10 లక్షల బంగారు కుటుంబాలను ఒక లక్ష మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. సమాజంలో అసమానతలు తగ్గించడానికి పీ4 కు మించి కార్యక్రమం లేదు. దీనిని నిరంతరం పర్యవేక్షిస్తాం. ప్రభుత్వ విధానాలతోనే ఆర్థిక అసమానతలు తొలగిపోతాయి. బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు క్యాబినెట్ సబ్ కమిటీని నియమించి కసరత్తు చేస్తున్నాం. బీసీ రక్షణ చట్టాన్ని అమలులోకి తీసుకువస్తాం. బీసీల్లో కొన్ని కులాలవారు తమను ఎస్సీ, ఎస్టీల జాబితాల్లో చేర్చమని కోరుతున్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎస్సీ ఉప కులాలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలుచేసి సామాజిక న్యాయం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే"నని చంద్రబాబు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం గతంలో అమలు చేసిన జీవో 3ను నిలిపివేశారని, మళ్లీ ఆ జీవోను తిరిగి తీసుకువచ్చే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. "మైనారిటీ వర్గాల రక్షణతో పాటు అనేక విధాలుగా వారిని ఆదుకుంటున్నాం. ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాలు చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వం మాదే. మరోవైపు మహిళా కేంద్రంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఆడబిడ్డలను అన్ని విధాలుగా ఆదుకోవడానికే డ్వాక్రా సంఘాలు పెట్టాం. త్వరలోనే కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులు తీసుకువచ్చి ప్రతి వ్యక్తికీ రక్షణ కల్పిస్తాం.' అని చంద్రబాబు తెలిపారు.

ఎక్కువ మంది పిల్లలున్నా ఎన్నికల్లో పోటీ చేయొచ్చు

నీటి యాజమాన్య సంఘాల చట్ట సవరణ

అసెంబ్లీలో నీటి యాజమాన్య సంఘాల సవరణ చట్టాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సభలో ప్రవేశపెట్టడంతో శాసనసభ ఆమోదించింది. స్థానిక సంస్థల్లో మాదిరిగానే నీటి యాజమాన్య సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలంటే.. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండరాదన్న నిబంధన ప్రస్తుతం అమల్లో ఉంది. ఇప్పుడు దేశంలో పరిస్థితి మారడంతో.. ఎంతమంది పిల్లల్ని కనాలన్న దానిపై నియంత్రణ అవసరం లేదన్న ఉద్దేశంతో పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చట్టాలను సవరణ చేశారు. అదేవిధంగా నీటి యాజమాన్య సంఘ ఎన్నికల్లో ఈ నిబంధన ఎత్తేయాలని ప్రభుత్వం భావించింది. సోమవారం అసెంబ్లీలో ఏపీ ఫార్మర్స్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్(సవరణ)బిల్లు-2026ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఏఐతో పిల్లలు నిరుద్యోగులవుతున్నారు: ఎమ్మెల్యే అరవింద్‌బాబు

ఏఐ, క్వాంటమ్ కారణంగా 90 శాతం పిల్లలు ఉద్యోగాలు కోల్పోతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో నిరుద్యోగం పెరిగిపోతోంది. ప్రభుత్వాలు వారికి అండగా నిలబడాలి.

22ఏ నుంచి తొలగించాలి: ఆరణి

వైసీపీ హయాంలో తిరుపతిలో 15 వేల ఇళ్లను 22ఏలో పెట్టారు. కరుణాకర్ రెడ్డి తనకు వ్యతిరేక పార్టీ వారికి సంబంధించి ఇళ్లన్నింటినీ 22ఏలో పెట్టించారు. దీంతో వాటికి పన్నులు వసూలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఈ ఇళ్లను 22ఏ నుంచి తొలగించి, పేదలను ఆదుకోవాలి.

ఉగాదికి మెగా 'జాబ్ క్యాలెండర్'

» మరోసారి టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం

» అసెంబ్లీలో విద్యా మంత్రి లోకేశ్ వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉగాది నాటికి 'మెగా జాబ్ క్యాలెండర్' ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ వెల్లడించారు. సోమవారం అసెంబ్లీలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జాబ్ క్యాలెండర్‌లోనే టీచర్ పోస్టులు కూడా ఉంటాయని తెలిపారు. గతేడాది మెగా డీఎస్సీలో భాగంగా ఇప్పటికే 16 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశామని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర కేజీబీవీల్లో దేశంలో ఎక్కడా లేనివిధంగా అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఇక్కడ చేరేందుకు విద్యార్థినులు పోటీపడుతున్నారని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో గత రెండేళ్లలో ఫలితాలు బాగా మెరుగుపర్చామన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమని, కేంద్రం 60 శాతం నిధులు ఇస్తే, రాష్ట్రం 40 రాష్ట్రం నిధులు కేటాయిస్తుందన్నారు. కేజీబీవీల్లో విధులు నిర్వహించే ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి జీతాలు పెంచాలన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్ణయం తీసుకోవాలని, కేంద్రం అందించే బడ్జెట్ పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయమై కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నామని, దానికి కేంద్ర మంతి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారని తెలిపారు. ఎన్‌టీఎస్‌కు కేంద్రం ఒప్పుకోవాల్సి ఉందన్నారు. దాదాపు 11 వేల మంది ఈ వ్యవస్థలో పనిచేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం అంగీకరించిన తర్వాతనే జీతాలు పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. హైకోర్టులో పిటిషన్ ఉందని, దానిపై కూడా సమీక్ష చేస్తామన్నారు. కేంద్రం పీఏబీ ఆమోదించిన తర్వాతనే జీతాలు పెంపును తాము బాధ్యతగా తీసుకుంటామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఎక్కువ మొత్తంలో జీతాలు మన రాష్ట్రంలోనే చెల్లిస్తున్నామని, అయినా తాను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కలిసినప్పుడు కూడా బడ్జెట్ పెంచాలని కోరానని గుర్తుచేశారు. తొలుత ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేజీబీవీల్లో ప్రిన్సిపాళ్లను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అక్కడ విధులు నిర్వహించే సిబ్బందికి ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. కాగా, రాష్ట్రంలో వచ్చే ఏడాది సాస్కీ పథకం కింద విజయనగరం పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక సదుపాయాలు, అదనపు భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ విద్య కూడా అంతే కీలకమన్నారు.

5 శాఖల పద్దులకు ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఐదు ప్రభుత్వ శాఖలకు బడ్జెట్ కేటాయింపులకోసం మంత్రులు ప్రతిపాదించిన డిమాండ్లను శాసనసభ ఆమోదించింది. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమం,మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖలు,వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, పౌరసరఫరాల శాఖలకు నిధుల కోసం ప్రతిపాదించిన డిమాండ్లపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు వర్ల రాజా (పామర్రు), సత్యనారాయణ (పి.గన్నవరం), రామాంజనేయులు (ప్రత్తిపాడు), సత్యప్రభ (ప్రత్తిపాడు,), ప్రశాంతిరెడ్డి (కొవూరు), సౌమ్య (నందిగామ), బాలరాజు (పోలవరం), జగదీశ్వరి (కురుపాం), సోమిరెడ్డి (సర్వేపల్లి), అశోక్ (ఇచ్ఛాపురం), మాధవి (గుంటూరు పశ్చిమ), డి.పార్థసారథి (ఆదోని), మహ్మద్ నజీర్ (గుంటూరు తూర్పు), విష్ణుకుమార్‌రాజు (విశాఖ నార్త్)లు మాట్లాడారు.

తిరుమల లడ్డూ కల్తీపై నేడు చర్చ

» తిరుమలలోనూ స్వర్ణ దేవాలయం తరహా నిబంధనలు

» చంద్రబాబు సమక్షంలో మంత్రుల సూచనలు

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై మంగళవారం శాసనసభలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం అసెంబ్లీలోని తన చాంబరులో మంత్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యిపై ఎప్పుడు చర్చిద్దామని వారు అడుగగా.. మంగళవారమే పెడదామని ఆయన సూచించారు. ప్రశ్నోత్తరాల అనంతరం జీరో అవర్ రద్దు చేసి ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కల్తీ నెయ్యిపై చర్చించాలని నిశ్చయించారు. టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు ఇందులో పాలుపంచుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సీఎం మాట్లాడతారు.

స్వర్ణదేవాలయం నిబంధనలను పరిశీలించాలి..

మంత్రులతో చంద్రబాబు చర్చ సందర్భంగా పలు అంశాలు తెరపైకి వచ్చాయి. తిరుమలలో నిబంధనలను మరింత కఠినతరం చేయాలని, పంజాబ్ అమృతసర్‌లోని స్వర్ణ దేవాలయంలో నిబంధనలు కఠినంగా ఉంటాయని.. తిరుమలలోనూ ఆ తరహావి అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. కాగా.. కల్తీ నెయ్యి అంశంపై సీబీఐ సిట్ నివేదిక అమలు కోసం రాష్ట్రప్రభుత్వం ఏకసభ్య కమిటీ వేయడాన్ని సవాల్ చేస్తూ సుబ్రమణ్యంస్వామి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై చంద్రబాబు స్పందించారు. అది ఆయన వేసిన పిటిషన్ కాదని, వైసీపీ వేయించిన పిటిషన్ అని, ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

మండలిలో 26న

» సభలో, బయట ఎక్కడైనా కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధమన్న పయ్యావుల

శాసనమండలి బీఏసీ సమావేశం వాడివేడిగా సాగింది. సోమవారం ఛైర్మన్ మోషేన్ రాజు చాంబరులో జరిగిన భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నడుమ వాడీవేడి చర్చ జరిగింది. బొత్స మాట్లాడుతూ.. మీరు బీఏసీలో ఒకటి చెప్పి, సభలో ఇంకొకటి చెబుతున్నారని అధికారపక్షాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పయ్యావుల స్పందిస్తూ.. ఎక్కడైనా ఒకటే చెబుతున్నామని, సభలో గానీ, బయట గానీ కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధమని చెప్పారు. అసెంబ్లీలో, మండలిలో కల్తీనెయ్యిపై చర్చ పెడతామని మొదటి రోజే కోరామని.. చర్చ జరగకుండా మీరే నాలుగురోజులు సభ సమయాన్ని వృథా చేశారని వ్యాఖ్యానించారు. దరిమిలా.. కల్తీనెయ్యిపై 26న మండలిలో చర్చించాలని బీఏసీలో నిర్ణయించారు. బడ్జెట్‌పై మండలిలో చర్చ పెట్టాలని బొత్స కోరగా, ఇప్పటికే చర్చ పూర్తయిందని కేశవ్ సమాధానమిచ్చారు. శాసన సభలో ఇప్పటికే బడ్జెట్‌పై చర్చ పూర్తయిందని, ఇకపై ఆ అంశంపై చర్చ ఉండదని స్పష్టం చేశారు. మంగళవారం హోం శాఖపై, 25న వ్యవసాయ శాఖపై చర్చించాలని నిర్ణయించారు. 28న శనివారం మండలికి సెలవు ప్రకటించారు. తొలుత ఆ రోజు కూడా మండలి సమావేశాలు నిర్వహించాలని భావించినా సభ్యుల కోరిక మేరకు సెలవు ప్రకటించారు.

మండలిలో అదే సీన్!

ఇందాపూర్ నెయ్యి, తిరుమల లడ్డూపై వాయిదా తీర్మానాల తిరస్కరణ

» అయినా చర్చించాలని పోడియాన్ని చుట్టుముట్టిన విపక్ష ఎమ్మెల్సీలు

» రాజమండ్రి కల్తీపాలఘటనపై అనిత ప్రకటన

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీల ఆందోళన సోమవారం కూడా కొనసాగింది. ఉదయం 10.04 గంటలకు సభ ప్రారంభం కాగానే... టీటీడీకి ఇందాపూర్ డెయిరీ నెయ్యి సరఫరా, తిరుపతి లడ్డూ ప్రసాదంపై వైసీపీ సభ్యులు అరుణ్‌కుమార్, శివరామిరెడ్డి, సూర్యనారాయణరాజు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ మోషేన్‌రాజు ప్రకటించారు. దీంతో వైసీపీ సభ్యులు చర్చకు అనుమతించాలంటూ పట్టుబట్టారు. రోజూ ఇదే బిజినెస్ కాదు.. కూర్చోండంటూ ఆయన వారిని వారించారు. వెంటనే ప్రశ్నోత్తరాలు చేపట్టారు. టీడీపీ సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, కావలి గ్రీష్మ, బీటీ నాయుడు సార్వత్రిక ఆరోగ్య బీమాపై అడిగిన ప్రశ్నకు.. వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ సమాధానం చెబుతుండగానే.. వైసీపీ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని, ఛైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టి, ఇందాపూర్ డెయిరీపై చర్చకు అనుమతించాలని డిమాండ్ చేశారు. తిరస్కరించిన అంశంపై చర్చకు తావు లేదని ఛైర్మన్ స్పష్టం చేశారు. ఇందాపూర్, హెరిటేజ్‌పై చర్చ జరగాలి.. ఈ డెయిరీల పాలు-నెయ్యి కల్తీ.. ఆలీబాబా-బోలేబాబా, గోవిందా-గోవిందా అంటూ వారు నినాదాలు చేశారు. ఆలపాటి మాట్లాడుతూ.. సభ్యుల ప్రశ్నలకు సమాధానం రాబట్టకుండా అడ్డుకుంటున్నారని.. పెద్దల సభ మర్యాదను మంటగలిపేలా విపక్ష సభ్యులు పోడియంపైకి ఎక్కడం సరికాదని, మార్షల్స్‌ను పిలిచి దించేయాలని సూచించారు. అధికారపక్ష సభ్యులు కూడా పోడియం వద్దకు వెళ్లి.. విపక్షాన్ని ఆపండి.. సభ సజావుగా నడిచేందుకు చర్యలు తీసుకోవాలని ఛైర్మన్‌ను కోరారు. అధికార, విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండడంతో 10.10 గంటలకు పది నిమిషాలు వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. సుమారు నాలుగు గంటల సుదీర్ఘ విరామం తర్వాత మధ్యాహ్నం 2.02 గంటలకు సభ పునఃప్రారంభమైంది. సభ్యుల విజ్ఞప్తి మేరకు రెండు ప్రశ్నలు వాయిదా వేసి.. మిగతా ప్రశ్నలకు సమాధానాలను సభ్యులకు అందించనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ప్రత్యేక అంశాల ప్రస్తావనకు అనుమతిచ్చారు. వైసీపీ సభ్యులు పలు అంశాలను లేవనెత్తారు. ఆ తర్వాత రాజమహేంద్రవరంలో కల్తీ పాలతో నలుగురు మృతి చెందిన ఘటనపై హోం మంత్రి అనిత ప్రకటన చేశారు. దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అనంతరం మండలి సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా: సత్యకుమార్

రాష్ట్రంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం, వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య పథకం పరిధిలోకి వచ్చే పౌరులు మినహా..ప్రతి ఒక్కరికీ సార్వత్రిక ఆరోగ్య బీమా అమలు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. మండలిలో టీడీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి ఆయన జవాబిచ్చారు. రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని హైబ్రిడ్ విధానంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద మొత్తం కోటీ 63 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందుతాయని, దారిద్ర్య రేఖకు దిగువనున్న ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల వరకు బీమా కవరేజీ లభిస్తుందని, దారిద్ర్య రేఖకు ఎగువనున్న కుటుంబాలకు ఏడాదికి రూ.2.50 లక్షల బీమా కవరేజీ వర్తిస్తుందని వివరించారు.

విచ్చలవిడిగా పాల కల్తీ: బొత్స

రాష్ట్రంలో విచ్చలవిడిగా పాల కల్తీ జరుగుతోందని శాసన మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ..సభలో వేంకటేశ్వరస్వామి ఫొటోలను తాము చెప్పులు ధరించి పట్టుకున్నట్లు వీడియో పుటేజీ బయటకు వచ్చిందని.. ఛైర్మన్ తమకు చూపించిన పుటేజీలో ఎలాంటి ఆధారాలూ లేవని చెప్పారు. తమకు శుక్రవారం సభ జరిగిన సీసీ పుటేజీ మొత్తం ఇవ్వాలని, ఫొటోలు ఎలా మార్ఫింగ్ చేశారో తేల్చాలని ఛైర్మన్‌ను కోరామన్నారు.

చైర్మన్ చాంబరు వద్ద వైసీపీ ఎమ్మెల్సీల గొడవ

» తాము చెప్పులతో శ్రీవారి ఫొటోలు పట్టుకున్న క్లిప్పింగులు బయటకు రావడంపై నిరసన

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు చాంబరు వద్ద వైసీపీ ఎమ్మెల్సీలు సోమవారం నిరసనకు దిగారు. ఈ నెల 20న తాము చెప్పులు వేసుకుని శ్రీవేంకటేశ్వరస్వామి ఫొటోలు సభ లోపల, ప్రాంగణంలో పట్టుకున్నట్లుగా ఉన్న క్లిప్పింగును మంత్రి లోకేశ్ బయటపెట్టడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తొలుత వారు ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణతో భేటీ అయ్యారు. లోకేశ్ విడుదల చేసిన క్లిప్పింగులు ప్రధానంగా 'ఆంధ్రజ్యోతి'లో ఎలా ప్రచురితమయ్యాయని కొందరు అసహనం వ్యక్తం చేశారు. పాలకపక్షానికి కొమ్ముకాసేలా ఛైర్మన్ ఎలా వ్యవహరిస్తారని మరికొందరు ఆక్రోశం వెలిబుచ్చారు. ఆ క్లిప్పింగులకు విరుగుడుగా పోడియం వద్ద తాము నిరసన వ్యక్తం చేసిన ఫొటోలను విడుదల చేయాలంటూ ఛైర్మన్‌ను కోరదామని బొత్సను కోరారు. ఆయన అందుకు సమ్మతించడంతో.. ఛైర్మన్ చాంబరు ఎదుట బైఠాయించారు. బొత్సను ఛైర్మన్ తన చాంబరుకు పిలిపించుకున్నారు. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్‌తోనూ సంప్రదింపులు జరిపారు. ఛైర్మన్‌తో మాట్లాడి బయటకు వచ్చిన బొత్స.. నినాదాలు చేయాలని.. కానీ చాంబరు తలుపులు బాదవద్దని, ఈలలు వేయొద్దని వారికి సూచించారు. దీంతో.. అప్పటిదాకా నినాదాలు మాత్రమే చేస్తూ వచ్చిన వైసీపీ ఎమ్మెల్సీలు ఒక్కసారిగా చాంబరు తలుపులు గట్టిగా బాదుతూ ఛైర్మన్ బయటకు రావాలని డిమాండ్ చేశారు. దరిమిలా వారందరినీ మోషేన్‌రాజు లోపలకు పిలిచారు. శుక్రవారం మండలిలో పోడియం ఎదు ట తాము నిరసన చేసిన క్లిప్పింగులను ఇవ్వాలని వారు డిమాండ్‌చేశారు. ఇస్తానని ఆయన హామీఇవ్వడంతో నిరసన విరమించారు.

ఛైర్మన్‌కు పయ్యావుల ఫిర్యాదు..

సోమవారం కూడా శ్రీవారి ఫొటోలతో మండలికి రావాలని వైసీపీ ఎమ్మెల్సీలు అనుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్.. ఛైర్మన్ మోషేన్‌రాజును సంప్రదించారు. దీంతో స్వామి పోస్టర్లతో ప్రాంగణం, సభలోకి రావొద్దని ఛైర్మన్ ఆదేశించారు.

వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా జైళ్లు!

» ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీసెస్ బిల్లుకు ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జైళ్లలో ఖైదీల సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ఏపీ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ బిల్లు-2026ను ఆమె ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన చట్టం మేరకు రాష్ట్రంలో కూడా సంస్కరణలు అమలు చేసేందుకు ఈ బిల్లును తెచ్చామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. వారిలో పరివర్తన తీసుకురావడం కోసం చట్టంలో మార్పులు తేవాల్సి వచ్చిందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామన్నారు. వారిలో మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు వ్యవసాయంతోపాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. జైళ్లను వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా మారుస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల సామర్థ్యం 7 వేల మంది అయితే, ప్రస్తుతం అన్ని జైళ్లలో 6,900 మంది మాత్రమే ఉన్నారన్నారు. ఎమ్మెల్యేలు కూన రవికుమార్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఈ సందర్భంగా జైళ్ల పరిస్థితి విషయంలో తమ దృష్టికి వచ్చిన అంశాలను మంత్రి అనిత్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ బిల్లు-2026ను సభ ఆమోదించింది.

పాలకూట విషం!



(మొదటి పేజీ తరువాయి)

కల్తీ పాల ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. స్వచ్ఛమైన పాలు అమ్మాల్సిన వ్యాపారులు నీళ్లలో విషపూరిత రసాయనాలు కలిపి పాలులా తయారీ చేసి విక్రయిస్తున్న ఉదంతాలు తరచూ వెలుగు చూస్తున్నాయి. ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో ఈ తరహా వ్యాపారం జోరుగా సాగుతోంది. దీనిపై ప్రభుత్వం ఇన్నాళ్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టకపోవడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. స్వచ్ఛమైన, నాణ్యమైన, అప్పుడే తీసిన పాలు అని ప్రచారం చేసుకునే వారి దగ్గర విడి పాలు కొనుగోలు చేయడం ఎంతో మందికి అలవాటు. గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి. చిక్కగా, తెల్లగా, నురగలతో చక్కగా కనిపించే లీటర్ పాలును రూ.80-90 పెట్టి మరీ కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలుదారుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు అత్యాశతో కల్తీ పాపానికి ఒడిగడుతున్నారు.

యూరియాతో పాలకల్తీ: కల్తీ పాల తయారీకి యూరియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొద్దిగా పాలు, మరిన్ని నీళ్లలో యూరియా కలిపితే మొత్తం పాలుగానే కనిపిస్తాయి. గేదెలు, ఆవుల నుంచి అప్పుడే తీసిన పాలులా నురగతో ఉంటాయి. పాలల్లో కల్తీ అనేది చాలా కాలంగా స్వార్థపరులు కనిపెట్టిన విద్య. ఈ తరహా కల్తీ పాలను మిల్క్ కలెక్షన్ పాయింట్లకు తక్కువగా, రోజూ ఇళ్ల ముందు అమ్మేందుకు ఎక్కువగా సరఫరా చేస్తుంటారని సమాచారం. 100 లీటర్ల పాలల్లో 100 లీటర్ల నీళ్లు, 10 కిలోల యూరియా కలిపి కల్తీ పాలు తయారీ చేస్తున్నట్లు సమాచారం. 10 కిలోల యూరియాకు రూ.70 కూడా ఖర్చు కాదు. ఒక లీటరు స్వచ్ఛమైన లూజు పాలు రూ.80. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విడిపాలు సేకరించి విక్రయిస్తుండగా, ఇందులో కొంతమంది కల్తీలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. పదుల సంఖ్యలో ఉన్న ప్రైవేటు డెయిరీల్లోనూ ఈ తరహా కల్తీలు జరుగుతున్నట్లు అనుమానాలున్నాయి.

కానీ అతి పెద్ద యంత్రాంగం ఉన్న పశు సంవర్ధక శాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య, పశుగణాభివృద్ధి సంస్థ పాల ఉత్పత్తి, రవాణా, విక్రయాలు, కల్తీ వ్యవహారాలపై స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా సమస్య వచ్చినప్పుడో, విమర్శ వచ్చినప్పుడో స్పందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో ఏలూరు జిల్లాలోనూ కల్తీ పాల కలకలం రేపింది. ఆ తర్వాత ఇలాంటి పరిస్థితులపై నిఘా లోపించడంతో ఇప్పుడు కల్తీ పాల తంతు రాజమహేంద్రవరంలో వెలుగులోకి వచ్చింది.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు నాస్తి

గతంలో ఉన్న ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం పాల ఉత్పత్తుల భద్రత పర్యవేక్షణకు కొంత మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉండేవారు. పాలలో కల్తీ పదార్థాల ఉనికిని ఆహార భద్రతా సాధనాలతో పరీక్షించేవారు. లీగల్ మెట్రాలజీ యాక్ట్ 2009 ప్రకారం తూనికలు, కొలతల శాఖ పాల నాణ్యత సమస్యలను చూసేది. పాల నాణ్యత అంటే వెన్న(ఫ్యాట్), పాలల్లో నీటి శాతం అనేది పాల సేకరణ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న పరికరాలతో చూసేవారు. అయితే పాల సేకరణ కేంద్రాలకు లైసెన్సుల జారీ అధికారం ఈ శాఖలకూ లేదు. దీంతో పాల నాణ్యత నిర్ధారణపై ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పాల సేకరణ కేంద్రాలను స్వాధీనం చేసుకునే అధికారం కూడా లేకుండా పోయింది. దీంతో గత ప్రభుత్వం మిల్క్ యాక్ట్ తెచ్చింది. సాధారణంగా పాల సేకరణ కేంద్రాలన్నీ ప్రైవేట్ డెయిరీల చేతుల్లోనే ఉన్నాయి. ఈ కారణంగా ఫలానా డెయిరీకి పాలు పోయడం, వెన్న ఆధారంగా ధర పొందటం, డెయిరీలిచ్చే బోనస్‌లు, ఇతర సేవలను పొందడం వరకే పాడి రైతుల వంతుగా మారింది. ఒక దశలో వెన్న శాతం తక్కువగా చూపి, పాల సేకరణ కేంద్రాల నిర్వాహకులు రైతులను మోసం చేయడం కూడా జరుగుతోంది. రైతుల సంక్షేమాన్ని పర్యవేక్షించడానికి పశుసంవర్ధకశాఖ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ శాఖల మధ్య సమన్వయం లేకుండా పోయింది. పశుసంవర్ధకశాఖకు సమాంతరంగా పని చేసే పాడిపరిశ్రమాభివృద్ధి సమాఖ్య కేవలం డెయిరీలపైనే అజమాయిషీ చేస్తోంది. విడి పాల విక్రయాలు, రవాణాపై పర్యవేక్షించడం లేదు. ఇదేమంటే జిల్లాల్లో ఈ సమాఖ్యకు ఏ మాత్రం సిబ్బంది లేరని అంటున్నారు. ఏదైనా అవసరం వస్తే వెటర్నరీ డాక్టర్లతోనే చేయిస్తున్నారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లకు పాల నాణ్యత తనిఖీ చేసే అధికారం ఉన్నా.. సమస్య వచ్చినప్పుడు మినహా వాళ్లూ పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శ ఉంది. రాజమండ్రిలో కల్తీగా భావిస్తున్న పాల నుంచి నమూనాలు సేకరించి, విజయవాడలోని వీబీఆర్ఐ, విశాఖపట్నం, హైదరాబాద్‌లోని ల్యాబ్‌లకు పంపుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. కల్తీ పాలుగా గుర్తించినప్పుడు సమీప అధికారులకు ఫిర్యాదు చేయాలని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు సూచించారు.

చిరువ్యాపారుల దందా

మిల్క్ కలెక్షన్ సెంటర్లలో వెన్న(ఫ్యాట్) కొలిచే యంత్రం ఉంటుంది. కల్తీ పాలు కూడా చిక్కగా, తగిన మోతాదులో వెన్న శాతం ఉండేలా యూరియా, ఇతర కెమికల్స్ కలుపుతున్నట్లు అధికారులు గతంలోనే గుర్తించారు. కానీ స్వయం ఉపాధిగా చిరు వ్యాపారులు ఇళ్ల ముందు అమ్ముకునే పాలల్లో నాణ్యతను పరీక్షించే యంత్రాంగం ఎక్కడా లేదు. పాల ఉత్పత్తిని పర్యవేక్షించే పశుసంవర్ధక శాఖకు పాల విక్రయాలు, కల్తీ పాల తయారీ నిరోధక విధానంపై అజమాయిషీ లేదు. 2024లో మిల్క్ యాక్ట్ అమలులోకి వచ్చినా.. రైతుల ఇళ్ల వద్ద పాలు సేకరించి, ఇంటింటికీ తిరిగి అమ్ముకోవడానికి లైసెన్సులు జారీ చేసే విధానం లేదు. దీంతో పాల వ్యాపారుల అక్రమాలకు ఊతమిచ్చినట్లు అవుతోంది. రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 139,46,13,000 టన్నుల పాలు ఉత్పత్తి అయినట్లు గణాంకాలు చెప్తున్నాయి. ఇందులో మూడొంతులు డెయిరీలకు వెళ్తుండగా, మిగిలినవి స్థానికంగా పాల వ్యాపారులు సేకరించి, ఇళ్ల ముంగిటకు వెళ్లి అమ్ముతున్నారు.

మిల్క్ యాక్ట్ ఉన్నా..

పాల సేకరణ, పాడి రైతుల రక్షణ, పాల ప్రమాణాల భద్రత అమలు చట్టం-2023 ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉంది. ఈ చట్ట ప్రకారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ మిల్క్ కమిషనర్‌గా గత ప్రభుత్వం పేర్కొంది. వాస్తవంగా పశుసంవర్ధకశాఖ పాల ఉత్పత్తి వరకే బాధ్యత వహిస్తుంది. పాడి పరిశ్రమాభివృద్ధికి ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ప్రత్యేకంగా ఉన్నా.. పశుసంవర్ధకశాఖకు ఈ చట్టాన్ని అన్వయించింది. దీంతో డెయిరీలకు పాలు సరఫరా చేసే మిల్క్ కలెక్షన్ ఏజెంట్లకు మాత్రమే ఈ చట్ట ప్రకారం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు లైసెన్సులు జారీ చేస్తున్నారు. లైసెన్సు ఉన్న సేకరణ కేంద్రాల నుంచే డెయిరీలు పాలు సేకరించాల్సి ఉంది. లైసెన్స్‌దారుల దగ్గర పాల విశ్లేషణ పరికరాల నిర్వహణలో లోపాలు గుర్తిస్తే.. జరిమానాలు విధించడం మినహా కఠిన చర్యలు తీసుకునే విధానం కూడా లేదు. తనిఖీ అధికారులు కేవలం పాల విశ్లేషణ యంత్రాలను స్వాధీనం చేసుకోవచ్చు. డెయిరీలు నాణ్యత ప్రమాణాల ప్రకారం పాల ఉత్పత్తిదారులకు సరసమైన ధర చెల్లిస్తాయి. అయితే అధీకృత అధికారి జారీ చేసిన లైసెన్స్ లేకుండా ఏ వ్యక్తి కూడా పాలను సేకరించకూడదనే నిబంధన ఉంది. కానీ రైతుల నుంచి నేరుగా పాలు సేకరించి, అమ్ముకునే చిరు వ్యాపారులకు లైసెన్సు విధానం లేకపోవడమే కల్తీ సమస్యకు కారణంగా కనిపిస్తోంది. కల్తీ పాలు, కల్తీ పాల ఉత్పత్తులను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకునేలా చట్టాన్ని పటిష్ఠం చేయడంతో పాటు యంత్రాంగాన్ని సమన్వయం చేసేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

»» జనసేన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మనోహర్ సూచన

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను మరింత బలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేలా జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పని చేయాలని మంత్రి మనోహర్ సూచించారు. సోమవారం అసెంబ్లీలోని జనసేన పార్టీ శాసనసభా పక్ష కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో ఆయన భేటీ అయ్యారు. శాసనసభ, మండలి జరుగుతున్న తీరు, పార్టీ ప్రజాప్రతినిధులు అడుగుతున్న ప్రశ్నలు, పాల్గొంటున్న సభ్యులు, చట్టసభల్లో అనుసరించబోయే వ్యూహం గురించి చర్చించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రసార మాధ్యమాలతో మాట్లాడే సమయంలో పూర్తి పరిజ్ఞానంతో మాట్లాడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ తెలియజేస్తూనే, వైసీపీ కులాల మధ్య పెడుతున్న చిచ్చు.. కుట్రలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ నెల 26 నుంచి పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలవుతుందని, ప్రతి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పార్టీ కార్యక్రమాలకు తగినంత సమయం కేటాయించాలని చెప్పారు.

ప్రశ్నిస్తే అభియోగాలు.. సస్పెండ్ చేస్తామని బెదిరింపులు

»» ఉద్యోగిపై దేవదాయ శాఖ అధికారుల వేధింపులు

'మా మీదే ఆర్టీఐ ప్రశ్నలు వేస్తావా.. నిన్నెందుకు సస్పెండ్ చేయకూడదు. వెంటనే సమాధానం చెప్పు. లేదంటే విచారణాధికారి ముందు హాజరై.. వివరణ ఇవ్వు' అంటూ దేవదాయ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగిపై అధికారులు అభియోగాలు నమోదు చేశారు. దేవదాయ శాఖలో జరిగే అక్రమాలు, అవినీతి వ్యవహారాలతోపాటు అక్రమ పదోన్నతులపై అనేకసార్లు ఆర్టీఐ ద్వారా సదరు ఉద్యోగి ప్రశ్నలు సంధించారు. ఆ ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పలేకపోవడంతో అనేకసార్లు ఆర్టీఐ కమిషనర్ల వద్ద జరిగిన విచారణలో అధికారులకు మొట్టికాయలు పడ్డాయి. దీంతో అతనికి నాన్ ఫోకల్ సీటులో పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా అతనిపై ఎనిమిది అభియోగాలు నమోదు చేశారు. వాటికి వెంటనే సమాధానం చెప్పాలని కోరారు. వివరణ ఇచ్చిన తర్వాత కూడా.. దానికి తాము సంతృప్తి చెందలేదని, విచారణాధికారిని నియమించారు. శుక్రవారం విచారణాధికారి ముందు వివరణ ఇవ్వాలని సోమవారం మరొక నోటీసు జారీ చేశారు. ఈ అభియోగాలు దేవదాయ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

సీనియర్ రచయిత్రి పోలాప్రగడ రాజ్యలక్ష్మి కన్నుమూత

»» అస్సాం ఉద్యమం నేపథ్యంలో రాసిన 'రెల్లుపొదలు' నవలకు అమిత పాఠకాదరణ

»» పలు వర్సిటీల్లో ఆమె సాహిత్యంపై పరిశోధనలు



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): సీనియర్ రచయిత్రి పోలాప్రగడ రాజ్యలక్ష్మి(90) ఇకలేరు. వయసురీత్యా తలెత్తిన అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఏఎస్‌రావు నగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 9.20గంటలకు తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు గ్రామంలో 1936 ఫిబ్రవరి5న జన్మించారు. ఆమె భర్త పోలాప్రగడ సత్యనారాయణమూర్తి కూడా రచయితే. ఆయన కొంతకాలం కిందట కన్నుమూశారు. అస్సాం ఉద్యమం ఇతివృత్తంగా రాజ్యలక్ష్మి రాసిన 'రెల్లు పొదలు' నవల ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. 'ఏమైనా సరే! కథరాయాలి' శీర్షికన 1964లో ప్రచురించిన కథతో సాహిత్య సృజన ప్రారంభించిన రాజ్యలక్ష్మి... 25కుపైగా నవలలు, 150కుపైగా కథలు, కవిత్వం, వ్యాసాలు రాశారు. ఆమె కవితలు ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ ప్రచురించిన ప్రత్యేక సంపుటిలో ప్రచురితమయ్యాయి. ఆమె సాహిత్యంపై ఆచార్య నాగార్జున, ఆంధ్రా విశ్వవిద్యాలయాల్లో ఎంఫిల్, పీహెచ్‌డీ పరిశోధనలు జరిగాయి. ఆంధ్రమహిళా సభ ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తమ రచయిత్రి పురస్కారం, తెలుగు వర్సిటీ అవార్డు, నాగార్జున వర్సిటీ నుంచి ఉన్నవ పురస్కారంవంటి అవార్డులు అందుకున్నారు. రాజ్యలక్ష్మి మృతి పట్ల పలువురు రచయితలు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం అంత్యక్రియలు పూర్తిచేశారు.

ప్రైవేటు బ్యాంకులో కొత్త ఖాతా తెరిచేందుకు అనుమతివ్వండి

»» తెలంగాణ హైకోర్టులో జగతి పబ్లికేషన్ దరఖాస్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి తమ దిగుమతులకు చేసే చెల్లింపులను భారతీయ స్టేట్‌బ్యాంకు (ఎస్‌బీఐ) అనుమతించడం లేదని.. వేరే ప్రైవేటు బ్యాంకులో కరెంటు ఖాతా తెరిచి నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని జగతి పబ్లికేషన్ తెలంగాణ హైకోర్టును కోరింది. ఆ మేరకు ఆ సంస్థ దాఖలు చేసిన దరఖాస్తుపై న్యాయస్థానం సోమవారం విచారణ చేపట్టింది. జగతి పబ్లికేషన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఎస్‌బీఐ ఖాతా నిర్వహణలో ఇబ్బందులు ఉన్నందున ప్రైవేటు బ్యాంకులో వేరుగా ఖాతా తెరుస్తామన్నారు. దీనిని సీబీఐ వ్యతిరేకించింది. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి.. కొన్ని షరతులతో బ్యాంకు ఖాతా నిర్వహణకు అనుమతి ఇచ్చారని.. ఎస్‌బీఐ అనుమతించనివాటిని వేరే ప్రైవేటు బ్యాంకులు మాత్రం ఎలా అనుమతిస్తాయని స్పెషల్ పీపీ శ్రీనివాస్ కాపాటియా ప్రశ్నించారు. ఈ ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ ఇ.తిరుమలాదేవి.. తీర్పును రిజర్వు చేశారు.

కల్తీ పాలే కాటేశాయి..!

రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో ఐదుకు చేరిన మృతులు.. నలుగురి పరిస్థితి విషమం

»» 13 మందికి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స

»» మృతుల కుటుంబాలకు 10 లక్షల నష్టపరిహారం

»» బాధితుల వైద్య ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుంది

»» సీఎం ప్రకటన.. అధికారులపై సీరియస్

»» విచారణకు ఆదేశం.. వ్యాపారి అరెస్ట్



రాజమహేంద్రవరంలోని ఓ ఆస్పత్రిలో బాధితులకు అందుతున్న చికిత్సపై ఆరా తీస్తున్న రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంగా ఉండాల్సిన పాలు.. కాలకూట విషంలా మారాయి..! రాజమహేంద్రవరంలో ఐదుగురి ప్రాణాలను బలితీసుకున్నాయి..! మరో 13 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా.. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్‌తో ఐదుగురు మృతి చెందడానికి కారణం కల్తీ పాలేనని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. పరిస్థితి పట్ల సీరియస్ అయ్యారు. పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్న వారి వైద్యఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుత పరిస్థితిని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సీఎంకు వివరించారు. ఇప్పటికే పాల వ్యాపారిని అరెస్ట్ చేశామని, పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని తెలిపారు. సహాయం కోసం హెల్ప్‌లైన్ 9494060060 నంబరు ఏర్పాటు చేశామన్నారు. కాగా, లాలాచెరువు ప్రాంతానికే పరిమితం అనుకున్న కల్తీ పాల బాధితులు దివాన్‌చెరువులోనూ కనిపించడం మరింత ఆందోళన రేపుతోంది. ఈ ప్రాంతంలో ఈ నెల 20న కుయ్యేటి చాయశ్రీ (54) అనే మహిళ మృతి చెందారు. ఈ కుటుంబం కూడా సదరు పాల వ్యాపారి వద్దే పాలు పోయించుకోవడం గమనార్హం.

బాధితులు, పశువులకు రక్త పరీక్షలు

పాల వ్యాపారి గణేష్ మొత్తం 106 కుటుంబాలకు పాలు పోస్తుండగా.. సోమవారం 80 కుటుంబాల వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. గణేష్ కోరుకొండ మండలం నర్సాపురం గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో.. పశుసంవర్ధక శాఖ అధికారులు ఆ పరిసర ప్రాంతాల్లో 46 పాడిపశువుల నుంచి రక్త నమూనాలు సేకరించి వాటిని వైజ్ఞానిక, పశుసంవర్ధక శాఖ ప్రయోగశాలకు పంపారు. ఆహార భద్రత అధికారులు సేకరించిన పాలు, పెరుగు తదితర ఉత్పత్తుల శాంపిల్స్‌ను హైదరాబాద్, విశాఖపట్నంలోని ప్రయోగశాలకు పంపారు. గణేష్ ఎవరెవరికి పాలు పోశాడనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే దివాన్‌చెరువులోని బీజాపురికాలనీ వాసులకు కూడా పాలు పోసినట్టు గుర్తించారు. దీంతో బాధితులు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. పాల వ్యాపారి అనధికారిక డెయిరీని కూడా పోలీసులు సీజ్ చేశారు.

శివరాత్రి నుంచే.. అస్వస్థత మొదలు

గణేష్ ఐదేళ్లుగా పాల వ్యాపారం చేస్తున్నాడు. రైతుల నుంచి పాలు సేకరించి దివాన్‌చెరువు, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో లూజు పాలు అమ్మకాలు చేస్తున్నాడు. శివరాత్రి నుంచే పాలు తేడా వచ్చినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. ఆ రోజు పాల అమ్మకాలు ఎక్కువగా ఉండడం వల్ల ఏదైనా కలిపి ఉండొచ్చనే అనుమానం వ్యక్తమవుతోంది. దివాన్‌చెరువులోని కుయ్యేటి చాయశ్రీ కూడా గత సోమవారం అస్వస్థతకు గురై మూడు ఆస్పత్రులు తిరిగి.. చివరికి ఈ నెల 20న మృతి చెందినట్టు ఆమె భర్త మురళీకృష్ణ తెలిపారు. లాలాచెరువులోని స్వరూప్‌నగర్, చౌడేశ్వరనగర్ బాధితులు కూడా ఈనెల 16 నుంచి అంటే శివరాత్రి మరుసటి నుంచే అస్వస్థతకు గురికావడం గమనార్హం.

రెండు రోజుల్లో ఐదుగురు మృతి!

గత రెండు రోజుల్లో మృతిచెందిన వారి వివరాలను కలెక్టర్ కీర్తి చేకూరి ప్రకటించారు. లాలాచెరువుకు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధాకృష్ణమూర్తి (74), తాడి కృష్ణవేణి (76), తాడి రమణి (58) కల్తీ పాల నేపథ్యంలో ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ వల్ల మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దివాన్‌చెరువు బీజాపురి కాలనీలో కుయ్యేటి చాయశ్రీ మృతిని ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఆరోగ్యశాఖ కమిషనర్, ఏలూరు రేంజ్ ఐజీ... ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అసెంబ్లీలో అత్యవసర చర్య కింద కల్తీ పాల బాధితుల అంశం నోటీసు ఇవ్వడంతో స్వయంగా సీఎం చంద్రబాబు స్పందించారు. మంత్రి కందుల దుర్గేష్ అధికారులతో సమీక్షించారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం

»» శాసన సభలో వెల్లడించిన చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కల్తీ పాలు తాగి మృత్యువాత పడిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అస్వస్థతతో ఆస్పత్రిపాలైన వారి వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. కల్తీ పాల ఘటనపై చంద్రబాబు సోమవారం శాసనసభలో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 'రాజమండ్రిలోని చౌడేశ్వరినగర్, స్వరూప్‌నగర్‌లకు చెందిన బాధితుల రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయిలు పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. కోరుకొండ మండలం నరసాపురం గ్రామంలోని వరలక్ష్మీ మిల్క్ డెయిరీ ఆ ప్రాంతాల్లోని 106 కుటుంబాలకు రోజూ పాలు సరఫరా చేస్తోంది. ఈ డెయిరీ నుంచి వచ్చిన పాలు తాగడం వల్లే బాధితులు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఓ బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు డెయిరీ నిర్వాహకుడు అద్దాల గణేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పాలు కల్తీ చేసినట్లు విచారణలో నిర్ధారణ అయితే దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని సీఎం హెచ్చరించారు. అంతకుముందు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఈ ఘటనపై అసెంబ్లీలో ప్రకటన చేశారు. రాజమండ్రిలో జరిగిన విషాద ఘటనపై ప్రభుత్వం తనంతట తానే ముందుకొచ్చి సభలో ప్రకటన చేయడం అభినందనీయమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల వెంటనే స్పందించి.. ఈ అంశంపై శాసనసభలో చర్చించాలని నోటీసు ఇచ్చారు' అని స్పీకర్ వివరించారు.

సుబ్రహ్మణ్య స్వామికి ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ విచారణ జరపనుంది. అయితే, కమిటీ విచారణను నిలిపివేయాలని కోరుతూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో ఈ నెల 11న పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ ఉండగా, మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిటీని నియమించడాన్ని ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. కమిటీ ఏర్పాటు సుప్రీంకోర్టు గత ఆదేశాలను ఉల్లంఘించడమేనని వాదించారు. దీనివల్ల సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరుగుతున్న సిట్ విచారణపై ప్రభావం పడే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ముఖ్యమంత్రి పదే పదే భక్తులను తప్పుదారి పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఫిర్యాదుచేశారు. ఏకసభ్య కమిటీ నియామకాన్ని రద్దు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు సీఎం, సిట్, సీబీఐ, టీటీడీలను ప్రతివాదులుగా చేర్చారు. ఆ పిటిషన్ సోమవారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యాబాగ్చీలతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది.

సిట్ దర్యాప్తుపై ప్రభావం: సుబ్రహ్మణ్య స్వామి

సుబ్రహ్మణ్య స్వామి తరఫున సీనియర్ న్యాయవాది రాజశేఖర్ రావు వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీ ప్రభావం సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని సిట్ దర్యాప్తుపై పడే అవకాశం ఉందని వాదించారు. అయితే, పిటిషనర్ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. ఇది ఉద్దేశపూర్వకంగా దాఖలు చేసిన పిటిషన్‌లా ఉంది అని సీజేఐ వ్యాఖ్యానించారు.

పాలనాపరమైన దర్యాప్తు చేసుకోవచ్చు: సొలిసిటర్ జనరల్

తిరుమల కల్తీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనాపరమైన దర్యాప్తు చేసుకోవచ్చని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. "సీబీఐ మాన్యువల్ నిబంధనల ప్రకారం.. విచారణ సమయంలో నేరపూరిత అంశాలతో సంబంధం లేని 'పరిపాలనాపరమైన లోపాలు' ఏవైనా బయటపడితే, వాటిని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. సిట్ కొన్ని పరిపాలనాపరమైన లోపాలను గుర్తించింది. వాటిపై తదుపరి సమీక్ష కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. సిట్ కేవలం నేరపూరిత కోణంలో దర్యాప్తు చేసింది. ప్రభుత్వం నియమించిన కమిటీ పరిపాలనాపరమైన అంశాలను మాత్రమే పరిశీలిస్తుంది. సిట్ విచారణ సమయంలోనూ పరిపాలనాపరమైన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీతో దర్యాప్తు చేయించుకోవచ్చు. అందులో ఎటువంటి అభ్యంతరం లేదు" అని చెప్పారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, ముఖ్యమంత్రి తరఫున మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపించారు. "దురుద్దేశంతో పిటిషన్ దాఖలు చేశారు. బాధ్యులను తప్పించి, అధికారులపై చర్యలను అడ్డుకునేందుకే పాలనాపర దర్యాప్తును నీరుగార్చాలనుకుంటున్నారు. తిరుమల అంశానికి సంబంధించి ఉద్దేశ పూర్వకంగా...కొన్ని పత్రికా కథనాల ఆధారంగా రిట్ పిటిషన్ వేశారు" అని లూథ్రా వాదించారు. ప్రస్తుత వ్యవహారమంతా పాలనాపరమైన విచారణకు మాత్రమే పరిమితమని రోహిత్గీ అన్నారు.

రెండు ప్రక్రియలనూ కొనసాగించండి: ధర్మాసనం

సిట్ దర్యాప్తు ఇప్పటికే పూర్తయిన విషయాన్ని ధర్మాసనం గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పరిపాలనా విచారణ వల్ల ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండబోదని అభిప్రాయపడింది. "క్రిమినల్ విచారణ సిట్ పరిధిలోని అంశం. అయితే, పరిపాలనాపరమైన లోపాలు, నిర్లక్ష్యం లేదా క్రిమినల్ నిర్లక్ష్యానికి అవకాశం ఉండొచ్చు కదా? ఇవన్నీ ప్రభుత్వ యంత్రాంగం పరిధిలోకి వచ్చే అంశాలు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిటీని నియమించింది.పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలకు ఆధారం కనిపించడం లేదు" అని బెంచ్ తెలిపింది. సిట్ దర్యాప్తు, ఏకసభ్య కమిటీ విచారణ రెండింటినీ చట్టానికి లోబడి కొనసాగించాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను ముగించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.